ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 21.06.2026 | సంపుటి : 12 సంచిక : 332 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




## కిషన్ జీ.. రైల్వేమంత్రితో మీటింగ్
# ఏర్పాటు చేయించండి

### మెట్రో కోసం అశ్వినివైష్ణవ్‌ను కలుద్దాం



- ఐఆర్‌ఎఫ్‌సీ ఫైనాన్సింగ్, మెట్రో ఫేజ్-2 అంశాలపై చర్చిద్దాం
- 22,23 తేదీల్లో ఢిల్లీలోనే అందుబాటులో ఉంటా..
- వెంటనే కలసి సమస్య పరిష్కారానికి కృషి చేద్దాం
- కిషన్‌రెడ్డికి మరోసారి సీఎం బహిరంగ లేఖ

**హైదరాబాద్(జనంసాక్షి):** కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి మరోసారి లేఖ రాశారు. ఈమేరకు మెట్రో రైలు పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఐఆర్ ఎఫ్‌సీ ఫైనాన్సింగ్, మెట్రో ఫేజ్-2 అంశాలపై చర్చించాలని అందులో కోరారు. ఈనెల 16న ఇదే విషయమై కిషన్? రెడ్డికి లేఖ రాసినట్లు గుర్తు చేసిన రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి సమావేశం ఏర్పాటు చేయాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.జూన్ 22,23 తేదీల్లో తాను దిల్లీలో ఉంటానని కిషన్ రెడ్డికి రాసిన లేఖలో రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తామి ద్దరం కలిసి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసేలా సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మెట్రో రైలు రాష్ట్రానికి, హైదరాబాద్‌కు అత్యంత కీలక మైన మౌలిక వసతుల ప్రాజెక్టు అని, పెండింగ్ అంశాలపై మిగతా 2లో..

### ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరు కండి

ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దు

నీట్ పరీక్ష సందర్భంగా విద్యార్థులకు సీఎం రేవంత్‌శుభాకాంక్షలు

2లో..

### స్వరాష్ట్ర సాధనే శ్వాసగా జీవించిన జయశంకర్

ఆయన త్యాగం, కృషి మరువలేనిది

మహనీయుడి వర్ధంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నివాళులు



### లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో కథ మొదటికి

ఇది మా ప్రతిస్పందనలో మొదటి అడుగు

# మళ్లీ హర్మూజ్ మూసివేసిన ఇరాన్

- దురాక్రమణ ఇలాగే కొనసాగితే మరిన్ని చర్యలు ఉంటాయని వెల్లడి
- నౌకలు జలసంధి వైపు రావద్దని.. అలా వస్తే వాటి భద్రతకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరిక
- పశ్చిమాసియాలో పరిస్థితులు కుదుటపడుతున్న వేళ కీలక పరిణామం

**టెహ్రాన్(జనంసాక్షి):** అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో పరిస్థితులు కుదుటపడుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ నిరంతరం భీకర దాడులు చేస్తుండటాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన కారణంగా తాజాగా హర్మూజ్ మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇది తమ ప్రతిస్పందనలో మొదటి అడుగు అని, మిగతా 2లో..



### ట్రంప్ ఆశలపై నెతన్యాహు నీళ్లు

లెబనాన్‌పై మరోసారి ఇజ్రాయెల్ బీకర దాడులు

2లో..

### ఇజ్రాయెల్, హిజ్‌బుల్లా సీజ్‌ఫైర్‌కు అంగీకరించాయి: అమెరికా

### మూసీ పునరుద్ధరణకు భాజపా వ్యతిరేకం కాదు

- బాధితులకు న్యాయం చేశాకే ప్రాజెక్టు పనులు ప్రారంభించాలి
- సింగరేణి స్కామ్ బయటపడుతుందనే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని టార్గెట్ చేస్తున్నారు
- వర్గపోరు కారణంగానే ప్రాంతీయ పార్టీలు చీలిపోతున్నాయి: రామచందర్‌రావు

వార్త 9 లో



### బండి భగీరథ్‌కు తాత్కాలిక ఉపశమనం

వారం పాటు బెయిల్ మంజూరు



**హైదరాబాద్(జనంసాక్షి):** కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు న్యాయస్థానంలో ఉపశమనం లభించింది. ఓ యువతిపై లైంగిక దాడి కేసులో అరెస్టై చంచల్‌గూడ జైల్లో మిగతా 2లో..

# రైతులు తిరుగుబాటు చేయండి



- రైతు బంధు ప్రభుత్వం పోయి రాబందు ప్రభుత్వం వచ్చింది
- కోటాకు మించి కొనుగోలు చేయబోమన్న ప్రభుత్వ నిర్ణయం సరికాదు
- ఎక్కడికక్కడ కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి : కేటీఆర్

**బోథ్(జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం పంటలు రైతుల నుంచి కోటాకు మించి కొనుగోలు చేయబోమన్న నిర్ణయంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పండిన ప్రతి గింజ కూడా కొన్నదని.. పంటలు కొనబోమని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకునే దాకా పోరాటం చేస్తామన్నారు. 15 రోజుల కింద ప్రతి గింజ కొంటానన్న రేవంత్ రెడ్డి ఇప్పుడు మాట మార్చిండు. ఇక రైతన్నల పంటలు కొనబోమని క్యాబినెట్ సమావేశం పెట్టి మరి నిర్ణయం తీసుకున్నారు. ఇకపై కేంద్రం నిర్ణయించిన నెలకే కొంటాము కాంగ్రెస్ ప్రభుత్వం పంటలు అదనంగా కొనబోదని చెప్పిందన్నారు. కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రతీ రైతన్న దగ్గరికి ప్రతి గ్రామానికి తీసుకుపోవాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. మంత్రులంతా ప్రత్యేకంగా క్యాబినెట్ సమావేశం పెట్టుకొని రైతన్నలకు శాపం లాంటి ఒక నిర్ణయం మిగతా 2లో..

### పీఎం కిసాన్ నిధులు విడుదల

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం- కిసాన్ నిధులు విడుదలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల మిగతా 9లో..



# పెండింగ్ ప్రాజెక్టులు త్వరగా పూర్తిచేయాలి

### చింతలపాలెంలో రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**చింతలపాలెం(జనంసాక్షి):** చింతలపాలెం మండలం, దొండపాడు గ్రామ పరిధిలోని బుగ్గ మాధవరం వద్ద 394 కోట్ల రూపాయలతో 14 వేల ఎకరాలకు సాగు నీరు అందించే రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకం పనులను శనివారం రాష్ట్ర నీటిపారుదల మరియు ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు.ముందుగా మంత్రి అండర్ గ్రౌండ్ నందు పంపు హౌస్ పనులను పరిశీలించి తదుపరి సమావేశంలో మాట్లాడుతూ కృష్ణానది మీద నిర్మిస్తున్న రాజీవ్ గాంధీ ఎత్తిపోత ల పథకం ప్రాజెక్ట్ మొత్తం ఖర్చు 394 కోట్లు కాగా ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 4 మండలాలలో 14,100 ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని మేళ్లచెరువు మండలం కందిబండ గ్రామమునకు 2494 ఎకరాలకు,రామా పురం గ్రామమునకు 3826 ఎకరాలకు, హుజూర్నగర్ 149 ఎకరాలకు,చింతల పాలెం మండలం దొండపాడు గ్రామము నకు 1589 ఎకరాలకు,కోదాడ మండ లం గణపవరం గ్రామమునకు 2437 ఎకరాలకు,కూచిపూడి గ్రామమునకు 1060 ఎకరాలకు,ఎర్రవరం,రామలక్ష్మి పురం,బిక్య తండా గ్రామాలకు1634 ఎకరాలకు, తొగర్రాయి గ్రామమునకు 831 ఎకరాలకు, అలాగే చిలుకూరు మండలమునకు 80 ఎకరాలకు సాగు నీరు అందించడం జరుగుతుందని,దీని కొరకు 35 ఎకరాల రైతుల భూములను కొనుగోలు మిగతా 2లో..

### మహారాష్ట్ర విద్యార్థికి అరబ్ ఎమిరేట్స్ సెంటర్

నీట్ అడ్మిట్ కార్డుల్లో బయటపడ్డ లోపాలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నీట్ రీ-ఎగ్జామ్‌కు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జారీ చేసిన అడ్మిట్ కార్డులో లోపాలు బయటపడ్డాయి. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌కు చెందిన ఓ అభ్యర్థికి.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుధాబీలో పరీక్షా కేంద్రాన్ని కేటాయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై స్పందించిన ఎన్‌టీఏ.. మిగతా 2లో..






# నిర్మాణంలో ఉన్న ఆలయ గోడ కూలి..

### ఆరుగురు భక్తులు దుర్మరణం - శిథిలాల కింద పదుల సంఖ్యలో..

మహారాష్ట్ర పరభణి జిల్లాలోని ప్రసిద్ధ యశవాడి దేవస్థానంలో ఘోర ప్రమాదం

**ముంబై(జనంసాక్షి):** మహారాష్ట్రలో ఘోర ప్రమాదం జరిగింది. పరభణి జిల్లాలో యశవాడి గ్రామంలో ఉన్న ప్రసిద్ధ హనుమాన్ మందిర్ సభా మండపం పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు భక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. శిథిలాల కింద చిక్కుకున్న సుమారు 25 మందిని బయటకు తీసినట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల కథనం ప్రకారం, మిగతా 2లో..



### టికెట్ లేకుండా ప్రయాణిస్తే రూ.500 ఫైన్

జులై 1 నుంచి రైల్వే కొత్తరూల్స్ అమల్లోకి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారతీయ రైల్వే కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. టికెట్ లేకుండా ప్రయాణించే వారిపై జరిమానాను రూ. 250 నుంచి రూ. 500కు పెంచింది. సవరించిన నిబంధనలు జులై 1 నుంచి అమల్లోకి రానున్నాయి. సవరించిన మిగతా 2లో..

### బెంగాల్ సంకెళ్లు వీడాయి

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి నూతన ప్రభుత్వం కృషి : ప్రధాని మోదీ



**కోల్‌కతా(జనంసాక్షి):** తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వాల హయాంలో బందీగా ఉన్న బెంగాల్ సంకెళ్ల నుంచి విముక్తి పొందిందని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సీఎం సువేందు అధికారి నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బెంగాల్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో రక్తపాతాన్ని, ప్రాణనష్టాన్ని చవిచూసినప్పటికీ బెంగాల్ తన అస్తిత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని కోల్పోలేదని ప్రధాని పేర్కొన్నారు. దేశ విభజన సమయంలో రాష్ట్రాన్ని భారత్ నుంచి విడదీయడానికి కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను మిగతా 2లో..

### ఓట్ల ప్రక్షాళన కోసమే 'సర్'

### చనిపోయిన, అడ్రస్ మారిన వారి ఓట్లు మాత్రమే తొలగింపు

- అందరి ఓట్లు పోతాయన్న అపోహ సరికాదు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో జూన్ 25 నుంచి సర్ పక్రియ ప్రారంభం అవుతుందని ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జూన్ 15 నుంచి జూన్24 వరకు సన్నాహక పక్రియ జరుగుతుందని.. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫాం అందజేసే పక్రియ కొనసాగుతుందని చెప్పారు. మిస్ అయిన వారికి ఫాం 6తో మరోమారు ఎన్యూమరేట్ ఫాం అందజేసే అవకాశం ఉందన్నారు. జులై 31న ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా విడుదల చేస్తామని, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. మిగతా 2లో..






### 16 రకాల ఔషధాలపై కేంద్రం నిషేధం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రజారోగ్యం దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యాంటి బయాటిక్స్, టాపికల్, కాస్మటిక్స్‌కు సంబంధించిన 16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలను నిషేధించింది వీటి తయారీ, విక్రయం, సరఫరా నిలిపివేయాలని ఆదేశించింది. ఈ ఔషధాల కలయిక వల్ల చికిత్స నయం కావడానికి ఎలాంటి శాస్త్రీయపరమైన ఆధారాల్లేవని నిరూపితమైనట్టు పేర్కొంది. మిగతా 2లో..

## రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం



హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి

దుష్ప్రచారం తగదు: కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్(జనంసాక్షి):** హైడ్రాపై దుష్ప్రచారం జరుగుతోందని.. పనిగట్టుకుని తమను కొందరు బద్నాం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ఉండాలని, కాని దుష్ప్రచారంతో అడ్డుకోరాదని తెలిపారు. దోపిడీకి గురికాకుండా ఉండాలని ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని తెలిపారు. హైడ్రా ద్వారా లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడామని వివరించారు. శనివారం హైదరాబాద్ వేదికగా రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని తెలిపారు. చట్టం అందరికీ ఒకటేనని... హైడ్రా ఎవరికీ పక్షపాతంగా వ్యవహరించదని స్పష్టం చేశారు. మిగతా 2లో..

## పెండింగ్ ప్రాజెక్టులు త్వరగా పూర్తిచేయాలి

చేసి వారికి నష్టపరిహారంగా 17 కోట్ల 50 లక్షలు చెల్లించడం జరిగిం దని ఇట్టి ప్రాజెక్టును నాణ్యతతో ఎటువంటి లోపాలు లేకుండా త్వరగా పూర్తి చేయాలని మంత్రి గుత్తందారుల ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కే నరసింహ,ఇరిగేషన్ ఎస్సి నాగభూషణం,డిసిసి జిల్లా అధ్యక్షులు గుడిపాటి నరసయ్య,జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, చింతలపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరాల కొండారెడ్డి,దొండపా డు గ్రామ సర్పంచ్ చెన్నకేశి వెంకయ్య ,ఉపసర్పంచ్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ,పిఎసిఎస్ చైర్మన్ కలగొట్ల కోటిరెడ్డి,లిఫ్ట్ చైర్మన్ దేశాల దశరథ రామయ్య,మండ ల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీ నర్ దొంగల కార్తీక్ యాదవ్,సీనియర్ నాయకులు,స్థానిక అధికారులు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఓట్ల ప్రక్షాళన కోసమే 'సర్'

అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు సీఈవో వెల్లడించారు. ఓటరు జాబితాలో ప్రస్తుతం ఎక్కడ ఓటు ఉందో అదే అడ్రస్‌కు ఎన్యూమరేషన్ ఫాం వస్తుందని సీఈవో తెలిపారు. ఆ అడ్రస్‌లో ఓటరు లేకపోతే అతని ఓటు అక్కడ తొలగించబడుతుందన్నారు. ప్రస్తుతం ఉంటున్న అడ్రస్‌తో మళ్లీ ఓటరు ఫాం8తో ఓటును ఎన్‌రోల్‌మెంట్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సర్ ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడమని.. ఓటర్లను తొలగించడం కాదని స్పష్టం చేశారు. 24 ఏళ్లుగా ఇక్కడ ఓటర్ జాబితా ప్రక్షాళన జరగలేదన్నారు. ఈ మధ్య కాలంలో చాలా మంది మృతి చెంది ఉంటారని.. కొందరు వలస వెళ్లి ఉంటారని తెలిపారు. వాటన్నింటినీ సరి చేయడమే సర్ ఉద్దేశమని చెప్పారు. ఇందులో రాజకీయ ప్రేరేపితం ఏమీ ఉందన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలోని ప్రతీ పౌరునికి ఎన్యూమరేషన్ ఫాం ఇస్తారని తెలిపారు. కులం, మతంతో సంబంధం లేకుండా అందరికీ ఫాం ఇస్తారన్నారు. ఎన్యూమరేషన్‌లో ముస్లిం, హిందూ అనే వ్యత్యాసం ఉండదని చెప్పారు. ఒక వర్గం ఓట్లు తొలగిస్తారనే ఆందోళన అవసరం లేదని సీఈవో సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.

## నిర్మాణంలో ఉన్న ఆలయ గోడ కూలి

మహారాష్ట్ర పరభణి జిల్లాలోని యశవాడి గ్రామంలో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆర్తనాదాలు మిన్నంటాయి. స్థానిక హనుమాన్ మందిరం ముందు నూతనంగా నిర్మిస్తున్న భారీ సభా మండపం పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు శిథిలాల నుంచి ఆరుగురి మృతదేహాలను అధికారులు వెలికితీశారు.శనివారం కావడంతో హనుమాన్ మందిరంలో ప్రత్యేక కీర్తనలు, అనంతరం మహాప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారని, వీరంతా సభా మండపంలో కూర్చుని ఉన్న సమయంలోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు . ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, జిల్లా యంత్రాంగం యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాయి. మరోవైపు, జిల్లా పరిపాలనా విభాగం, విపత్తు నిర్వహణ బృందాలు రంగంలోకి దిగి జేసీబీ యంత్రాల సహాయంతో శిథిలాలను తొలగిస్తున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిలో 25 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. శిథిలాల కింద ఇంకా ఎంతమంది చిక్కుకున్నారనే కోణంలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. నిర్మాణ లోపం వల్లే ఈ పైకప్పు కూలిందా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## మహారాష్ట్ర విద్యార్థికి అరబ్ ఎమిరేట్స్ సెంటర్

సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపింది పరీక్షకు ఒకరోజు ముందు ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. నీట్ రీటెస్టుకు సమయం దగ్గరపడుతోన్న నేపథ్యంలో అబ్దుల్లా మహ్మద్ తాలిబ్ అనే అభ్యర్థి.. శుక్రవారం సాయంత్రం తన అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అందులో పరీక్షా కేంద్రాన్ని చూసి అవాక్కయ్యాడు. అబుధాబీలోని ఓ భారతీయ స్కూల్‌లో ఎన్‌టీఏ అతడికి పరీక్షా కేంద్రాన్ని కేటాయించింది. ఈ అడ్మిట్ కార్డుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. తాము ఇచ్చిన ఆప్షన్లలో అలాంటి కేంద్రం ఏదీ లేదని విద్యార్థి తండ్రి మీడియాతో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల్లోపు కొత్త అడ్మిట్ కార్డు జారీ చేస్తామని తమకు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. సమయం తక్కువగా ఉన్నందున నాగ్‌పూర్‌నే పరీక్షా కేంద్రంగా కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో తన కొడుకు తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలిపారు. ఈ సమస్యపై ఎన్‌టీఏ కూడా స్పందించింది. సాంకేతిక లోపం వల్ల ఇలా జరిగినట్లు పేర్కొంది. సమస్యను పరిష్కరిస్తున్నామని.. కొన్ని గంటల్లోనే ఆ విద్యార్థికి పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తామని స్పష్టంచేసింది. కాగా.. అడ్మిట్ కార్డులో వ్యక్తిగత వివరాలు, పరీక్ష కేంద్రాలు ఇతర ముఖ్యమైన అంశాల్లో ఏమైనా లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఈసందర్భంగా ఎన్‌టీఏ అభ్యర్థులకు సూచించింది. ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో రద్దయిన నీట్ ఎంట్రన్స్ పరీక్షను నేడు మరోసారి నిర్వహించనున్న విషయం తెలిసిందే. రీ-నీట్ అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకుని చూస్తే జరిగిన పొరపాటు గురించి తెలిసిందని అబ్దుల్లా మొహమ్మద్ తాలిబ్ అనే విద్యార్థి తెలిపాడు. తాను భారత్‌లో ఉంటే తన పరీక్ష కేంద్రం మాత్రం యూఏఈలో ఉన్నట్టు అడ్మిట్ కార్డులో కనిపించిందని అన్నాడు. నాగ్‌పూర్‌లో పరీక్ష కేంద్రం కోసం అతడు దరఖాస్తు చేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయం ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లగా సాంకేతిక సమస్య కారణంగా ఇలా జరిగిందని సంస్థ తెలిపినట్టు విద్యార్థి తండ్రి తెలిపారు. సమస్యను పరిష్కరిస్తామని, సవరించిన అడ్మిట్ కార్డును జారీ చేస్తామని పేర్కొన్నట్టు చెప్పారు. ఈ మేరకు ఎన్‌టీఏ నుంచి ఈమెయిల్ వచ్చిందని వెల్లడించారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

### ఢిల్లీలో మరోసారి ఆందోళనకు దిగిన కాక్రోచ్ పార్టీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఢిల్లీలో హైటెన్షన్ నెలకొంది. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ)' ఆందోళనల్లో ఉద్రిక్తత నెలకొంది. నీట్ పేపర్ లీక్, కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్లతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. అయితే, తమ నిరసన టైమ్ పొడగించాలని సీజేపీ డిమాండ్‌ను పోలీసులు తిరస్కరించారు. దీంతో నిరసనకారుల్ని పోలీసులు ఆ ప్రదేశం నుంచి శాంతియుతంగా తొలగించడంతో ఉద్రిక్తత మొదలైంది. సాయంత్రం 6 గంటలకు కూడా మద్దతుదారులు పెద్ద సంఖ్యలో చేరాలని సీజేపీ పిలుపునిచ్చింది. అయితే, ఢిల్లీ పోలీసులు మాత్రం గడవు ముగిసిందని, నిరసనకారులు ప్రదేశాన్ని ఖాళీ చేయాలని ఆదేశించారు. జంతర్ మంతర్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే, ఎస్ఎఫ్ఐకి చెందిన పలువురు విద్యార్థి నాయకులు ఇంకా వేదికపైనే ఉన్నారు. దీనికి ముందు జనాలను ఉద్దేశిస్తూ ప్రసంగించిన దీప్కే.. శాంతియుత నిరసనకు అనుమతి పొడగించాలని ఢిల్లీ పోలీసుల్ని కోరారు.

## కిషన్ జీ.. రైల్వే మంత్రితో మీటింగ్ ఏర్పాటు చేయించండి

త్వరితగతిన నిర్ణయం తీసుకోవడం అవసరమని లేఖలో పేర్కొన్నారు. రైల్వే మంత్రితో భేటీ సమయంలో చర్చకు అవసరమైన వివరాలు తీసుకొస్తానని తెలిపారు. ఒప్పందాలు, సంబంధిత పత్రాల కాపీలను తీసుకొస్తానన్నారు. సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలపాలని కిషన్ రెడ్డిని రేవంత్ రెడ్డి కోరారు.హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణ, ఐఆర్ఎఫ్‌సి రుణ నిధుల కోసం కేంద్రం తక్షణమే విడుదల చేసేందుకు చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఇటీవల రాసిన బహిరంగ లేఖలో కోరారు. ఈ విషయంపై చర్చించేందుకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేయాలని ఆ లేఖలో కోరారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 మూడు కారిడార్లలోని 69 కిలోమీటర్ల మేర ప్రయాణికులకు సేవలను అందిస్తోంది. పెరిగిన జనాభా, పట్టణ విస్తరణకు అనుగుణంగా మెట్రో నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్-2 ప్రతిపాదనలను కేంద్రప్రభుత్వానికి సమర్పించింది. ఈ ప్రతిపాదనలలో మొత్తం 7 కారిడార్లతో 122.9 కిలోమీటర్ల రూట్? ఉంది. దీని అంచనా వ్యయం సుమారు రూ.38,595 కోట్లుగా ఉంది. ఫేజ్-1 ను ప్రైవేటుగా నిర్వహించడం, ఫేజ్-2ను వేరొక సంస్థాగత యంత్రాంగం కింద అమలు చేయడంపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ పలు అభ్యంతరాలను లేవనెత్తిన విషయం తెలిసిందే. వాటిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణాత్మకంగా అంగీకరించింది.

మొత్తం రూ.15,000 కోట్ల లావాదేవీలు

మొత్తం మెట్రో వ్యవస్థ ఒకే నెట్‌వర్క్‌పై నడిచేవిధంగా చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్-1ను తన అధీనంలోకి తీసుకుంది. దీనిలో భాగంగా ఈక్విటీ కొనుగోలు కోసం రూ. 1,461.47 కోట్లు, ప్రాజెక్ట్ అప్పుల రీఫైనాన్సింగ్‌కు రూ.13,538.53 కోట్లు కలిపి మొత్తం రూ.15 వేలకోట్ల లావాదేవీలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించింది. ఈ కమిటీకి కేంద్రం తరపున ఉత్తర ప్రదేశ్ మెట్రో ఎండీ సుశీల్ కుమార్‌ను నామినేట్ చేశారు. ఈ ప్రాజెక్టను ఐఆర్ఎఫ్‌సీ క్షుణ్ణంగా పరిశీలించి రుణ మంజూరు కోసం సంతకాలు చేసింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చింది. ఆర్‌బీఐ ద్వారా డైరెక్ట్ డెబిట్‌కు అంగీకరించింది. ఐఆర్ఎఫ్‌సీ రూల్స్‌ప్రకారం, మొదటి విడత నిధుల విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 84.32 కోట్ల ముందస్తు ఫీజును చెల్లించింది.

## ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరు కండి

హైదరాబాద్(జనంసాక్షి):నీట్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పునర్నిర్వహిస్తున్న ఈ పరీక్షలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు, ఒత్తిళ్లకు గురికాకుండా పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్య విద్యలో ప్రవేశానికి ముఖ్యమైన ఈ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతోకాలంగా కృషి చేశారని పేర్కొన్నారు. తమ శ్రమ, పట్టుదలపై నమ్మకం ఉంచి అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్షకు సంబంధించి తెలంగాణలో సుమారు 208 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 2.95 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షా నిబంధనలను పాటిస్తూ ప్రశాంతమైన మనసుతో పరీక్ష రాయాలని సూచించారు. విద్యార్థులందరూ తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

## స్వరాష్ట్ర సాధనే శ్వాసగా జీవించిన జయశంకర్

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ జాతిపిత, స్వరాష్ట్ర స్వాప్నికులు ప్రొఫెసర్ కె. జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడి త్యాగాన్ని, కృషిని ముఖ్యమంత్రి రేవంత్ స్మరించు కున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలుగా ఆయన జీవితాన్ని గడిపారని గుర్తు చేసుకున్నారు. ఆ మహనీయుడి త్యాగాన్ని తెలంగాణ సమాజం, ప్రజా ప్రభుత్వం సదా గుర్తుంచుకుంటుం దని తెలిపారు. ఆ మహనీయుడి ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని చెప్పారు. ఆయన ఆశయ సాధనకు కోసం ప్రజా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేయడాన్ని జయశంకర్ సార్ వ్యతిరేకించారని తెలిపారు. ఏపీలో విలీనంతో జరిగిన అన్యాయాన్ని ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఆరు దశాబ్దాలు సజీవంగా ఉంచిన ఘనత ఆయనదేనని కొనియాడారు.

## బెంగాల్ సంకెళ్లు వీడాయి

విస్మరించినందుకు ప్రజలు కాంగ్రెస్‌కు, టీఎంసీకి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఒకే ఒక్క ఎన్నికల తీర్పు తెచ్చిన మార్పు రాష్ట్రవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వెంబడి కంచె ఏర్పాటుకు టీఎంసీ ప్రభుత్వం భూమిని కేటాయించలేదని ప్రధాని దుయ్యబట్టారు. ఓటుబ్యాంకు కోసం చొరబాటుదారులను రాష్ట్రంలోకి మమత అనుమతించారని ఆరోపించారు. ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారంలోకి వచ్చిన వెంటనే సరిహద్దుల్లో కంచె ఏర్పాటుకు భాజపా ప్రభుత్వం భూమిని కేటాయించిందన్నారు.

## ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

భువనేశ్వర్(జనంసాక్షి): ఒడిషా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్బ' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## రైతులు తిరుగబాటు చేయండి

తీసుకున్నారు. ఇకపైన తెలంగాణలో పంటలు కొనబోమని రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం మొత్తం రైతాంగానికి శాపంగా మారబోతోందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇకపై ప్రభుత్వం ఇక్కడి నుంచి గింజలు కొనదట, వడ్లు కొనదట. రైతులు పండించే జొన్నలు, శనగలు కూడా కొనదట. మోదీ ప్రభుత్వం ఎంత కొనమంటే అంతే కొంటారట. అంటే ఎకరానికి 40 క్వింటాళ్ల వడ్లు పండించినా, రేపు మోదీ ప్రభుత్వం కోటా 10 క్వింటాళ్లే అని చెబితే, అంతే కొనుగోలు చేస్తారట. మిగిలిన 30 క్వింటాళ్లు బయట అమ్ముకోవాల్సి వస్తుంది. నిన్న ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇదే. నేను రైతులకు ఒకటే పిలుపు ఇస్తున్నాను.. అధికారులపై కాంగ్రెస్ నాయకుల కాళ్లు పట్టుకోవాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి. మీరు ప్రకటించిన బోనస్ ఎక్కడ పోయిందని అడగాలి. మీరు హామీ ఇచ్చిన కొనుగోలు కేంద్రాలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించాలి. మీ ప్రభుత్వ అసమర్థత వల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీయాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.రైతుల పంటలు కొనబోమన్న రేవంత్ రెడ్డిని మేము వదిలిపెట్టమని హెచ్చరించారు. 15 రోజుల క్రితం నువ్వే కదా 'చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం' అని చెప్పింది. ఈరోజు ఏమైంది..? 'మోదీ మెడలు వంచుతా, చివరి గింజ వరకు కొనుగోలు చేస్తా' అని గొప్పలు చెప్పావు. ఇప్పుడు ఎందుకు వెనక్కి తగ్గుతున్నావు..? అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఎనిమిది మంది ఎంపీలు ఉన్నారు. ఆదిలాబాద్‌లో కూడా బీజేపీ ఎంపీ ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎంత బాధ్యత ఉందో, ఈ 16 మంది ఎంపీలకు కూడా అంతే బాధ్యత ఉంది. కేసీఆర్ ప్రభుత్వం ఉన్న సమయంలో కూడా మోదీ ప్రభుత్వం "మేము వడ్లు కొనము" అని చెప్పినప్పుడు, మొత్తం మంత్రివర్గంతో కలిసి మేమంతా ఢిల్లీకి వెళ్లామన్నారు. కేసీఆర్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు అందరం ధర్నా చేసి, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, వడ్లు కొనుగోలు చేసేలా చేసిన నాయకుడు కేసీఆర్ అన్నారు.ఈరోజు ఉన్న 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. పంటలు కొనకుండా రేవంత్ రెడ్డి తప్పించుకోవాలని చూసినా ఆయనను వదిలిపెట్టం. ఎంపీలను కూడా ప్రశ్నిస్తాం. ఆదిలాబాద్ ప్రజలు గెలిపించిన బీజేపీ ఎంపీని కూడా నిలదీయాలని అన్నారు.

## బండి భగీరథ్‌కు తాత్కాలిక ఉపశమనం

రిమాండ్‌లో ఉన్న భగీరథ్‌కు మల్కాజ్‌గిరి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత కొన్ని రోజులుగా భగీరథ్ జైలు జీవితం అనుభవిస్తున్నాడు. తాజాగా ఇంజనీరింగ్ పరీక్షల నేపథ్యంలో న్యాయవాదులు మధ్యంతర బెయిల్ కోరారు. వాదనల విన్న కోర్టు నెల 26 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇదిలా ఉండగా.. గత నెలలో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అతడిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కొన్ని రోజులుగా అజ్ఞాతంలో ఉన్న భగీరథ్ మే 17న ఎట్టకేలకు పోలీసులకు లొంగిపోయాడు. ఇక, నిందితుడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు గతంలో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. మేడ్చల్ మేజిస్ట్రేట్ అతడికి 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు. అంతకుముందు రెండు గంటలకుపైగా సిట్ అధికారులు అతడిని విచారించారు. అప్పటి నుంచి నెల రోజులకు పైగా జైలు జీవితం గడిపిన భగీరథ్ తాజాగా బెయిల్‌పై బయటకు రానున్నాడు.

## టికెట్ లేకుండా ప్రయాణిస్తే రూ.500 ఫైన్

- జులై 1 నుంచి రైల్వే కొత్తరూల్స్ అమల్లోకి

నిబంధనల ప్రకారం చెల్లుబాటు కానీ లేదంటే ఇప్పటికే వినియోగించిన టికెట్‌తో తిరిగి రైలు ప్రయాణం చేస్తే.. ఆ టికెట్ ఛార్జీలతో పాటు అదనంగా రూ.500 ఫైన్ కట్టాల్సి ఉంటుంది. ఇంతకుముందు రూ.250గా ఉండగా.. ఇప్పుడు రెట్టింపు చేసింది. ఇతరుల పేరుపై బుక్ చేసుకొని ప్రయాణించినట్లయితే.. టికెట్ చెల్లదు. ఆ ప్రయాణికుడు రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ జరిమానా చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు ఎదుర్కొవాల్సి వస్తుంది.అనుమతి లేకుండా ప్రయాణికులు లేదా విక్రేతలు రైళ్లలో లేదంటే రైల్వే స్టేషన్‌లో తినుబండారములు, ఇతర వస్తువులు విక్రయించకూడదు. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.2 వేల జరిమానా. రైల్వే కోచ్‌లలో, స్టేషన్‌లో భిక్షాటన నిషేధం. ఏడాదిలో పదేపదే రైల్వే నిబంధనలను ఉల్లంఘిస్తే వారు జైలు శిక్ష ఎదుర్కొవాల్సి ఉంటుంది. రైల్వేస్టేషన్‌లో లేదా రైలు ప్రయాణంలో తోటి ప్రయాణికులతో అసభ్యంగా ప్రవర్తించిన, దూషించిన వారికి భారీగా జరిమానాలు విధిస్తారు.మహిళలకు కేటాయించిన బెర్తులు, కోచ్‌ల్లో పురుషులు ప్రవేశిస్తే రూ.2500 వరకు జరిమానా .


## 16 రకాల ఔషధాలపై కేంద్రం నిషేధం

డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డుకు చెందిన నిపుణుల కమిటీ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. రెండు, మూడు రకాల ఔషధాలను ఒకే మోతాదులో కలిపి ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలను తయారుచేస్తారు. వీటి పనితీరుపై డీటీఏబీ కొన్నేళ్లుగా సమీక్షిస్తోంది. ఈ క్రమంలోనే చికిత్స మెరుగుదలకు ఎలాంటి ప్రయోజనం లేని 16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలపై నిషేధం విధించాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు యాంటిబయాటిక్స్, టాపికల్, కాస్మటిక్స్‌కు చెందిన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్లను కేంద్రం బ్యాన్ చేసింది.

## మళ్లీ హర్మూజ్ మూసివేసిన ఇరాన్

దురాక్రమణ ఇలాగే కొనసాగితే మరిన్ని చర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ సంయుక్త సైనిక విభాగ కేంద్రమైన ఖతమ్-అల్ అన్బియా ప్రకటించినట్లు అక్కడి అధికారిక మీడియా పేర్కొంది.నౌకలు జలసంధి వైపు రావద్దని.. అలా వస్తే వాటి భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ స్పష్టం చేసింది. ఏదైనా ఒప్పందం అమలు దశలోకి వచ్చినప్పుడు మాత్రమే అన్ని విషయాలు తెలుస్తాయని పేర్కొంది. ఇదే సమయంలో, మధ్యంతర ఒప్పందంపై అమెరికాతో చర్చలు జరిపేందుకు స్విట్జర్లాండ్‌కు తమ బృందం వెళ్తున్నట్లు ఇరాన్ వెల్లడించింది. మరోవైపు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా త్వరలోనే స్విస్‌కు వెళ్లనున్నట్లు సమాచారం. సాంకేతిక అంశాలపై రెండు దేశాలు చర్చలు జరిపేందుకు శుక్రవారమే అక్కడకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ.. అది వాయిదా పడిన విషయం తెలిసిందే.

## ట్రంప్ ఆశలపై నెతన్యాహు నీళ్లు



బీరూట్(జనంసాక్షి):పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నానా తంటాలు పడుతుంటే.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆ ప్రయత్నాలకు గండికొడుతున్నారు. శనివారం దక్షిణ లెబనాన్‌లో ఇజ్రా యెల్ సైన్యం వైమానిక దాడులు చేసింది. హెజ్‌బొ ల్లాతో కాల్పుల విరమణకు అంగీకరించినట్టే అంగీకరించి మళ్లీ దాడులు చేసింది దాంతో లెబనాన్‌లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పశ్చిమాసియాలో ఘర్షణలకు ముగింపు పలికేలా వాషింగ్టన్-టెహ్రాన్ కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాన్ని (ఎంవోయూ) ఖాతరు చేయకుండా.. ఇజ్రాయెల్ హెజ్‌బొల్లా పరస్పర భీకరదాడులు చేసుకున్నాయి. దాంతో యుద్ధం శాశ్వత ముగింపు కోసం అమెరికా-ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లోని జెనీవా వేదికగా శుక్రవారం ప్రారంభం కావాల్సిన సంప్రదింపులు వాయిదా పడ్డాయి. ఆ తర్వాత ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా కాల్పుల విరమణకు అంగీకరించాయి. యూఎస్, ఖతార్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణకు ఇరువర్గాలు అంగీకరించినప్పటికీ.. అది ఎంతకాలం కొనసాగుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. అన్నట్టుగానే కొన్ని గంటల వ్యవధిలోనే లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేసింది. యుద్ధ విమానాలు, డ్రోన్లతో నబటియే ప్రాంతంలో అర్ధరాత్రి సమయంలో చేసిన దాడుల్లో నివాస భవనాలు ధ్వంసమయ్యాయని లెబనాన్ మీడియా సంస్థ వెల్లడించింది.మరోవైపు నెతన్యాహు వ్యవహారశైలిపై ట్రంప్ తీవ్ర అసహనంతో ఉన్నారు. హెజ్‌బొల్లాతో కాల్పుల విరమణకు అంగీకరించాలని తాను వ్యక్తిగతంగా ఇజ్రాయెల్‌ను కోరినట్లు ఆయన ఇప్పటికే చెప్పిన సంగతి తెలిసిందే. సంయమనం పాటించాలని ఆ దేశ అధికారులపై ఒత్తిడి తెచ్చానని ఘర్షణలు ఇలాగే కొనసాగితే ఇరాన్ (ఎతీజీని)తో శాంతి ఒప్పందం దెబ్బతినే ప్రమాదం ఉందని వాదించినట్లు చెప్పారు. ప్రశాంతంగా ఉండాలని.. కొంచెం బుర్ర ఉపయోగించి నిర్ణయం తీసుకోవాలని ఇజ్రాయెల్‌కు ట్రంప్ సూచించినట్లు తెలుస్తోంది.

### ఇజ్రాయెల్ రాయబారి, ఐరాస ప్రతినిధి మధ్య వాగ్వాదం

ఐక్యరాజ్యసమితిలో రసాభాస చోటుచేసుకుంది. ఇజ్రాయెల్ రాయబారి, ఐరాస సెక్రటరీ జనరల్ ప్రత్యేక ప్రతినిధి మధ్య వాగ్వాదం నడిచింది. ఘర్షణల సమయంలో లైంగిక హింస నిర్మూలన అంశంపై న్యూయార్క్‌లో జరిగిన సమావేశంలో మాటల యుద్ధం చోటుచేసుకోవడంతో ఇతర సభ్యులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది ఇంతకీ ఏం జరిగిందంటే..? సంక్షోభ ప్రదేశాల్లో లైంగిక హింసపై ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన వార్షిక నివేదిక వివాదాస్పదంగా మారింది. దీనిలో రష్యా, ఇజ్రాయెల్ దళాల పేర్లను కూడా చేర్చడంతో ఆ దేశాలు మండిపడ్డాయి. దాదాపు 15 ఏళ్ల క్రితం మొదలైన ఈ నివేదికలో తొలిసారి ఇజ్రాయెల్ పేరును చేర్చారు. పాలస్తీనాలో ఆ దేశ దళాలు చేస్తున్న హింసకు ఫలితంగానే ఐరాస ప్రతినిధి ప్రమీలా పాటెన్ దీనిని ప్రవేశపెట్టారు. పాటెన్ పక్షపాతంతో వ్యవహరించారని, ఆమె రాజీనామా చేయాలని ఈ సమావేశంలో ఇజ్రాయెల్ రాయబారి డానీ డానన్ డిమాండ్ చేశారు. అలాగే ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ పైనా విమర్శలు గుప్పించారు. దీంతో మరో యూఎన్ ప్రతినిధి వానెస్సా ఫ్రేజియర్ స్పందించారు. సభా మర్యాద కాపాడాలని, వ్యక్తిగత దాడులకు దూరంగా ఉండాలంటూ ఆమె కాస్త అరిచి చెప్పారు. అలాగే తమవద్ద సాక్ష్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. 'ఇజ్రాయెల్ ఐరాసలో సభ్య దేశం. మీరు యూఎన్‌లో పనిచేస్తున్నారు. కాస్త మీరు నోరు మూసుకోండి. ఆ రిపోర్టు సిగ్గుచేటు. మీరు ఈ పదవిని ఎందుకు తీసుకున్నారో నాకు తెలుసు. మాకు వ్యతిరేకంగా జరుగుతోన్న ప్రచారంలో మిమ్మల్ని భాగం కానివ్వబోం" అంటూ ఫ్రేజియర్‌ను ఉద్దేశించి ఇజ్రాయెల్ రాయబారి డానీ డానన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.దీంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. కాగా.. పాలస్తీనాలో చిన్నారుల హక్కుల ఉల్లంఘనల ఘటనలు పెరగడంపై గుటెరస్ ఇప్పటికే ఆందోళన వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది.

## ఇజ్రాయెల్, హిజ్‌బుల్లా సీజ్‌ఫైర్‌కు అంగీకరించాయి

న్యూయార్క్(జనంసాక్షి): ఇజ్రాయెల్, హిజ్‌బుల్లా మధ్య కాల్పుల విరమణ అగ్రిమెంట్ కుదిరినట్లు అమెరికా అధికారులు తెలిపారు. శుక్రవారం దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడిలో 47 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. లెబనాన్‌లో హిజ్‌బుల్లా జరిపిన దాడిలో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు కూడా మృతిచెందారు. ప్రస్తుతం సీజ్‌ఫైర్ అమలులో ఉన్నట్లు ఇజ్రాయిలీ సైన్యం కన్ఫర్మ్ చేసింది. కానీ ఎటువంటి సమస్యలు ఉన్నా.. ఎదుర్కొంటామని ఐడీఎఫ్ చెప్పింది. అయితే సీజ్‌ఫైర్ గురించి ఇంకా హిజ్‌బుల్లా కన్ఫర్మ్ చేయలేదు. హిజ్‌బుల్లాను అంతం చేయాలని ఇజ్రాయెల్ సంకల్పించిందని, కానీ ఆ ప్రాజెక్టు పూర్తి కాలేదని హిజ్‌బుల్లా సెక్రటరీ జనరల్ షేక్ నయిమ్ ఖాసిమ్ తెలిపారు. ప్రస్తుతం ఇరాన్, అమెరికా మధ్య శాంతి ఒప్పందం వాయిదా పడడంతో .. లెబనాన్ పరిస్థితి కూడా ఆగమ్యగోచరంగా మారింది. హిజ్‌బుల్లాపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యహూ అనుచితంగా వ్యవహరిస్తున్నారని గతంలో ట్రంప్ ఆరోపించిన విషయం తెలిసిందే.

## రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం

హైడ్రా డిజాస్టర్ కోసం కాదని.. ఆస్తుల పరిరక్షణ కోసమేనని తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో తమపై అసత్యాలు చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో రాష్ట్ర సర్కార్ హైడ్రాకి ఫ్రీడం ఇచ్చిందని రంగనాథ్ వెల్లడించారు. పార్టీలకు అతీతంగా తాము పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో ఫాతిమా కాలేజీ లాగా చాలా స్కూల్స్, కాలేజీలు ఉన్నాయని ప్రస్తావించారు. హైడ్రాకి ఎంఐఎం, కాంగ్రెస్ అందరూ ఒకటేనని తేల్చిచెప్పారు. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదన్నారు. హైడ్రా రాత్రికి రాత్రి నిర్మాణాలను కూలగొడుతుందనేది తప్పుడు ప్రచారమని తెలిపారు. గుడిసెలు వేసిన చోట మీడియాని తీసుకెళ్లి చూపించామని... అప్పుడు ఉన్నదాని కంటే వంద గుడిసెలు ఎక్కువగా పెరిగాయని.. దాని వెనకాల కొన్ని శక్తులు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గుడిసెలు వేసిన చోట జెన్యూన్‌గా ఉన్నాయా? లేదా? పరిశీలించి... డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైడ్రా రాకపోతే... ఇప్పుడు ఉన్నవి కూడా కనపడకుండా పోయేవని రంగనాథ్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన భాగ్యనగరంలో కురిసిన వర్షానికి సిటీ అతలాకుతలం అయిందని అన్నారు. లక్షమందికి మంచి చేయాలంటే కొందరికి చెడు జరుగుతుందని తెలిపారు. హైడ్రా తప్పు ఉంటే తప్పకుండా క్షమాపణ అడుగుతామని చెప్పారు. హైడ్రా చాలా నేర్చుకుందని, చాలా పనులు పూర్తి చేసిందని... తప్పులు జరిగితే.. సరి చేసుకుంటూ ముందుకెళ్తుందని వివరించారు. హైడ్రా సెటిల్‌మెంట్లకు అడ్డాగా కాకుండా.. రాజకీయాలకు అతీతంగా ముందుకు పోతుందని స్పష్టం చేశారు. ప్రజలకు నమ్మకం, విశ్వాసం కలిగేంచే విధంగా హైడ్రా పని చేస్తోందని రంగనాథ్ పేర్కొన్నారు.

# పాడి రైతుకు ప్రభుత్వం భరోసా

- 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలు
- పాడి రైతులకు బకాయిల్లేని చెల్లింపులు
- లాభసాటిగా తెలంగాణ పాడి పరిశ్రమ
- డిప్యూటీ సీం భట్టి విక్రమార్క వెల్లడి



**హైదరాబాద్, జూన్ 20 (జనంసాక్షి) :** రాష్ట్రంలో పాడి పరిశ్రమ విద ఆధారపడి జీవం సాగిస్తున్న రైతులను ఆదుకోవడంతో పాటు విజయా డైరీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రజాప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని పాడిపరిశ్రమను ఆదుకోవాలని, పాల ఉత్పత్తులపై ఆధారపడిన వారి జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రజాప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటను ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు,అంగన్ వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ నుంచి పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో ఉన్నత స్థాయి సవిక్షా సమావేశం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంంలో డిప్యూటీ సీఎంతో పాటు పశుసంవర్ధక శాఖా మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో పాల వినియోగం, సేకరణ, రైతులకు చెల్లించాల్సిన బిల్లులపై లోతైన చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పాల వినియోగం, కొత్తగా ప్రభుత్వం ప్రకటించిన మేరకు వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థులకు పాలను అందించే అంశంపై అధికారులతో చర్చించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మొత్తం పాల ఉత్పత్తికి సంబంధించి ఖచ్చితమైన లెక్కలు తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పాలిచ్చే పశువుల అసలు సంఖ్యను గుర్తించాలని ఆదేశించారు. పాలిచ్చే పశువుల ద్వారా వస్తున్న వాస్తవ ఉత్పత్తిని లెక్కగట్టి సమగ్ర నివేదికను తదుపరి సమావేశంలో ఇవ్వాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశించారు.ౖతుల నుంచి సేకరించే పాల ధరపై స్పష్టమైన విధానం ఉండాలన్నారు. రైతులకు బకాయులు లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలన్నారు. పాఠశాలలకు సరఫరా చేసే పాలకు సంబంధించిన బిల్లులను సంక్షేమ శాఖలు నేరుగా ఆయా విభాగాలకే బదిలీ చేయాలని చెప్పారు. దీనివల్ల రైతులకు ఎలాంటి బకాయిలు ఉండవని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు పాడి పరిశ్రమ విదే ఆధారపడతారని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులకు సమయానికి డబ్బులు చెల్లిస్తే.. వారి కుటుంబం ఆర్థికంగా బలోపేతం అవుతుంది.. డైరీకి నమ్మకంతో పాలు పోస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చేందుకు, పాల ఉత్పత్తులను గణనీయంగా పెంచేందుకు ఆధునిక పద్ధతులను అనుసరించాలని ఆయన సూచించారు. రైతులకు వ్యవసాయం పైనే కాకుండా, పాడి పరిశ్రమ ద్వారా అదనపు జీవనోపాధి కల్పించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు.

# హనుమకొండలో పేదల ఇండ్లు కూల్చివేత

- గుండ్ల సింగారం బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం
- ఇండ్ల పట్టాల సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య పోరాటాలు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**హనుమకొండ ప్రతినిధి జూన్ 20 (జనంసాక్షి) :** హనుమకొండ గుండ్ల సింగారంలో శనివారం పేదల ఇళ్ళు కూల్చి వేయడం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం గుండ్ల సింగారంలో పేదల ఇళ్ళు కూల్చివేత విషయం తెలుసుకున్న కూనంనేని సాంబశివరావు హుటా హుటిన హైదరాబాద్ నుండి విచ్చేసి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు,జిల్లా సిపిఐ నాయకులతో కలిసి గుండ్ల సింగారంలో సందర్శించారు. ఈ సందర్భంగా గుడిసె వాసులు సిపిఐ నాయకులకు తమ గోడు వెళ్లబోసుకుని, చిన్న పిల్లలు, మహిళలు అని చూడకుండా తమను తమ ఇండ్ల నుండి ఈడ్చి పడేశారని తెలిపారు. అలాగే బియ్యం, ఇతర నిత్యావసరాలను రోడ్డు పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.కాగా విద్యార్థుల సర్టిఫికేట్ లను సైతం తీసుకోనివ్వకుండా పోలీసులు ఈడ్చుకొని వెళ్లారని విద్యార్థులు తెలిపారు. అనంతరం కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడుతూ హనుమకొండ గుండ్ల సింగారంలో ఇండ్లు కోల్పోయిన పేదలకు న్యాయం జరిగే వరకూ తాము అండగా ఉంటామని అన్నారు. భూకబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా స్పందించని అధికారిక యంత్రాంగం నిలువ నీడ లేని పేదలు 50 గజాల స్థలంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారిపై అర్ధరాత్రివేళ దొంగల మాదిరిగా దాడి చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జైలుకు అయినా వెళతాము కాని భూమిని వదిలేది లేదన్నారు.భూమి సాధించుకనే వరకు సిపిఐ మీ వెంటనే ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి, సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా, సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మేకల రవి, మంద సదాలక్ష్మి, వలీ ఉల్లాఖాద్రి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, సిపిఎం జిల్లా నాయకులు ఎం. చుక్కయ్య, బొట్ల చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు

# నింబాల్కర్ హత్య కేసులో కీలక పరిణామం

**20 ఏళ్ల తరవాత పద్మసింహ పాటిల్ తదితరులు నిర్దోషులుగా ప్రకటన**

**ముంబై, జూన్20 (జనంసాక్షి) :** రెండు దశాబ్దాలుగా మహారాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా ఉన్న పావన్‌రాజే నింబాల్కర్ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముంబైలోని ప్రత్యేక సీబీఐ కోర్టు ఈ కేసులో మహారాష్ట్ర మాజీ హోంమంత్రి, పద్మసింహ్ పాటిల్‌తో పాటు మొత్తం తొమ్మిది మందిని నిర్దోషులుగా ప్రకటించింది. దాదాపు 20 సంవత్సరాల పాటు సాగిన ఈ కేసులో 128 మంది సాక్షులను విచారించిన అనంతరం కోర్టు ఈ తీర్పు వెలువరించింది. 2006 జూన్ 3న కాంగ్రెస్ నేత పావన్‌రాజే నింబాల్కర్ తన డ్రైవర్ సమద్ అబ్దుల్ వాహిద్ కాజీతో కలిసి ప్రయాణిస్తుండగా నవీ ముంబైలోని కలంబోలి ప్రాంతంలో దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నింబాల్కర్, ఆయన డ్రైవర్ మరణించారు. ఈ హత్యలకు రాజకీయ శత్రుత్వమే కారణమని దర్యాప్తు సంస్థలు అప్పట్లో వెల్లడించాయి. నింబాల్కర్‌ను రాజకీయంగా తొలగించేందుకు పద్మసింహ్ పాటిల్ కుట్ర పన్నారని, దానికి పలువురు సహకరించారని సీబీఐ పేర్కొంది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఈ కేసులో తీర్పు వచ్చింది.. నిందితులపై అభియోగాలు నిరూపించేందుకు తగిన ఆధారాలు లేవని ప్రత్యేక సీబీఐ కోర్టు పేర్కొంది. దీంతో పద్మసింహ్ పాటిల్ సహా మిగతా నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటించింది. కోర్టు తీర్పుపై సీబీఐ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ తీర్పును బాంబే హైకోర్టులో సవాలు చేయనున్నట్లు సమాచారం.

# ఐఐటీ బాంబే క్యాంపస్‌లోకి చిరుత

**కుక్కను చంపి తీసుకెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు**

**ముంబై, జూన్20 (జనంసాక్షి) :** ఐఐటీ బాంబే క్యాంపస్‌లోకి ఓ చిరుత ప్రవేశించింది. స్టాఫ్ హాస్టల్ ఏరియాలో ఓ కుక్కను చంపేసింది. పోవాయ్‌లో ఉన్న వర్సిటీ సీసీ కెమెరాలకు ఆ ఘటన చిక్కింది. ఈ ఘటన 19వ తేదీ తెల్లవారుజామున రెండు గంటలకు జరిగింది. క్యాంపస్‌లోకి చిరుత ప్రవేశించడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్యాంపస్‌లోని రెసిడెన్షియల్ ఏరియాలో చిరుత సంచరిస్తున్నట్లు ఇప్పటికే ఫిర్యాదు ఉన్నది. హాస్టల్ మెట్ల వద్ద ఉన్న ఓ కుక్కను చిరుత తన నోటితో పట్టి చంపేసింది. చాలా నెమ్మదిగా వాకింగ్ చేసుకుంటూ వచ్చిన ఆ చిరుత సడెన్‌గా కుక్కపై దాడి చేసింది. చనిపోయిన కుక్క బాడీతోనే ఆ చిరుత అదృశ్యమైంది. క్యాంపస్ విద్యార్థులు, సిబ్బంది, స్థానికులు ఆ వీడియో చూసి భయాందోళనలకు గురవుతున్నారు. రాత్రి పూట సంచారం ఇబ్బందిగా మారినట్లు ఫిర్యాదు చేశారు. పోవాయ్ సమీపంలో అటవీ ప్రదేశం ఉన్న కారణంగా.. అక్కడ పలు సందర్భాల్లో చిరుతలు కనిపించాయి.

# అన్నివర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

- రైతులకు నరకం చూపిస్తున్న రేవంత్ ప్రభుత్వం
- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శలు



**హైదరాబాద్, జూన్20 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలను నానాయాతన పెడుతూ రాష్ట్రాన్ని పూర్తిగా అధోగతి పాలు చేస్తుందని విమర్శించారు. హైదరాబాద్ చింతల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేపీ వివేకానంద మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది పేరుకే ప్రజాపాలన.. వాస్తవానికి ప్రజలను హింసించే పాలనగా సాగుతుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు.పదేళ్ల పాటు కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని ఒక పండుగలా మార్చారని కేపీ వివేకానంద తెలిపారు. రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, కడుపులో పెట్టుకుని చూసుకున్నారని కొనియాడారు. సకాలంలో విత్తనాలు, యూరియా అందించడమే కాకుండా, సమయానికి 'రైతు బంధు' డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లో వేసి, పండించిన ప్రతి ధాన్యాన్ని కొనుగోలు చేసి అన్నదాతకు బంగారు బాట వేశారని పేర్కొన్నారు. కానీ నేడు రేవంత్ రెడ్డి రాక్షస పరిపాలనలో రైతులంతా హింసను అనుభవిస్తున్నారని, రైతులకు నరకం చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి విత్తనాలు లేవు, యూరియా కోసం రైతులు రోడ్లపై పడిగాపులు కాస్తూ యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పేరు మార్చి రైతు భరోసా అని పెట్టారని.. కానీ అది భరోసా కాదు.. రైతు మోసం అని అన్నారు. రైతు భరోసా కింద ఒక్క రైతుకు కూడా డబ్బులు ఇవ్వలేదని విమర్శించారు. సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కేపీ వివేకానంద మండిపడ్డారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బోరంపేట పీఏసీఎస్ పరిధిలో 632 మంది రైతులకు కేవలం 13 మందికే రుణమాఫీ అయ్యిందని తెలిపారు. రుణమాఫీ విషయంలో రేవంత్ రెడ్డి గజదొంగలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

# నెల రోజుల్లో డిపెండెంట్ ఉద్యోగాలివ్వాలి

- లేకుంటే నిరాహార దీక్ష..
- ప్రభుత్వానికి కవిత అల్టిమేటం
- భూపాలపల్లిలో సుడిగాలి పర్యటన



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రభుత్వానికి నెల రోజులు గడువు ఇస్తున్నానని, లేదంటే ఇక్కడికే వచ్చి నిరాహార దీక్ష చేస్తానని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అల్టిమేటం జారీ చేశారు. జెండా పండుగలో భాగంగా భూపాలపల్లిలో పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం కవిత మాట్లాడారు. 'గత ఐదు రోజులుగా కార్మికులతో మాట్లాడుతున్నాను. వాళ్లకు తాగేందుకు మంచి నీళ్లు కూడా ఇవ్వటం లేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో ఒక పెద్ద మనిషి కలిసి గోస చెప్పుకుంటే కళ్లలో నీళ్లు వచ్చాయని చెప్పారు. బొగ్గుబాయిల ప్రాంత ప్రజలు సింగరేణిలో కనీసం కార్మికుడిగా జాబ్ వస్తుందని ఆశిస్తారని అన్నారు. రిటైర్ అవుతున్న వాళ్లు పిల్లలకు డిపెండెంట్ ఉద్యోగాలు కావాలని భావిస్తారు. కానీ ప్రభుత్వం మెడికల్ బోర్డు పెట్టకుండా రిటైర్ అవుతున్న వాళ్లను ఆవేదనకు గురి చేస్తోందని విమర్శించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అని చెప్పి ఫ్రీ బస్ తప్ప ఒక్కటీ అమలు చేయలేదని కవిత మండిపడ్డారు. ఫ్రీ బస్ వల్ల మహిళలు గొడవ పడుతున్నారని, పురుషులకు సీట్లు లేకుండా పోయిందని అన్నారు. ఆటో డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారని, బస్సుల సంఖ్య పెంచటం లేదని చెప్పారు. వికలాంగులకు, 60 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లకు ఉచిత ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు. షాదీ ముబారక్, తులం బంగారం, కేసీఆర్ కిట్ లాంటివి ఇవ్వటం లేదని విమర్శించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రం అయిన తర్వాత కూడా వసతులు రాలేదని కవిత అన్నారు. బ్రిడ్జిలు పాడయ్యాయని, అవుటర్ రింగ్ రోడ్డు అవసరమని తెలిపారు. రాజకీయ నాయకుల జాగాలు ఉంటే రోడ్డును వంకర తిప్పుతున్నారని ఆరోపించారు. గత ఎమ్మెల్యే భూకబ్జాలు చేశారని, చెరువులు, అడవులు వదలేదని ఆరోపించారు. 190 ఎకరాల అటవీ భూమి కబ్జాపై సుప్రీంకోర్టు తెలంగాణ ఇజ్జత్ తీసిందని చెప్పారు. ఓపెన్ కాస్ట్ కోసం 140 ఎకరాలు ఇచ్చిన ప్రజలకు ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదని కవిత అన్నారు. భూములు ఇచ్చిన వారికి కచ్చితంగా పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూపాలపల్లిలో ఇవాళ మొదటి జెండా ఎగురవేశామని, రానున్న రోజుల్లో ఎమ్మెల్యే సీటు కూడా గెలుస్తామని కవిత ధీమా వ్యక్తం చేశారు. ఆడబిడ్డలను నమ్ముకొని పార్టీ పెట్టానని, ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. నిరంతరం కార్మికుల పక్షాన ఉంటానని కవిత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

### భూమి విషయంలో దాడి కేసులో

# ఇద్దరి అరెస్ట్

**చెన్నారావుపేట, జూన్ 20 ( జనం సాక్షి):** భూమి విషయంలో తగాదా పడి దాడి చేసిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి శనివారం తెలిపారు. ఈనెల 7వ తేదీన సాయంత్రం మండలంలోని అమీన్ పేట గ్రామానికి చెందిన చిలుపూరి ఎల్లయ్య, చిలుపూరి సుధాకర్, చిలుపూరి దయాకర్, చిలుపూరి ప్రమీలలు అదే గ్రామానికి చెందిన చిలుపూరి యాకయ్య కుటుంబంతో భూమి విషయంలో గొడవపడి కొట్టి గాయపరిచారు. ఈ కేసులో చిలుపూరి సుధాకర్, చిలుపూరి దయాకర్ లను అరెస్టు చేసి నర్సంపేట మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి 14 రోజుల రిమాండ్ ను విధిస్తూ మహబూబాబాద్ జైలుకు తరలించినట్లు ఎస్సై రాజేష్ రెడ్డి తెలిపారు.

# పోలీసులను దూషించిన వ్యక్తి అరెస్ట్

**ఆత్మకూర్, జూన్ 20 (జనం సాక్షి):** ఆత్మకూరు గ్రామానికి చెందిన పాండవుల దివ్య,అను ఆమె ను తన మాజీ భర్త అయిన పాండవుల కిరణ్, తండ్రి లేట్ .యాదగిరి, అను వ్యక్తి తన ఇంటి వద్ద నానా బూతులు తిడుతూ గొడవ చేస్తున్నాడని 100 డయల్ చేయగా,అట్టి 100 డయల్ కి హాజరైన ఆత్మకూరు పోలీసు స్టేషన్ కి చెందిన ఆర్ . ప్రవీణ్ కుమార్, జే . శ్రీనివాస్,ఇద్దరు కానిస్టేబుళ్లు దివ్య ఇంటికి వెళ్లగా గొడవ చేస్తున్న పాండవుల కిరణ్ ను ఎందుకు గొడవ చేస్తున్నావని అడిగేసరికి, ఆర్. ప్రవీణ్ కుమార్ అనే కానిస్టేబుల్ని "నువ్వు ఎవడివిరా నువ్వు పోలీసోనివి అయితే నాకేంది రా" అని ఇష్టం వచ్చినట్లు బూతు మాటలు తిడుతూ నెట్టివేయగా అట్టి కానిస్టేబుల్ ఎడమ కాలుకి గాయం అయినది. ఇట్టి విషయాన్ని ప్రవీణ్ కుమార్ కానిస్టేబుల్ ఆత్మకూరు పోలీస్ స్టేషన్ నందు ఆ రోజే ఫిర్యాదు చేయగా అట్టి వ్యక్తి పై కేసు నమోదు చేసి అట్టి వ్యక్తిని శనివారం రోజు అరెస్టు చేసి పరకాల మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా పరకాల మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ చేసి పరకాల జైలు కి తరలించారు. ఎవరైనా పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన, పోలీస్ వారిని గాయపరిచిన అటువంటి వ్యక్తులపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్ . సంతోష్ తెలిపినారు.

# రైతు డిక్లరేషన్‌ను కాంగ్రెస్ తుంగలో తొక్కింది

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



**స్టేషన్ ఘన్‌పూర్ , జూన్ 20 ( జనం సాక్షి ) :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా విస్మరిస్తోందని, రైతు డిక్లరేషన్‌ను పూర్తిగా తుంగలో తొక్కిందని తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపించారు. స్టేషన్ ఘన పూర్ డివిజ న్ కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ చేత రైతు డిక్లరేషన్ ను ప్రకటింపజేసి, రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, అన్నిపంటలకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి కేంద్రప్రభుత్వం ఏ పంటను కొనమంటే ఆ పంటనే, ఎంత కొనమంటే అంతే కొనుగోలు చేస్తామనిచెప్పడం రైతుల మనో భావాలను దెబ్బతీసే చర్య అని విమర్శించారు. అధికారంలో కి వచ్చిన వెంటనే 40 లక్షల మంది రైతులకు ఏక కాలంలో రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, కేవలం 25 లక్షల మందికే పరిమితమైందని ఆరోపించారు. 20 వేల కోట్లు విడుద ల చేస్తున్నట్లు ప్రకటిం చినప్పటికీ రైతులఖాతాల్లో సుమారు12వేల కోట్లే జమయ్యా యని అన్నారు. రాష్ట్రంలోని ఏ రైతును అడిగినా తన రుణమాఫీ పూర్తిగా జరిగిందని చెప్పే పరిస్థితి లేదని అన్నారు. రైతు భరోసా పేరుతో ఎకరాకు 15 వేల చొప్పున, కౌలు రైతులకు కూడా అదే స్థాయిలో, భూమిలేని రైతులకు 12 వేల ఆర్థిక సాయం అందిస్తామని చెప్పి మోసం చేశారని మండి పడ్డారు. ఐదు సార్లు రైతు భరోసా చెల్లింపు లు జరగాల్సిండగా, కేవలం రెండుసార్లు మాత్రమే ఇచ్చి రైతులను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. మళ్లీ సభలు పెట్టి రైతు భరోసా పేరుతో రైతులను నమ్మించే ప్రయత్నాలు జరుగుతున్నా యని అన్నారు. రైతు సమస్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ధర్నా కార్యక్ర మాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 29న జనగాంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగే బిఎల్ఏ మీటింగ్ కు, శిక్షణ తరగతులకు, ముఖ్య అతిధిగా కేటీఆర్ హాజరుకావడం జరుగు తుంది అని, పార్టీ నియమించిన బిఎల్ఏ లు, మండల అధ్యక్షులు, ఇన్చార్జులు, కోఆర్డినేటర్లు, ముఖ్య నాయకుడు కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ నాయకులు ఆకుల కుమార్, చింత కుంట్ల జగన్ రెడ్డి, మాలోతు రమేష్ నాయక్, చల్ల చందర్ రెడ్డి, మారపెల్లి ప్రసాద్, ఆకారపు అశోక్, ఎడ్ల వెంకట స్వామి, పి రాజకుమార్, విజయ్, పావని, జ్యోతి రెడ్డి, రమ, కవిత, మండల అధ్యక్షులు,ఇన్చార్జులు, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మైనారిటీల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- బోయపల్లిలో టీఎంఆర్ఈఐఎస్ పాఠశాల ప్రారంభం
- కార్యక్రమంలో మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్



**మహబూబ్‌నగర్, జూన్20 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీల విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బోయపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పాఠశాల భవనాన్ని మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక విద్యా సంస్థలను అభివృద్ధి చేస్తోందన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, స్కాలర్‌షిప్‌లు, కోచింగ్ సౌకర్యాలు, పాఠ్యపుస్తకాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల భవిష్యత్తును బలోపేతం చేస్తున్నామని తెలిపారు. సందర్భంగా హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు మైనారిటీ విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. బోయపల్లి టీఎంఆర్ఈఐఎస్ పాఠశాల భవనం విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిమ్రిస్ చైర్మన్ శ్రీ ఫహీమ్ ఖురేషి, తెలంగాణ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ ఉబైదుల్లా కొత్వాల్, మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీ బి. షఫీయుల్లా, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డి.కె. అరుణ, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ అధికారులు, మైనారిటీల సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కమ్యూనిటీ నాయకులు, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కట్లపాములతో చెలగాటం

- ప్రాణం కోల్పోయిన యువకుడు

**హైదరాబాద్, జూన్20 (జనంసాక్షి) :** పాముతో చెలగాటం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. స్నేహితులను భయపెట్టాలని ఆ వ్యక్తి చేసిన పిచ్చి పని అతని ప్రాణాలను బలితీసుకుంది. ఫామ్‌హౌస్‌లో కనిపించిన కట్లపాము పిల్లను చేతిలో తీసుకుని పరచకాలు ఆడటంతో.. అది కాటువేసింది. దీంతో అతను ప్రాణాలు కోల్పోయాడు. హైదరాబాద్‌లోని మొయినాబాద్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన నవాబ్ జయ్యద్ ఖుమైద్ మొహిద్దీన్ (30) ఒక వ్యాపారవేత్త. తన స్నేహితులతో కలిసి ఇటీవల మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌కు వెళ్లాడు. వారితో సరదాగా గడుపుతున్న సమయంలో అక్కడకు ఒక కట్లపాము పిల్ల వచ్చింది. దాన్ని చూడగానే నవాబ్ దాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. ఆ పాముతో తన స్నేహితును భయపెట్టాలని అనుకున్నాడు. ఆ కట్ల పాముతో ఆటలు ఆడుతూ స్నేహితులను భయపెట్టబోయాడు. కానీ ఇంతలో కుడి చేతి బొటనవేలుపై కాటేసింది. చిన్న పాము కదా.. పెద్దగా ప్రమాదం ఉండదని వాట్ లైట్ తీసుకున్నాడు. స్నేహితుల ముందు నవ్వుకుంటూ.. తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, చికిత్స అవసరం లేదని స్నేహితులతో చెప్పుకొచ్చాడు. కానీ చిన్నదైనా, పెద్దదైనా కట్లపాము విషం అత్యంత ప్రమాదకరమేని అతను తెలుసుకోలేకపోయాడు. ఇంకేముంది.. కొద్దిసేపట్లోనే కట్ల పాము విషం నవాబ్ శరీరంపై ప్రభావం చూపడం మొదలుపెట్టింది. ముందుగా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. క్రమంగా ఆరోగ్యం కూడా క్షీణించింది. దీంతో ఆందోళన చెందిన స్నేహితులు నవాబ్‌ను వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే విషం శరీరం మొత్తం పాకడంతో నవాబ్ కన్నుమూశాడు. కాగా, దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
21 జూన్ 2026

# దండకారణ్యం అమ్మకం..!

సంపాదకీయం

దండకారణ్యం ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో విస్తరించిన ఆ అడవి కేవలం చెట్లు, రాళ్ళు మాత్రమే కాదు. అక్కడ లక్షల మంది ఆదివాసీల జీవితాలున్నాయి. తరతరాల సంస్కృతి ఉంది, మన దేశపు జీవనాడి అయిన నదులకు మూలాలున్నాయి. కానీ నేడు ఆ అడవిని చూసే కళ్ళు వేరే విధంగా చూస్తున్నాయి. అక్కడ ఇనుప ఖనిజం కనిపిస్తోంది. బొగ్గు కనిపిస్తోంది. బాక్సైట్ కనిపిస్తోంది. మన పాలకులకు కనిపించేది అడవి కాదు, బ్యాలెన్స్ షీట్.

భారత రాజ్యాంగం స్పష్టంగా చెప్తుంది. ఈ దేశపు భూమి, ఖనిజాలు, అడవులు ప్రజాస్వామ్య ప్రభుత్వం ద్వారా ప్రజలకు చెందుతాయి. 1980 అడవుల పరిరక్షణ చట్టం, 2006 అటవీ హక్కుల చట్టం, పెసా చట్టం ఇవన్నీ ఆదివాసీలకు తమ భూమిపై, వనరులపై హక్కు ఉందని నిర్ద్వంద్వంగా నిర్ధారిస్తున్నాయి. కానీ ఆచరణలో ఏం జరుగుతోంది? గ్రామసభల అనుమతి తీసుకోకుండా మైనింగ్ లీజులు ఇవ్వడం, పర్యావరణ అనుమతులు వేగంగా మంజూరు చేయడం, ఆదివాసీలను "అభివృద్ధి వ్యతిరేకులు"గా ముద్రవేయడం ఇవే మన వ్యవస్థ చేస్తున్న పని.

*అదాని, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు దండకారణ్యంలో మైనింగ్ హక్కులు ఇవ్వడాన్ని "దేశాభివృద్ధి" అని పాలకులు చెప్తున్నారు. కానీ చరిత్ర ఏం చెప్తోంది? ఒడిశాలో వేదాంత మైనింగ్ చేసిన ప్రాంతాల్లో నివసించిన ఆదివాసీలు నేడు ఎక్కడున్నారు? జార్ఖండ్‌లో బొగ్గు గనులు వచ్చిన చోట్ల స్థానికుల జీవన స్థాయి పెరిగిందా, తగ్గిందా? లాభాలు ఢిల్లీ, ముంబై వెళ్తున్నాయి.. కాలుష్యం, నిర్వాసితత్వం మాత్రం ఆ అడవి బిడ్డలకు మిగులుతున్నాయి. ఒక్క గణాంకం చాలు ఈ నిజాన్ని అర్థం చేసుకోవడానికి, ఖనిజ సంపద అత్యధికంగా ఉన్న జిల్లాలే భారతదేశంలో అత్యంత పేదరికంలో ఉన్న జిల్లాలు. ఇది యాదృచ్ఛికం కాదు, ఇది వ్యవస్థ.*

ప్రైవేట్ కార్పొరేట్లకు సహజ వనరులు అప్పగించడం వల్ల జరిగే నష్టం కేవలం పర్యావరణానికి మాత్రమే కాదు.. ప్రజాస్వామ్యానికే ప్రమాదం. ఒకసారి ఖనిజ సంపద కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్ళిందంటే, ఆ సంపద ఉత్పత్తి చేసే రాజకీయ శక్తి కూడా వారి చేతుల్లోకే వెళ్తుంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆ కార్పొరేట్లకు జవాబుదారీగా ఉండవలసిన పరిస్థితి వస్తుంది. ఇది ప్రజాస్వామ్యం కాదు, ఇది కార్పొరేట్ రాజ్యం.

సహజ వనరుల వినియోగం అవసరమే.. కానీ అది ప్రజలకు లాభం చేకూర్చే విధంగా జరగాలి. రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో, కఠినమైన పర్యావరణ నిబంధనలతో, స్థానిక ఆదివాసీల భాగస్వామ్యంతో, లాభాలు నేరుగా ప్రజాసంక్షేమానికి వెళ్ళే విధంగా మైనింగ్ జరగాలి. గ్రామసభ అనుమతి లేని ఒక్క గని కూడా తెరవకూడదు. దండకారణ్యం అడవి మన దేశపు ఊపిరితిత్తులు. దాన్ని కార్పొరేట్లకు అప్పగించడం అంటే మన భవిష్యత్తును అమ్మడమే. అదాని సంపద పెరిగినప్పుడు దేశం అభివృద్ధి చెందినట్టు కాదు.. ఆదివాసీ పిల్లలు చదువుకున్నప్పుడు, అడవి బతికినప్పుడు, నదులు పారినప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి జరిగినట్టు. సహజ వనరులు ప్రజలవి.. అవి ప్రజలకే చెందాలి. ఇది చర్చించవలసిన విషయం కాదు, రాజ్యాంగం మనకు ఇచ్చిన హామీ. అడవిని కాపాడటం విప్లవం కాదు, అది మన బాధ్యత.

# మీడియాయానా ? మాఫియాయానా??



*"పెట్టుబడికి, కట్టుకథలకు పుట్టిన విషపుత్రికలు పత్రికలు" అన్నాడు మహాకవి శ్రీశ్రీ. ఇవాళ ఆధునిక కాలాన మీడియాను చూస్తే ఇది అక్షరాల నిజమని తేలుతున్నది. నిజానికి ప్రజాస్వామ్య సౌధానికి శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థలతో పాటు సమాచార వ్యవస్థ నాలుగవ స్తంభం అంటారు. నోరు లేని ప్రజల పక్షాన అది గొంతెత్తాలి. అందుకే మీడియాను వాయిస్ ఫర్ ది వాయిస్లెస్ అంటారు. అది బాధితులకు అండగా నిలవాలి. అలాంటి మీడియా తన బాధ్యతను గాలికి వదిలేసింది. మీడియాను సైతం ఒక వ్యాపారంగా మార్చుకొని చీకటి సామ్రాజ్యాలను నిర్మించుకుంటున్నది. బాధితుల మీదే బండలు వేసే విధంగా మారింది. దీంతో మీడియా మీద ప్రజలకు విశ్వాసం సన్నగిల్లిపోయింది. ఏ వార్త నిజమో, ఏ వార్త పెయిడ్ వార్తో తెలుసుకోవడం కష్టంగా మారుతున్నది. ఇది ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమిస్తున్నది. జర్నలిజాన్ని తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం తాకట్టు పెడుతున్న తీరుకు సమాజం నివ్వెర పోతున్నది. ఇది ఎంత మాత్రమూ క్షమార్హం కాదు.*

జర్నలిజంలో వికృతపోకడలకు పోతే ఏమవుతుందో ఒక సంఘటన ద్వారా అర్థం చేసుకోవచ్చు. గ్లోబలైజేషన్ నేపథ్యంలో సూడాన్లో 1993 పాలనా వ్యవస్థ మొత్తం ఛిద్రమైంది. దీనికి తోడు కరువు దెబ్బ తీసింది. దీంతో ఆ వార్తలను కవర్ చేయడానికి వెళ్లాడు కెవిన్ కార్టర్ అనే ఒక ఫోటో జర్నలిస్ట్. ఆయన ఆ దేశంలో అడుగుపెట్టేటప్పటికే వందల ఆకలి చావులు సంభవించాయి. ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. తిండిలేక పసిపిల్లలు సైతం అస్తిపంజరాలుగా మారారు. బతికున్న జీవశ్చవాల్లా మారారు. అలాంటి ఫోటోలు కవర్ చేయడానికి ఫీల్డ్‌లోకి దిగాడు. ఒక చోట కొనప్రాణంతో ఉన్న ఒక పసిబాలుడు కనిపించాడు. ఆ బాలుడిని తినడానికి ఒక రాబందు వచ్చి వాలింది. ఈ ఫోటో జర్నలిస్ట్ ఆ దృశ్యాన్ని తన కెమెరాలో బంధించడానికి సిద్ధమయ్యాడు. అంతలోనే తనకు ఒక ఆలోచన వచ్చింది. ఆ రాబందు ఆ పిల్లాడిని పీక్కు తీనేటప్పుడు రాబందు రెక్కలు విప్పితే ఇంకా బాగుంటుందనుకున్నాడు. అలా ఆ రాబందు రెక్కలు విప్పే సమయం కోసం సుమారు గంటకు పైగా ఎదురు చూశాడు. అది ఆ బాలుడిని పొడుచుకు తింటూ రెక్కలు విప్పినప్పుడు కెమెరా క్లిక్ మనిపించాడు. ఫోటో అద్భుతంగా వచ్చింది. దానిని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, చాలా పెద్ద స్పందన వస్తుందని ఆశించాడు. అది చూసిన నెటిజన్లు కొనప్రాణంతో ఉన్న బాలుడిని కాపాడకుండా ఫోటో కోసం ఎదురు చూసిన నీకు ఆ రాబందుకు తేడా ఏమీ లేదు. నీదీ ఒక బ్రతుకేనా అని సదరు జర్నలిస్టుని ఘాటుగా విమర్శించారు. దీంతో అప్పటి దాకా ఆ బాలుడిని కాపాడాలన్నా తలంపే రాని జర్నలిస్ట్ సిగ్గుతో విలవిలలాడాడు. తాను మానవత్వాన్ని మరిచి ఎంత పెద్ద తప్పు చేశాడో రియలైజ్ అయ్యి సూసైడ్ చేసుకుని చనిపోయాడు. ఇలా బాధ్యత మరిచి వ్యూస్ కోసం చూసే జర్నలిస్టే ఎక్కువయ్యారు.

భారత దేశంలో ఒకప్పుడు ప్రింట్ మీడియా ఉన్నప్పుడు జర్నలిజం అనేది విలువల మీద నడిచేది. 1990ల తరువాత క్రమంగా మీడియాలోకి కార్పోరేట్ శక్తులు ప్రవేశించాయి. వారికి జర్నలిజం ఒక వ్యాపార వనరుగా కనిపించింది. ఇక వారికింద పని చేసే జర్నలిస్టు తిలాపాపం తలా పిడికెడులాగా అవినీతికూపంగా మార్చారు. పెద్దగా చదువులేక, ఊరిలో ఖాళీగా ఉండే వారంతా జర్నలిస్ట్ పనిని ఒక వృత్తిగా ఎంచుకున్నారు. పేరుకే జర్నలిస్ట్ కానీ, కనీసం వార్త రాయడం కూడా రాదు. అలాంటి వారి వల్ల జర్నలిజం పతనావస్థకు చేరుకుంది. ఇతరులను బెదిరించి, తప్పుడు రాతలు రాసి, బురద జల్లడం, డబ్బులు గుంజడం, రాత్రికి రాత్రి కోటీశ్వరులు కావాలని అడ్డదారులు వెతకడం నిత్యకృత్యంగా మారింది. మీడియాలో అందరూ ఇలాగే ఉన్నారని కాదు. కాకుంటే మండల స్థాయి, గ్రామస్థాయిలో ఎక్కువమంది ఇలాగే ఉన్నారు. ఇలాంటి విలేఖరుల దిగదుడుపు రాజకీయాలకు తెలంగాణలో ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీ నిత్యం వార్తల్లోకి ఎక్కుతున్నది. వ్యక్తిగత కారణాలతో ఏ విద్యార్థైనా సూసైడ్ చేసుకున్నా, చేసుకోవాలని ప్రయత్నించినా ఇక పెయిడ్ జర్నలిస్టుకు పండగే. యాజమాన్యం వల్లే ఇది జరిగిందని లేనిపోని రాతలు రాసి రాక్షసానందాన్ని పొందుతున్నారు. ఇలాంటి రాతలు రాసి, వార్తలు వేసే జర్నలిస్టు ఒక్క బాసర పట్టణం చుట్టూ బెల్లంపల్లి టౌన్ వరకు చూస్తే అక్షరాల రెండువందల యాభైమందికి పైనే ఉన్నారు. వీరంతా దారినపోయే దానయ్యలే. వీరు ఎవరు ట్రెయిన్డ్ జర్నలిస్టు కారు. వీరికి జర్నలిజానికి అర్థమే తెలియదు. జర్నలిస్ట్ బాధ్యతలు ఏమిటో కూడా తెలియవు. వీరికి తెలిసిందల్లా లేనిపోని వార్తలతో అసత్యాలు రాసి యాజమాన్యాలను బ్లాక్ మెయిల్ చేయడం పరిపాటిగా మారింది. ఇలాంటి వారి వల్ల నిజాయితీ కలిగిన జర్నలిస్టకే కాదు, జర్నలిజం వృత్తికే మచ్చ వస్తున్నది. వీరు రాసే వార్తలను ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రులు సైతం లైట్ తీసుకుంటున్నారు.

బాసర ట్రిపుల్ ఐటీలో గతంలో ఏడాది పొడుగునా అనేక సూసైడ్ కేసులు జరిగాయి. కానీ, ప్రస్తుత వైస్ ఛాన్సలర్ ప్రొ.ఏ.గోవర్ధన్ వచ్చిన తరువాత ఆ చరిత్ర మొత్తం మారింది. సూసైడ్లు ఆగిపోయాయి. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక రికార్డులు నెలకొల్పారు. గిన్నిస్ రికార్డులకు ఎక్కారు. ఇవేవీ మీడియా హైలెట్ చేయకుండా కోడిగుడ్డు మీద ఈకలు పీకే పని పెట్టుకున్నారు. సాధారణంగా వీసీ అంటే ఏ యూనివర్సిటీలోనైనా బిజీగా ఉంటారు. విద్యార్థులకే కాదు, ఫ్యాకల్టీకీ కూడా అపాయింట్మెంట్ దొరకనంత బిజీగా ఉంటారు. అలాంటిది బాసరలో మాత్రం వీసీ ప్రొ.గోవర్ధన్ స్వయంగా హాస్టల్లను రోజు సందర్శిస్తూ, విద్యార్థులను కలుస్తూ వారితో భోజనం చేస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్నారు. దీంతో సదరు పెయిడ్ మీడియాకు ఇది నచ్చడం లేదు. నిత్యం విద్యార్థులు చావాలి. వారికి వార్తలు కావాలని ఎదురుచూస్తున్నారు. అందుకే ఏదైనా చిన్ని విషయం జరిగినా దాన్ని చెలువలు, పలువలుగా వర్ణిస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారు. ఇప్పటికైనా సదరు మీడియా మిత్రులు తమ బాధ్యతను గుర్తించాలి. తొమ్మిది వేల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారం చేస్తూ అసత్య వార్తలు రాయడం మానుకోవాలి. లేకుంటే ఆ రాబందును ఫోటో తీసిన జర్నలిస్టు పట్టిన గతే పడుతుందని మరువరాదు.

డా.పసునూరి రవీందర్
కవి, రచయిత,
కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత



## సమర్థులు!


ఎవరి సామర్థ్యంతోవారు
దేశానికి మేలుచేస్తే
అంతకంటే ఏంకావాలి!
ఇక్కడే ఒక చిక్కు ప్రశ్న!
ఎవడికివాడు సమర్థుడు
ప్రక్కవాడుఅసమర్థుడు!
దీనినేమంటారోచెప్పండి!
ఒకరికి ఒకరు అందరూ
ప్రక్కవాళ్ళేకదా!అంటే
అందరూ అసమర్థులేనా!
పాలకప్రతిపక్షనాయకులు
ఎలాతిట్టుకుంటారోచూడండి!
మనకేమీ అర్థం కాదు!
వీళ్ళేమనను పాలించేది!
అహంకారమా?అవివేకమా?
అసూయా?ద్వేషమా?
అల్పత్వమా?
ఇదిమనిషి స్వభావమా?
వాడిబుద్ధే అలాంటిదా?
ఇవన్నీవున్నవాడేమనిషా
ఉంటేఎందుకిలాఉన్నాడు?
సృష్టికి విరుద్ధంగా లేడూ!
అసమర్థసింహాలున్నాయా?
అసమర్థపులులున్నాయా?
పోనీ ఎలకలున్నాయా?
ఏ ఒక్క జంతువులేదు!
వాటిపనిఅవి చేస్తాయి!
నాయకుల్లోనేఈవిచిత్రం
నాయకులేనా?
మనుషులంతానా?
ఈమధ్యబాగాబరితెగించారు!
ప్రజాస్వామ్యాన్నికాపాడాలని
రాజ్యాంగమీద ప్రమాణంచేసి
'మత'రాజ్యంకోసంపాలిస్తాడు!
మతం తగాదాలు పెడతాడు!
అసలుమతంతోపనేంటి!
మీ మతం మీ ఇంటికే
పరిమితం!
విద్య వైద్యం ఉద్యోగం
ఇవికదా మనసమస్యలు
రైతులుకార్మికులుకనబడరా?
అదానీలుఅంబానీలేనా?
ప్రైవేట్లకా దేశ సంపద?
బ్యాంకుల్నిముంచేసి
పారిపోయే
దొంగవ్యాపారులదా దేశం
మళ్ళీ వాళ్ళకే బొట్టెడతారా?
కులమత భాషాప్రాంతలు కాదు
ప్రజాస్వామ్యలౌకికరాజ్యం!
సోషలిజంవైపుప్రయాణం
మానవులంతాసమానం
అసమానతలురూపుమాపటం
ఈ లక్ష్యాన్ని వదిలేసి
మరీ ఇంతసమర్థపాలనా

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# విదేశాల కన్నా సొంత మట్టి మంచిది!



శేఖర్ ఇంటి ముందరి గదిలో అలికిడి వినపడి చూశాడు. లక్ష్మమ్మ కనపడింది. సోఫాలో కూర్చుని ఫైల్స్ చూసుకుంటున్న శేఖర్ చేతులు ఒక్కక్షణం ఆగిపోయాయి. లక్ష్మక్క అంటే శేఖర్‌కు ఎంతో అభిమానం. తనకు కన్న తల్లి లెక్క. అంత కన్నా ఎక్కువ.
చెప్పులు విడిచి లోపలికి వస్తున్న ప్రకాశ్ కనుపించాడు. ఏదో నిరాశలో కోపం దీనత్వం మోసుకొస్తున్నట్టున్నాడు. పద్మావతికి స్నాక్సు టీకి చెప్పి ముందు గదిలోకి వచ్చాడు శేఖర్.
"అక్కా! బాగున్నారా! ప్రకాశ్ బాగా ఎదిగాడు. చాలా రోజులకు వచ్చారు. హోటల్ బాగా నడుస్తున్నదా?" కుశల ప్రశ్నలు వేశాడు శేఖర్.
టిఫిన్ టీ మర్యాదలయ్యాక "ఏదో పని మీద వచ్చినట్టున్నారు" అని కదిలించాడు శేఖర్.
ఎలా చెప్పాలి అని ఆలోచిస్తున్న లక్ష్మమ్మకు ధైర్యం వచ్చింది. శేఖర్ తనకు పెద్ద కొడుకు లాంటోడు. ఎక్కడి నుంచో వచ్చాడు. వెనకా ముందు ఎవరు లేడన్నాడు. తానే ఆశ్రయమిచ్చింది. తానే ఉన్నంతలో పెట్టింది. ఇప్పుడు ఇంత వాడయ్యాడు. తన కొడుకు ఎదిగినంత సంతోషం ఆ తల్లికి. ఆ అపార్ట్‌మెంటు మరోసారి గోడలు ఫ్యాను అవి చూసి అసలు విషయం చెప్పింది లక్ష్మమ్మ.
"అమెరికా పోతా అంటున్నాడు. పైసలు బాగనే కావాలె. నవ్వే యాదికి వచ్చినవు. నీ తమ్ముల్ని ఎట్లన్నా ఆదుకోవాలె." అంది లక్ష్మమ్మ.
శేఖర్ ప్రకాశ్ వేపు చూశాడు.
ప్రకాశ్ అవునన్నట్టు ఆశగా నవ్వాడు.
శేఖర్‌కు విషయం అర్థం అయింది. ఇప్పుడు ప్రకాశ్‌కు కావలసినది ఆసరా! 'ప్రకాశ్ విదేశాలకు పోతే లక్ష్మక్క ఒంటరిదై పోతుంది. ఫోన్ చేసి ముందే చెప్పింది. ప్రకాశ్‌కు పెళ్లి చేయాలి. కొడుకు కోడలు తన కళ్ల ముంగట మంచిగా బతుకాలె. ఓ పాప పుడితే ఆల్ల నాన్న పేరు పెట్టుకోవాలని ఆశ. అప్పులు వద్దు. ఏం వద్దు. వానికి పని చూపియ్యాలె. నీ దగ్గర పనిలో పెట్టుకో. నీ తీరు వానికి కూడా ఓ దారి చూపియ్యాలె కొడుకా!' అని పదే పదే చెప్పిన లక్ష్మక్క మాటలు గుర్తున్నాయి. మాట వరుసకు కొడుకు ముందు అడిగింది కాని ఆమె మనసులో మాట ముందే చెప్పింది. సముదాయిస్తూ అనేక విషయాలు చెప్తూ తన ప్రతిపాదనను ప్రకాశ్‌కు వివరించాడు శేఖర్.
"చూడు ప్రకాశ్! నేను ఈ సిటీకి ఎట్లా వచ్చిన్నో అమ్మకు తెలుసు. నీకు చెప్పేవుంటది. అమ్మ చేతి వంట ఎన్ని సార్లు తిన్నానో! అమ్మ ఆరోజుల్లో ఆదరించకపోతే నేను ఏమయ్యేవాడినో!" అంటూ చెప్పుకు వచ్చాడు. కాసేపు చర్చ జరిగాక అన్నాడు శేఖర్.
"చూడు ప్రకాశ్! ఎక్కడి నుండో కట్టుబట్టలతో చిరిగిన స్లిప్పర్లతో వచ్చి నేను ఇక్కడ బతికినప్పుడు నువ్వు బతకలేవా? అప్పు చేసి ఫారెన్ చదువులకెందుకు చెప్పు. నువ్వు నాతో ఉండు. రియల్ ఎస్టేట్ వ్యాపార రహస్యాలు తెలుసుకో. నా కన్నా ఎంతో పెద్ద చదువు చదివావు. తొందరగానే సొంతంగా ఎదుగుతావు" అంటూ శేఖర్ సముదాయించాడు.
చివరకు సరేన్నాడు ప్రకాశ్.
లక్ష్మమ్మ వెళ్లపోతుంటే ఆగమని శేఖర్ ఇంటిలోకి వెళ్లాడు. పద్మావతి చీర కనుములు స్టీల్ పళ్లెంలో పట్టు కొచ్చింది.
"మీ గురించి మాసారు బాగా చెపుతుంటారు" అంటూ నమస్కరించింది పద్మావతి.
లక్ష్మమ్మ ఒడిలో పెట్టి దంపతులు పాదాభివందనం చేశారు. రాక రాక వచ్చారని ప్రకాశ్‌కు కొత్త బట్టలు పెట్టారు. ఆత్మీయంగా కౌగలించుకున్నాడు శేఖర్.
శేఖర్ చెప్పిన విషయాలు విన్నాక ప్రకాశ్ తన మనసు మార్చుకున్నాడు. విదేశాల చదువు కోసం ఇంట్లో లొల్లి పెట్టిన అతనికి, వాళ్లమ్మ లక్ష్మమ్మ చెప్పిన మాటలు, తమ హోటల్‌లోనే ఒకప్పుడు పనివాడిగా చేరి ఇవాళ శేఖర్ సాధించిన విజయం చూసి ఒక్కసారిగా కళ్లు తెరుచుకున్నాయి.
"శేఖర్ అన్నా... నన్ను క్షమించు. నేను అమెరికా పోతా అని అమ్మను ఇబ్బంది పెడుతున్నా. నువ్వు ఇంత కష్టపడి ఇక్కడే గెలిచినప్పుడు... విదేశాల దాకా పోవడం ఎందుకు అన్నా? ఈ మట్టి బిడ్డనైన నేను ఎందుకు నా సొంత ఊరిలో ఖాళీగా ఉండాలి? ఒక తరం ఆలస్యమైనా మేము కూడా ఇక్కడే వ్యాపారాల్లో గెలవాలి అన్నా. నన్ను నీ కంపెనీలో చేర్చుకో అన్నా!"
శేఖర్ లేచి ప్రకాశాన్ని గుండెలకు హత్తుకున్నాడు.
"నువ్వు నా తమ్ముడివిరా. లక్ష్మమ్మగారు ఆరోజు నాకు బువ్వ పెట్టకపోతే ఇవాళ నేను ఈ కుర్చీలో ఉండేవాణ్ణి కాదు. నువ్వు విదేశాలకెళ్లి ఎవరికో ఊడిగం చేయడం కాదు, మన నగరంలోనే పదిమందికి పని ఇచ్చే స్థాయికి ఎదగాలి" అన్నాడు.
శేఖర్ అతనికి కేవలం ఉద్యోగం ఇవ్వలేదు, సొంత తమ్ముడిలా చూసి వ్యాపార రహస్యాలన్నీ నేర్పాడు. ప్రకాశ్ కూడా రాత్రింబవళ్లు కష్టపడి, సైట్లలో నిలబడి పనులు చూసుకుంటూ శేఖర్ అడుగుజాడల్లో నడుస్తూ సొంతంగా ఒక బిల్డర్‌గా ఎదిగాడు. ఆ తర్వాత ప్రకాశ్‌కు కూడా మంచి సంబంధం కుదిరి పెళ్లయింది.
ఒకప్పుడు ఏ పనీ లేకుండా తిరుగుతున్న కొడుకు ఇవాళ హైదరాబాద్‌లోనే సొంతంగా ఎదిగి ఐదు పైసల అప్పు లేకుండా స్థిరపడటం చూసి లక్ష్మమ్మ కళ్లల్లో ఆనందం నిండింది.
ఓ రోజు తన క్లాస్‌మేట్ వీరభద్రం ఫోన్ చేశాడు. తనకో అపార్ట్‌మెంటు చూసి పెట్టు మన్నాడు. రిజిస్ట్రేషన్ ఇంటీరియర్స్ పూర్తయ్యాక సరికి 25 ఏళ్ల పాటు లోన్ కిస్తులు.
తనకు రూపాయి లోన్ లేకుండా రెండు వేల చదరపు అడుగుల అపార్ట్‌మెంటు ఎప్పుడో సొంతమైంది. రెంటు కూడా వస్తోంది. అమ్మ లొల్లి వల్లే ఇదంతా సాధ్యమైనది అనుకున్నాడు ప్రకాశ్.
"అమెరికా పోతా. లండన్ పోతా అని ఇంట్లో ఇట్లా లొల్లి పెడితే ఎట్లా రా? మన స్థాయి ఏంటిది తెలువదా? అందరూ అటే పోతున్నారా? ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ బతుకుతలేరా? ఉపాయం ఉంటే కష్టపడితే ఎక్కడైనా బతకవచ్చు."
తల్లి లక్ష్మమ్మ కొంత వేదనగా కొంత కోపంగా అరిచింది. తన కొడుకు కూడా అమెరికాకు పోవాలనే ఉంది. కాని ఆర్థిక పరిస్థితి తనకు తెలుసు. వీడి నాన్న పోయినంక తానొక్కతే హోటల్ నడుపుకొస్తున్నది.
'విదేశాల చదువులకు, వీసాలకు, కన్సల్టెన్సీల చుట్టూ తిరగడానికి లక్షల రూపాయల అప్పులు తేవడానికి మనకంత స్తోమత ఉందా? అసలు మన బతుకేంది? ఈ గల్లీల నడిపే చిన్న హోటల్ ఏంది? అయినా ఈ కాలపు పిల్లలకు అంతా గాల్లోనే తేలాలె. రెక్కలొస్తే చాలు పరాయి దేశం ఎగిరిపోవాలె! ఎక్కడెక్కడి నుంచో కట్టుబట్టలతో వలస వచ్చి ఈ నగరంలో బతుకుతలేరా? మన ఊరిలోనే ఉండి, మన మట్టిలోనే మనం కష్టపడి బతకరాదా!'
'నీకు డిగ్రీ లేపి! ఎంత చదువులు చదివినా నౌకరి లేదు. ఊళ్లె ఉన్న సేట్ల కొడుకులు కార్లలో తిరుగుతుంటే నువ్వింకా ఇట్లా ఖాళీగా తిరుగుతున్నవు. సదువుకున్నా లాభం లేకపోయె. ఇట్లా రోడ్ల వెంట తిరిగితే రేపు పొద్దున నీకు పిల్లనెవడిస్తడు? ఏ పనీ పాటా లేకుండా ఎట్లా బతుకుతవురా? మన కడిస్ ముందే ఎదిగిన శేఖర్‌ని చూసి నేర్చుకోరా!'.




- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# 'తెలంగాణ సిద్ధాంతకర్త' ప్రొఫెసర్ జయశంకర్



నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల్లో 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష'ను రగిలించిన చైతన్యస్ఫూర్తి ప్రొఫెసర్ జయశంకర్. 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే ఈ నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి తెలంగాణ స్వరాష్ట్ర చైతన్యజ్వాలలను రగిలించిన ధిక్కారస్వరం ఆయన. 'తెలంగాణ కేవలం రాజకీయ సమస్య కాదు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సమస్య. అన్నింటికి మించి ఆత్మగౌరవ సమస్య' అని ఎలుగెత్తి నినదించిన పోరాటయోధుడు ఆయన. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన పోరాట క్రమంలో అడుగడుగునా ఎన్నో అడ్డంకులు ఎదురైననూ ఆయన వాటన్నింటిని ప్రతిఘటించి ముందుకు సాగిపోయారు తప్ప ఆయన ఏనాడు వెనకడుగు వేయలేదు. 'మా వనరులపై మాకు అధికారం కావాలి. మా తెలంగాణ మాగ్గావాలి' అని ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితమంతా అవిశ్రాంతంగా ఉద్యమించారు.
'తెలంగాణ సిద్ధాంతకర్త'గా ప్రాచుర్యం పొందిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 1934 ఆగష్టు 6 నాడు మహాలక్ష్మి, లక్ష్మీకాంత్రావు అనే దంపతులకు రెండవ సంతానంగా జన్మించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం లోని అక్కంపేట ఆయన స్వగ్రామం. ప్రొఫెసర్ జయశంకర్ బెనారస్ యూనివర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టా పొంది తదనాంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పూర్తి చేశారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాల పట్ల, అసమానతల పట్ల ప్రొఫెసర్ జయశంకర్ విద్యార్థి దశ నుండే తీవ్రంగా నినదించారు. ఆయన విద్యార్థి నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఇడ్లీ - సాంబర్ గో బ్యాక్' అంటూ ఆయన నినదించారు. నాన్ ముల్కీ ఉద్యమంలోనూ ఆయన ప్రముఖపాత్ర పోషించారు. విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకించి మొదటి ఎస్సార్సీ కమిషన్ ముందు హాజరై 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం' ఆకాంక్షను ఆయన ఆనాడే నొక్కి చెప్పారు.
వరంగల్లో విప్లవ విద్యార్థి ఉద్యమానికి కేంద్రంగా ఉన్న వరంగల్ లోని చంద్రాకాంతయ్య స్మారక కళాశాలకు (సి.కె.ఎం) 1975 నుంచి 1979 వరకు ప్రొఫెసర్ జయశంకర్ ప్రిన్సిపాల్గా పనిచేశారు. ఆ ఎమర్జెన్సీ కాలంలో ఆయన అనేక మంది విద్యార్థుల్ని మరియు అధ్యాపకుల్ని నిర్బంధం నుండి కాపాడారు. ప్రొఫెసర్ జయశంకర్ 1979 నుండి 1981 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం రిజస్ట్రార్ గాను, 1982 నుంచి 1991 వరకు సీఫెల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ గాను, 1991 నుంచి 1994 వరకు సీఫెల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గాను బాధ్యతలు నిర్వహించారు.
1969 లో తెలంగాణ రాష్ట్ర తొలి దశ ఉద్యమానికి మరియు 1996 లో ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర మలి దశ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ నాయకత్వం వహించి ముందుండి నడిపారు. 1999 లో తెలంగాణ డెవలప్మెంట్ ఫోరమ్ ను ఏర్పాటు చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణ సమస్యలపై పరిశోధన, ప్రచురణలో భాగమైన తెలంగాణ అధ్యయన కేంద్రానికి ఛైర్మన్ గాను ఆయన పనిచేశారు. అసంఘటిత రంగంలోని సంస్థల జాతీయ కమిషన్లో సభ్యుడిగాను 2004--2006 వరకు ఆయన కొనసాగారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటులో కె.చంద్రశేఖరరావుకు ప్రొఫెసర్ జయశంకర్ మార్గదర్శకులుగా వ్యవహరించి తెలంగాణ రాష్ట్ర సాధనకు 'సరికొత్త ఊపిరి'ని అందించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై నియమించబడ్డ అనేక కమిటీలకు గణాంకాలతో సహా పలు నివేదికలు ఆయన అందించారు.
తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో విశేష ప్రావీణ్యం ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ 'ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత'ను నొక్కి చెప్తూ తెలంగాణ రాష్ట్రం ఒక డిమాండ్, వక్రీకరణలు - వాస్తవాలు, తల్లడిల్లుతున్న తెలంగాణ (వ్యాస సంపుటి) తదితర రచనలు చేశారు. ప్రపంచమంతా పరివ్యాప్తమయ్యేలా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ఆయన అనేక వ్యాసాలు రాశారు. అలాగే ఉపన్యాసాల ద్వారా కూడా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పలు జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద గళం విప్పారు.
ప్రొఫెసర్ జయశంకర్ను అందరూ 'తెలంగాణ సిద్ధాంతకర్త'గా భావించేవారు. కాని 'నన్ను ఎప్పుడూ నేను సిద్ధాంతకర్తగాను భావించుకోలేదు. నేను తెలంగాణ సిద్ధాంతకర్తను కాను. నన్ను ఆ విధంగా సంభోదించకండి' అని ఆయన అనేక సందర్భాల్లో పేర్కొన్ననూ ఆయన జనం నోళ్లలో 'తెలంగాణ సిద్ధాంతకర్త'గా ప్రతిధ్వనిస్తూనే ఉన్నారు. 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్లారా చూసిన తర్వాతే చనిపోవాలి' అని ప్రొఫెసర్ జయశంకర్ తన సన్నిహితుల వద్ద తరచుగా ప్రస్తావించేవారు. కాని ఆయన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం కాకముందే 2011 జూన్ 21 నాడు మరణించారు. తన జీవితాన్ని యావత్ తెలంగాణ ప్రజానీకం కోసం అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం కోసం తుదిశ్వాస విడిచేవరకు ఉద్యమించిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మహోజ్వలంగా వెలుగొందుతూనే ఉన్నారు. అంతే కాకుండా అనేక ప్రజాస్వామిక ఉద్యమాలకు ఆయన ఒక 'దారిదీపం'లా ప్రభవిస్తున్నారు. అంతిమంగా ప్రగతిశీల తెలంగాణ ప్రజానీకం భౌగోళిక తెలంగాణాని బద్దలు కొట్టి 'ప్రజాస్వామిక తెలంగాణ'ని సాకారం చేసే దిశగా ఉద్యమించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి కాగలదు.
( జూన్ 21 ప్రొఫెసర్ జయశంకర్ 15 వ వర్ధంతి)

జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690



## ప్రతి కార్మికుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

**● మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్ రెడ్డి**



**తాండూరు, జూన్ 20 (జనంసాక్షి) :** ప్రతి కార్మికుడు నెలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పి. నీరజాబాల్ రెడ్డి తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పాతకిండ్, యశోద హాస్పిటల్ వారి సౌజన్యంతో మెగా హెల్త్ కంపెనీ నిర్వహించారు. ఈ క్యాంపును ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఆసుపత్రికి వెళ్లి చూయించుకోవాలని ఆమె వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కమిషనర్ రాకేష్ రెడ్డి, మేనేజర్ నరేందర్ రెడ్డి, ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ రాములు, యశోద హాస్పిటల్ కార్పొరేట్ రిలేషన్స్ డిప్యూటీ మేనేజర్ ఎన్.శ్రీధర్, డాక్టర్లు వీరారెడ్డి, అఖిల్, నీలోఫర్, కౌన్సిలర్లు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

**● ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**● రూ. 1.45 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన**



**రాజేంద్రనగర్, జూన్ 20 (జనంసాక్షి) :** ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని అత్తాపూర్, హైదర్‌గూడ డివిజన్లలో రూ.1.45 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు నారగూడెం మల్లారెడ్డి, మిద్దెల సురేష్ రెడ్డి, చెరుకు అమరేందర్, ఎస్. వెంకటేష్, ఎస్. విజయ్ కుమార్, కిరణ్ చారి, భాస్కర్ గౌడ్, పి. మహేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే బీఆర్ఎస్‌పై నిరాధార ఆరోపణలు

**ఇబ్రహీంపట్నం, జూన్ 20 (జనం సాక్షి) :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే శ్రీ మంచిరెడ్డి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ గద్దెనెక్కి మూడు సంవత్సరాలు కావస్తున్నా ప్రజల బతుకుల్లో ఎలాంటి మార్పు రాలేదని, పైగా పాత పథకాలకు మంగళం పాడుతూ ప్రజలను వంచిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం తన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల దృష్టిని మళ్లించేందుకు నిరంతరం గత కేసీఆర్ ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ కాలయాపన చేస్తోందని ఆయన ఆరోపించారు. శనివారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

### తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన కేసీఆర్..

ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన అద్భుత పాలనను గుర్తు చేసుకున్నారు. కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్యుత్, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో తెలంగాణ దేశానికే ఒక రోల్ మోడల్‌గా నిలిచిందని పేర్కొన్నారు. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేయడం ద్వారా కాంగ్రెస్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే దౌర్భాగ్యపు ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. "రైతుబంధు పథకం ద్వారా రాష్ట్రంలోని 72 లక్షల మంది రైతులకు ఎలాంటి నిబంధనలు లేకుండా పెట్టుబడి సాయం అందించాం. రైతు బీమా పథకం ద్వారా వేలాది రైతు కుటుంబాలకు ఆపదలో భరోసా కల్పించాం. దేశంలోనే అత్యధికంగా రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు




చేసిన రాష్ట్రంగా తెలంగాణను నిలిపాం" అని ఆయన గర్వంగా ప్రకటించారు. కానీ, నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అమలులో స్పష్టత లేకుండా వ్యవహరిస్తూ రైతాంగాన్ని తీవ్ర అయోమయానికి గురిచేస్తోందని విమర్శించారు. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని నమ్మబలికి, అధికారంలోకి వచ్చాక వందల నిబంధనలు, ఆంక్షలు పెట్టి రైతులను దారుణంగా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు చెప్పిన మాటలకు, అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న పనులకు అస్సలు పొంతన లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించిన ఆరుట్ల మోడల్ స్కూల్ అంశంపై మంచిరెడ్డి కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. "ఆరుట్ల మోడల్ స్కూల్‌ను నిర్మించింది ముమ్మాటికీ కేసీఆర్ ప్రభుత్వమే. గత ప్రభుత్వం నిర్మించిన స్కూల్ బిల్డింగ్‌కు కేవలం సున్నాలు, కొత్త రంగులు వేసి.. దాన్ని తామే కట్టించినట్టు కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదం, సిగ్గుచేటు. సొమ్ము ఒకరిది.. సోకు ఒకరిది అన్నట్టుగా కాంగ్రెస్ తీరు ఉంది" అని దుయ్యబట్టారు.

### నియోజకవర్గ నిధులపై శ్వేతపత్రం ఎక్కడ..?

స్థానిక నియోజకవర్గ ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే పూర్తిగా వైఫల్యం చెందారని కిషన్ రెడ్డి ఆరోపించారు. "ఇప్పటికే ఈ నియోజకవర్గానికి నాలుగు సార్లు ముఖ్యమంత్రి విచ్చేశారు. సీఎం రాకతో ఇబ్రహీంపట్నానికి ఎన్ని వందల కోట్ల నిధులు వచ్చాయో స్థానిక ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి. ఎమ్మెల్యే నియోజకవర్గం కోసం అసలు ఎన్ని నిధులు అడిగారో, ఏం సాధించారో నిరూపించే దమ్ముందా?" అని సవాల్ విసిరారు. నియోజకవర్గంలోనే అతిపెద్ద గ్రామమైన ఆరుట్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని సర్పంచ్ వినతిపత్రం ఇస్తే, దానిని పక్కన పెట్టడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు నియోజకవర్గ ప్రయోజనాల కంటే తన మంత్రి పదవి వ్యామోహమే ఎక్కువైందని, అందుకే గ్రామాల్లో పక్షపాత రాజకీయాలు చేస్తూ అభివృద్ధిని గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో యాసంగి, వానాకాలం పంటల ఉత్పత్తిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించామని, 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను రైతులకు అందించామని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. కానీ నేడు కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలను, హక్కులను కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం చేతకాక ప్రతిపక్షాలపై పడి ఏడవడం మానుకొని, ఇప్పటికైనా బూటకపు ప్రచారాలు ఆపి పాలనపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి హితవు పలికారు. ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. తెలంగాణ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం, నియోజకవర్గ ప్రజల హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉండి పోరాటాలు కొనసాగిస్తుందని మంచిరెడ్డి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, మొద్దు అంజిరెడ్డి, అల్వాల వెంకటరెడ్డి, మడుపు వేణు గోపాల్, కర్నాటి రమేష్ గౌడ్, చీరాల రమేష్, మాజీ ఎంపిపి కృపేష్, మున్సిపల్ కౌన్సిలర్ చిలుకల బుగ్గరాములు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం



**నిజాంపేట్, జూన్ 20 (జనం సాక్షి) :** కుతుబుల్లాపూర్ నియోజక వర్గం బాచుపల్లి పరిధిలోని విస్పర్ వ్యాలీ కాలనీ నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ని ఈ శనివారం బాచుపల్లి – నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని 274వ వార్డు, రాజీవ్ గాంధీ నగర్‌లో ఉన్న విస్పర్ వ్యాలీ కాలనీ నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులను అభినందించి, కాలనీ అభివృద్ధి కోసం తన సంపూర్ణ సహకారం మరియు మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం కమిటీ సభ్యులు కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలైన డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, తాగునీటి సరఫరాలో అంతరాయాలు, వీధి దీపాల కొరత తదితర సమస్యలను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. వారి వినతిని సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి, ఆయా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాలాజీ నాయక్, మాజీ కోఆప్షన్ సభ్యుడు చంద్రగిరి సతీష్, 20వ వార్డు బి.ఆర్.ఎస్. పార్టీ మహిళా అధ్యక్షురాలు సంధ్యా రాణి, ఉపాధ్యక్షురాలు పద్మావతి, ప్రధాన కార్యదర్శి నాగమణి, సోషల్ మీడియా అధ్యక్షుడు విద్యాసాగర్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రాజు, ఉపాధ్యక్షుడు ప్రసాద్ రాజు, ప్రధాన కార్యదర్శి లీలావతి, సంయుక్త కార్యదర్శి పృథ్వీ కుమార్, కోశాధికారి రామకృష్ణ బండి, సత్యం వ్యాలీ వాసులు చిట్టిబాబు , ప్రసాద్, రామ్ ప్రసాద్, అశోక్, రదీప్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# పేద, మధ్య తరగతి తల్లిదండ్రులపై ఫీజుల భారం

**తాండూరు, జూన్ 20 (జనంసాక్షి) :** మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేవని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం బిఆర్ఎస్వి తాండూరు మండల కమిటీ ఆరోపించింది .శనివారం తాండూరు మండల విద్యాధికారి కార్యాలయంలో బిఆర్ఎస్వి నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేద మధ్య తరగతి తల్లిదండ్రులపై ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఫీజుల భారం మోపుతున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డొనేషన్లు, ఇతర పేర్లతో అదనపు వసూళ్లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అదే సమయంలో తాండూరు మండల ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, బెంచీలు, ల్యాబ్‌లు సరిగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రైవేట్ స్కూల్ ఫీజులపై తక్షణ తనిఖీలు చేసి, అధిక ఫీజులు నియంత్రించాలన్నారు.అదనంగా వసూలు చేసిన ఫీజులు తిరిగి తల్లిదండ్రులకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బడుల్లో వెంటనే మౌలిక వసతులు కల్పించాలన్నారు.ఎంఈఓ తక్షణ చర్యలు తీసుకోనిచో బిఆర్ఎస్ వి ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు




చేపడతామని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఎవరూ చెలగాటమాడేందుకు వీల్లేదన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ తాండూరు మండల కమిటీ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు, వినోద్ కుమార్, కొర్ర సందీప్ నాయక్, షోహెబ్, భాను, మజార్, తోఫిక్, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాల సన్నద్ధతపై చర్యలు చేపట్టాలి

**● శంషాబాద్ జోనల్ కమిషనర్ కె. చంద్రకళ**



**రాజేంద్రనగర్, జూన్ 20 (జనంసాక్షి) :** వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఫీల్డ్ స్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని శంషాబాద్ జోనల్ కమిషనర్ కె. చంద్రకళ ఆదేశించారు.శంషాబాద్ సర్కిల్18 జోనల్ కమిషనర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మాన్సూన్ సన్నద్ధత, పారిశుద్ధ్యం, టౌన్ ప్లానింగ్, ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లు, వెటర్నరీ, ఇంజినీరింగ్, ఎంటమాలజీ, స్ట్రీట్ లైట్స్, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, అర్బన్ బయోడైవర్సిటీ తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో సూపరింటెండింగ్ ఇంజినీర్ కిష్టప్ప, జాయింట్ కమిషనర్ రాజు, డిప్యూటీ కమిషనర్ బి. సుమన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కళాశాల హాస్టల్ వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి



**చేవెళ్ల, జూన్ 20 (జనంసాక్షి) :** చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో శనివారం బీసీ కళాశాల హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. హాస్టల్ వార్డెన్ విధుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. పదిహేను రోజులు గడుస్తున్నా ఒకసారి మాత్రమే హాస్టల్ విజిట్ చేసి చేపిస్తామని చెప్పడమే కానీ ఇప్పటివరకు విద్యార్థులకు ఉదయం 10 గంటలు దాటినా విద్యార్థులకు అల్పాహారం అందించడం లేదని, దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జూన్ నెలలో అడ్మిషన్లు ప్రారంభమైన నేపథ్యంలో హాస్టల్‌లో సరైన వసతులు లేకపోవడం, వార్డెన్ నిర్లక్ష్య వైఖరి కారణంగా కొత్తగా చేరే విద్యార్థులు వెనుదిరిగే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్‌పై వెంటనే చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హాస్టల్ భవనంలో ఉన్న లీకేజీలను తక్షణమే మరమ్మతు చేయాలని, వర్షపు నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని, విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రావులపల్లి, మీర్జాగూడలో అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి పర్యటన



చేవెళ్ల, జూన్ 20 (జనంసాక్షి) : చేవెళ్ల మండల పరిధిలోని రావులపల్లి, మీర్జాగూడ గ్రామాల్లో రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి శనివారం ఆకస్మికంగా పర్యటించారు. గ్రామ పంచాయతీల్లోని నర్సరీ, పల్లె ప్రకృతి వనం, ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల, చెత్త డంపింగ్ యార్డులను సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. గ్రామాల్లో చేపట్టిన హరితహారం నర్సరీ, పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణ, మౌలిక వసతుల కల్పన, పలు అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ కలెక్టర్ వెంట ఎంపీడీవో బన్సీలాల్, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ శాఖ అధికారులు, వార్డు సభ్యులు కుమ్మరి గోపాల్, కౌకుంట్ల జ్యోతి వెంకటేష్, గోటూరి మల్లేశ్వరి హనుమంత్, మాజీ ఉప సర్పంచ్ పట్లోళ్ల నాగిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు కావలి సత్యనారాయణ, పట్లోళ్ల హన్మంత్ రెడ్డి, పల్లె సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## మచ్చ బొల్లారం 'ఆర్‌యూబీ' పనులను వేగవంతం చేయాలి



**అల్వాల్, జూన్ 20 (జనంసాక్షి) :** మచ్చ బొల్లారం జనప్రియ నగర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి పనులను శరవేగంగా పూర్తి చేయాలని రైల్వే అధికారులను బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం బీఆర్ఎస్ ముఖ్య నాయకుల బృందం నిర్మాణ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి, పనుల పురోగతిని సమీక్షించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో రోజురోజుకూ ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరుగుతోందని, ఆర్ యూబీ పనులు ఆలస్యం కావడం వల్ల వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యలను, ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రణాళికతో పనులను మరింత వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు డోలి రమేష్, పవన్, ఢిల్లీ పరమేష్, చరణ్ గిరి, రాజు, భాస్కర్ రెడ్డి, శోభన్ బాబు, లింగారెడ్డి, సాజిద్, సరిత, వర్షా హరిత తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాలపై అవగాహన

**శంకర్‌పల్లి, జూన్ 20 (జనంసాక్షి) :** మండలంలోని మోకిలా పోలీస్ స్టేషన్ పరిధిలో గల మోకిలా తాండాలో శనివారం సిఐ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...ఆన్లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని మరియు రోడ్డు భద్రత విషయంలో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి వేగాన్ని తగ్గించి ప్రయాణించాలని సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి భవిష్యత్తులో యువత తమ ఆశయాలను సాధించాలని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు సురేష్, చెన్నారెడ్డి, సాయి కృష్ణ, సిబ్బంది మరియు గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.



# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**● ఎమ్మెల్యే కాలే యాదయ్య**

**చేవెళ్ల, జూన్ 20 (జనంసాక్షి) :** వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని, రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శనివారం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాగుకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారా పంట దిగుబడులు పెంచుకోవచ్చని సూచించారు. రైతు కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని స్థిరమైన ఆదాయ వనరుగా మార్చేందుకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రైతులు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేవెళ్లే మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, కౌన్సిలర్ లు బండారి శైలజాఆగి రెడ్డి, మద్దెల శ్రీనివాస్, తాళ్ళపల్లి నర్సింహులు, సొసైటీ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ రాములు, మాజీ సర్పంచ్ లు పడాల ప్రభాకర్, మధుసూధన్ గుప్తా, మర్పల్లి క్రిష్ణా రెడ్డి, మద్దెల చింటు, వ్యవసాయ శాఖ అధికారులు, సురేష్



బాబు, మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్, బాలకోటేశ్వరరావు, కిరణ్మయి, గాయత్రి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# గ్రామాల రూపురేఖలు మార్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- 54 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- అర్హులందరికీ పెన్షన్లు అందేలా చూస్తాం
- ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ



**బెజ్జంకి, జూన్ 20 (జనం సాక్షి) :** మండలంలోని దేవక్కపల్లి,పేర్కబండ గ్రామాల్లో శుక్రవారం రూ.54 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు,అలాగే పోతారం గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులకు కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్,మానకొండూరు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్. కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది అనీ అన్నారు.ప్రజలకు అవసరమైన రహదారులు,డ్రైనేజీలు,తాగునీటి సదుపాయాలు తదితర అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి గ్రామాల రూపురేఖలు మార్చేందుకు కృషి చేస్తున్నాము అనీ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.57 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ సామాజిక భద్రతా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని,ప్రభుత్వం వారి దరఖాస్తులను పరిశీలించి అర్హులకు పెన్షన్లు మంజూరు చేస్తుందని అన్నారు.అనంతరం గాగిల్లాపూర్ గ్రామంలో ఇటీవల మరణించిన సీపీఐ నాయకుడు అన్నాడి మల్లారెడ్డి,బెజ్జంకిలో గుండెపోటుతో మృతిచెందిన బొమ్మిడి రాజు,బెజ్జంకి క్రాసింగ్‌లో అకాల మరణం చెందిన కూన బాలయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి,ధైర్యంగా ఉండాలని ఓదార్పునిచ్చారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్,మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ,వైస్ చైర్మన్ చిలువేరి శ్రీనివాస్ రెడ్డి,మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి,పోతారం సర్పంచ్ రాజు,దేవక్కపల్లి సర్పంచ్ నేరేళ్ల వెంకటలక్ష్మి-రాజయ్య,పేర్కబండ సర్పంచ్ కర్రావుల స్వప్న-మల్లేశం,బైర సంతోష్,ఎర్రల రాజు,ఒంటెల సంపత్ రెడ్డి,పర్స సంతోష్,రావుల నర్సయ్య,ఇస్కిల్లా ఐలయ్య మరియు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామచంద్రాపురం ఈఎస్ఐ ఆస్పత్రిలో మంత్రి ఆకస్మిక తనిఖీ



**రామచంద్రాపురం, జూన్ 20 (జనం సాక్షి) :** పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని రామచంద్రాపురం ఈఎస్ఐ ఆస్పత్రిని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ మంత్రితో కలిసి ఆస్పత్రిని పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, చికిత్సా విధానం, మౌలిక వసతులు, పారిశుద్ధ్య నిర్వహణ, సిబ్బంది పనితీరును వారు పరిశీలించారు. వార్డులను సందర్శించి రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆస్పత్రిలో అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ప్రైవేట్ పాఠశాలలలో అధిక ఫీజులను నియంత్రించాలి



**చిన్నశంకరంపేట, జూన్ 20 (జనం సాక్షి) :** మండలంలో ఉన్న అన్ని ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులను నియంత్రించాలని ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకుల ఆధ్వర్యంలో శనివారం మండల ఎంఈఓ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.బిఆర్ఎస్వి నాయకులు మాట్లాడుతూ, మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని వాటిని వెంటనే నియంత్రించాలని దీని ద్వారా పేద మధ్యతరగతి ప్రజలకు ఇబ్బంది అవుతుందని ప్రైవేట్ పాఠశాలలో పేద విద్యార్థులకు 50 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కానీ ప్రైవేట్ పాఠశాల యజమాన్యాలు ఇందుకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ వారి పాఠశాలల్లోనే బ్యాగులు పుస్తకాలు విక్రయిస్తూ పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని అధికారులు ఇది గమనిస్తున్న చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు సరిగ్గా లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, వాటిని కూడా వెంటనే పరిశీలించి సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలను కూడా ముట్టడిస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు ఇమ్మడి నరేష్, అతెల్లినాగరాజు,గోపాల్ నాయక్, పోతరాజు రాజు, బైండ్ల రాజకుమార్, నవీన్, గణేష్,సతీష్, రాజు,వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలో క్రమశిక్షణ ముఖ్యం

**నారాయణపేట, జూన్ 20 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మహిళల రక్షణ కొరకు పోలీసు చట్టాల గురించి, షీటీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాల గురించి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అవగాహన కల్పించారు.ర్యాగింగ్ ఇవిటీజింగ్ ,పోక్సో,షీ టీమ్స్ ,యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి, అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్ మాటలు నమ్మవద్దు అని సూచించారు,సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుంది అని మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం, మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత అని అన్నారు.చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దు అన్నారు, ప్రతి ఒక్కరు చదువుపై దృష్టి సారించాలని తెలిపారు,డ్రగ్స్,ఇతర మత్తు పదా ర్థాలపై అప్రమత్తంగా ఉండా లన్నారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని అన్నారు. పిల్ల లను చదివించటానికి తల్లి దండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదు వుపై శ్రద్ధ వహించాలని, సామాజిక రుగ్మతల గురించి సెల్ఫోన్ కు ఎంత దూరం ఉంటే అంత మంచిదనీ సెల్ ఫోన్ వల్ల ఎంత



మంచి ఉందో అంత చెడు ఉంది దానికి అలవాటు పడి బానిసలు కావద్దు విద్యార్థి దశ చాలా కీలక కష్టపడే తత్వం కష్టపడి చదువు కోవడం చాలా ముఖ్యమని అన్నారు.మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే,అవహేళనగా మాట్లాడిన వెంటనే డయల్ 100 లేదా షి టీమ్ ఫోన్ 8712670398 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. నూతన చట్టాల గురించి నూతన చట్టాలలో మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరిగిందని షి టీమ్ పోలీసులు బాలరాజు,చేనప్ప, జ్యోతి, కవిత అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉపా ధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవన స్థలాన్ని కాపాడాలి

- సంఘం అధ్యక్షులు మల్లేశం



**సదాశివపేట, జూన్ 20 (జనం సాక్షి) :** పట్టణంలోని వాటర్‌ట్యాంక్ సమీప దుర్గమ్మ ఆలయం వద్ద రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవన నిర్మాణం కోసం 2005లో అప్పటి ఎంపీ ఆలే నరేంద్ర, ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్‌రెడ్డి సహకారంతో 250 గజాల స్థలాన్ని కేటాయించారని సంఘ అధ్యక్షుడు నిమ్మాయిల మల్లేశం తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత 20 ఏళ్లుగా ఆ స్థలంలో జాతీయ పండుగల సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందన్నారు. అధికారులు వెంటనే స్పందించి సంఘానికి కేటాయించిన స్థలానికి రక్షణ కల్పించాలని కోరారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. త్వరలోనే అక్కడ సంఘ భవన నిర్మాణానికి చర్యలు చేపడతామని చెప్పారు. సమావేశంలో సంఘ పూర్వాధ్యక్షుడు బోడపల్లి శంకరప్ప, జిల్లా కౌన్సిల్ సభ్యుడు అంబటి విశ్వనాథం, కార్యదర్శి తుక్కుడేదాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గంలో కేసుల పరిష్కారం ఉత్తమం



**గద్వాల నడిగడ్డ, జూన్ 20 (జనం సాక్షి) :** ఏళ్లుగా పరిష్కారం కానీ వివిధ రకాల కేసుల్లో ఇబ్బందులు పడుతున్న కక్షిదారులకు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడమే ఉత్తమ మార్గమని మొదటి అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి రవికుమార్ పేర్కొన్నారు. గద్వాల కోర్టు ఆవరణలో శనివారం హైకోర్టు, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టుల్లో సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉన్న కేసులను పరస్పర రాజీ ద్వారా త్వరితగతిన పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఒక సమర్థవంతమైన వేదికగా పనిచేస్తోందన్నారు. కక్షిదారులు సమయం, ధనం, శ్రమను ఆదా చేసుకోవడంతో పాటు దీర్ఘకాలిక న్యాయ వివాదాలకు ముగింపు పలికి ప్రశాంతమైన జీవితం గడపడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పాత కేసులు పరిష్కారం కావడం ద్వారా న్యాయ వ్యవస్థపై ప్రజల కు విశ్వాసం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా వివిధ కారణాల వల్ల విచారణ కొనసాగుతున్న కేసులు కూడా లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం పొందుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా మోటార్ ప్రమాద పరిహార కేసులు, బ్యాంకు రుణాల వసూళ్ల కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు, తదితర సంబంధించి జిల్లా వ్యాప్తంగా మొత్తం 7046 కేసులను పరిష్కరించినట్లు వివరించారు. భవిష్యత్తులో కూడా ప్రజలు రాజీ కాగల కేసులను లోక్ అదాలత్ లో పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ దుర్వా, అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహులు, న్యాయవాదుల బృందం, సీఐలు, ఎస్సైలు, పోలీసు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ లో 816 కేసులు పరిష్కారం



**చేర్యాల, జూన్ 20 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని మున్సిఫ్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ లో 816 కేసులు పరిష్కారం అయినట్లు కోర్టు న్యాయమూర్తి బానోతు శ్రీరామ్ తెలిపారు. పరిష్కారం అయిన వాటిలో ఒకటి సివిల్ కేసు, 15 ఎక్సైజ్ కేసులు,23 పోలీస్ కేసులు, 23 బ్యాంకు కేసులలో వాది ప్రతివాదులు రాజీ కుదుర్చుకున్నారని తెలిపారు. 49 పోలీస్ కేసులలో 705 పెట్టి కేసులలో నేరస్తులకు జరిమానా విధించి కేసులు పరిష్కరించబడ్డాయని తెలిపారు.ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ... చిన్న చిన్న విషయాలకు తగదాలు పడి అనవసరంగా పంతాలకు పోకుండా ఇరు వర్గాలు రాజీ కుదుర్చుకొని లోక్ అదాలత్ లో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.

## చిన్నారుల ఆనందకర బాల్యానికి కృషి చేయాలి




**గద్వాల నడిగడ్డ, జూన్ 20 (జనం సాక్షి) :** చిన్నారులపై జరిగే వివిధ రకాల అఘాయిత్యాలను నివారించేందుకు వారి ఆనందకరమైన బాల్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు రాజేంద్ర అన్నారు. గద్వాల మండలంలోని గోనుపాడు గ్రామం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో "పిల్లలపై నేరాల నివారణ" అంశంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలపై జరిగే శారీరక, మానసిక, లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలల హక్కులను పరిరక్షించడం సమాజంలోని ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా వంటి సమస్యలు పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. అదే విధంగా పోక్సో చట్టం గురించి అవగాహన కల్పిస్తూ, పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడిన వారికి కఠినమైన శిక్షలు విధించబడతాయని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంరక్షకులు పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనించి, ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు శ్రీనివాసులు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు లక్ష్మన్న స్వామి, విద్యా శాఖ, భరోసా, సఖి సెంటర్ కోఆర్డినేటర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**మల్దకల్, జూన్ 20 (జనంసాక్షి) :** ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న అన్ని సౌకర్యాలతో పాటు వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు అన్నారు.శనివారం మల్దకల్ మండలంలోని కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలలో కల్పిస్తున్న సౌకర్యాలను తెలియజేసి విద్యార్థుల నమోదు శాతం పెంచే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. ప్రతిరోజు పాఠశాలల్లో పారిశుధ్యం పనులు పక్కాగా నిర్వహించాలని,వసతి గృహంలో మెనూ ప్రకారం నాణ్యమైన,పోషకాహారం అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం,భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తాగునీరు, పారిశుద్ధ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.విద్యార్థుల హాజరు,వారి విద్యా సామర్థ్యాలను నిరంతరం పర్యవేక్షిస్తూ వారికి నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత,పరిశుభ్రత విద్యా ప్రమాణాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## సీపీఎస్ ఉద్యోగులకు రిటైర్మెంట్ ఈహెచ్ఎస్ వర్తింపచేయాలి




**మల్దకల్, జూన్ 20 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టబోతున్న న్యూ హెల్త్ పథకంలో సిపిఎస్ ఉద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందని దీనిని గ్రహించిన టీఎస్ సిపిఎస్ ఈయు రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో మల్దకల్ మండల స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ శ్రీ సురేష్ కి సిపిఎస్ ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత కూడా ఎంప్లాయి హెల్త్ స్కీమ్ వర్తింపచేయాలని శనివారంవినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ఈ.హెచ్.ఎస్ సదుపాయంప్రస్తుతం సి.పి.ఎస్ ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత ఈ.హెచ్.ఎస్ సదుపాయం కల్పించడం లేదని,రిటైర్మెంట్ తర్వాత కూడా ఈ.హెచ్.ఎస్ వర్తింపచేయాలి.స్పష్టమైన సమ్మతి లేకుండా ఏ విధమైన కోతలు చేసే అధికారం ఎవరికీ లేదు.మా అనుమతి లేకుండా చేస్తున్న కోతలను వెంటనే నిలిపివేయాలి,ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.లేనిపక్షంలో, ఉద్యోగులందరితో కలిసి యూనియన్ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్,ప్రదీప్,రాఘవేంద్ర,బజారన్న,సాయన్న,లక్ష్మి,ఈశ్వరి బాయి,తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో భారీగా కేసుల పరిష్కారం

- ప్రజలు లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర



**సంగారెడ్డి, జూన్ 20 (జనం సాక్షి) :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నాల్సా), తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (టీఎస్ఎల్ఎస్ఏ) మార్గదర్శకాల మేరకు శనివారం సంగారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. భవాని చంద్ర ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు సులభమైన, వేగవంతమైన న్యాయం అందించడమే లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య తగ్గించడంతో పాటు పరస్పర అంగీకారంతో వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి ఎలాంటి కోర్టు ఫీజు ఉండదని, పెండింగ్ కేసులు రాజీ ద్వారా పరిష్కారమైతే చెల్లించిన కోర్టు ఫీజును తిరిగి చెల్లిస్తారని పేర్కొన్నారు. లోక్ అదాలత్ అవార్డు సివిల్ కోర్టు డిక్రీతో సమానమని, దీనిపై అప్పీల్‌కు అవకాశం ఉండదని వివరించారు.రాజీ చేయదగిన పోలీసు కేసులు, భార్యాభర్తల మధ్య చిన్నచిన్న వివాదాలు, బ్యాంకు, ఎక్సైజ్ తదితర కేసులను లోక్ అదాలత్ ద్వారా పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. క్షణికావేశంలో ఏర్పడిన చిన్నచిన్న తగాదాలతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోకుండా, రాజీ ద్వారా వివాదాలను ముగించుకుని సామరస్యంతో జీవించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి సతీష్ కుమార్, పోక్సో కోర్టు న్యాయమూర్తి శ్రీలేఖ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్యతో పాటు పలువురు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. సంజీవరెడ్డి, ప్రభుత్వ న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యున్నత వైద్యం అందించేలా చర్యలు

- నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, జూన్ 20 (జనంసాక్షి) :** ప్రజలందరికీ మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శనివారం ఆయన నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్న ఓపీ సేవల నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ సగటున నమోదవుతున్న ఓపీ వివరాలతో పాటు, ఏ విభాగాలకు చెందిన చికిత్సల కోసం ఎక్కువ మంది రోగులు వస్తున్నారో ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని సందర్శించి, రోగులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందించాలని, అవసరమైన వారికి తక్షణమే రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. రోగుల సౌకర్యార్థం వివిధ విభాగాలను సూచించే సైన్ బోర్డులను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆసుపత్రికి సంబంధించిన రికార్డులను పరిశీలించిన కలెక్టర్, ప్రతి రికార్డును పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ విభాగాన్ని పరిశీలించిన ఆయన, ఇంకా పూర్తి కావాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శారద, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ మహిళా సంఘాల బలోపేతానికి మౌలిక వసతుల కల్పన

- కోగిల్వాయిలో వీఓ భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయి



**ఆత్మకూర్ / దామెర జూన్ 20 (జనం సాక్షి):** గ్రామీణ మహిళా సంఘాల సాధికారత, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాల విస్తరణకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయి తెలిపారు. శనివారం హనుమకొండ జిల్లా దామెర మండలం కోగిల్వాయి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) - సెర్ప్ కన్వర్జెన్స్ ఆధ్వర్యంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న విలేజ్ ఆర్గనైజేషన్ (వీఓ) భవనం నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా సంఘాలు గ్రామీణ ఆర్థికాభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తున్నాయని, వాటి కార్యకలాపాల నిర్వహణకు శాశ్వత భవనాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణకు ఈ భవనం దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అదే ప్రాంగణంలో కలెక్టర్ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, నాటిన మొక్కలను సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలని గ్రామస్థులకు సూచించారు. తదుపరి కోగిల్వాయి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులతో మమేకమై వారి విద్యా పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు, వంటశాల నిర్వహణను తనిఖీ చేశారు. పిల్లలకు పోషకాహారం అందేలా సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అలాగే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ఆత్మీయంగా మాట్లాడారు. కేంద్రంలో అందిస్తున్న పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలు, చిన్నారుల హాజరు, ఆరోగ్య పరిరక్షణ చర్యలను పరిశీలించారు. బాలల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలకమని పేర్కొంటూ సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీను, ఎంపీడీవో కల్పన , తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి, ఏపీఓ అశోక్, గ్రామ సర్పంచ్ చుక్క వనిత, మహిళా సంఘాల ప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడిన వారిని 'రహవీరులు'గా గుర్తింపు

- రూ.25 వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేత
- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 20(జనంసాక్షి):** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వ్యక్తులకు సకాలంలో సహాయం చేసి వారి ప్రాణాలను కాపాడిన వారిని కేంద్ర ప్రభుత్వం "రహవీర్" లుగా గుర్తించి ప్రోత్సహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి, అత్యంత కీలకమైన గోల్డెన్ అవర్ (మొదటి 60 నిమిషాలు) లోపు సమీప ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడేందుకు సహకరించిన వ్యక్తిని రహవీర్ గా గుర్తిస్తారని తెలిపారు. ఈ పథకం కింద ప్రమాద బాధితులకు సకాలంలో సహాయం చేసి ఆసుపత్రికి చేర్చిన ప్రతి రహవీర్‌కు రూ.25,000 నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం అందజేయబడుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఎంపికైన ఉత్తమ 10 మంది రహవీర్లకు రూ.1,00,000 చొప్పున జాతీయ అవార్డు ప్రదానం చేయబడుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాద బాధితులను రక్షించేందుకు ముందుకు వచ్చే వ్యక్తులకు ఎలాంటి చట్టపరమైన ఇబ్బందులు ఎదురుకావని, ప్రభుత్వం వారికి పూర్తి రక్షణ కల్పిస్తుందని స్పష్టం చేశారు. ప్రజలందరూ రహవీర్ పథకం గురించి అవగాహన పెంపొందించుకొని, ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో మానవతా దృక్పథంతో స్పందించి బాధితులకు తక్షణ సహాయం అందించి అమూల్యమైన ప్రాణాలను కాపాడాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలియజేయాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 20(జనంసాక్షి):** జిల్లాలో ఈ నెల 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు నిర్వహించనున్న 'ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ' కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలిసేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శనివారం ఉదయం కలెక్టరేట్ భవన సముదాయం నుండి వివేకానంద చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా నిర్వహించిన 2ఖ రన్ ను అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ తో కలిసి ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ?ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని మొత్తం 678 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈ ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, విజయవంతంగా సాగాలని అధికారులను ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు (బీ ఎల్ ఓ ) తప్పనిసరిగా ప్రతి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడంతో పాటు మార్పులు చేర్పులను సక్రమంగా చేపట్టాలని సూచించారు. బిఎల్ఓ యాప్ ద్వారా ఈ వివరాల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ?ఈ ఓటరు సవరణ ప్రక్రియను ఒక బాధ్యతాయుతమైన కార్యక్రమంగా భావించి, దీని విజయవంతానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ పెద్దలు, యువజన సంఘాలు,విద్యార్థులు పూర్తి స్థాయిలో సహకరిస్తూ భాగస్వాములు కావాలని కోరారు. ఓటరు నమోదుపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మీడియా పాత్ర ఎంతో కీలకమని, పత్రికలు,ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఈ సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ?ఈ అవగాహన 2ఖ రన్ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, యువజన సంఘాల ప్రతినిధులు, కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు కొనసాగుతుంది అన్నారు. కేంద్రాలు జిల్లా వ్యాప్తంగా 678 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయనే అన్నారు.బీ ఎల్ ఓ ల ద్వారా ఇంటింటి సర్వే, బీ ఎల్ ఓ యాప్ ద్వారా వివరాల నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై సమీక్ష

**వరంగల్ ప్రతినిధి, జూన్ 20 (జనంసాక్షి):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు పురోగతిపై జిల్లా కలెక్టర్ డా. సత్య శారద సంబంధిత శాఖల అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలు, కార్యక్రమాల అమలు పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షణ తప్పని సరి అని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ అంకిత్ కుమార్,అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,జడ్పి సీఈఓ రాంరెడ్డి,డి ఆర్వో విజయ లక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని తమ శాఖల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు.

# ముధోల్ నియోజకవర్గంలో రైతన్నకు అండ

- 35 గ్రామాల్లో రూ.10.50 కోట్లతో గోదాముల నిర్మాణానికి శ్రీకారం



**ముధోల్, సెప్టెంబర్ 20(జనం సాక్షి) :** రైతులు పండించిన పంటను దళారులకు అమ్మకుండా, నిల్వ చేసుకుని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకునేలా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రత్యేక చొరవ చూపారు. నియోజకవర్గంలోని 35 గ్రామాల్లో ఒక్కో గోదాముకు రూ.30 లక్షల చొప్పున మొత్తం రూ.10 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో బాసర మండలంలోని టాక్లి, కిర్గుల్ (కే), బైంసా మండలంలోని బిజ్జూర్, వానల్‌పాడ్, మహాగాం, కుంసర, ఇలేగాం, కుబీర్ మండలంలోని పార్డి (బి), పార్డి (కే), పల్సి, హంపోలి, కుంటాల మండలంలోని లింబా (కే), లింబా (బి), విట్టాపూర్, పెంచికల్‌పాడ్, ఓలా, లోకేశ్వరం మండలంలోని ధర్మోరా, పిప్రి, అబ్దుల్లాపూర్, కనకాపూర్, నరసింహనగర్ తాండ, ముధోల్ మండలంలోని గన్నోరా, ముద్గల్, బోరిగాం, అష్ట, రాంటేక్, నర్సాపూర్ మండలంలోని తిమ్మాపూర్, డోంగుర్‌గావ్, నందన్, తానూర్ మండలంలోని బోరిగాం, బామ్ని, బొంద్రట్, భోసి, బెల్‌తరోడా గ్రామాల్లో గోదాములు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పటేల్ మాట్లాడుతూ, "గత పదేళ్ల పాలనలో వెనుకబడిన ముధోల్ నియోజకవర్గం ఇప్పుడు అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. రైతు పండించిన పంటకు భరోసా కల్పించడానికే ఈ గోదాములు. ఇకపై గ్రామాల్లోనే పంట నిల్వ చేసుకునే సౌకర్యం ఉంటుంది" అని తెలిపారు. ముధోల్ నియోజకవర్గ చరిత్రలోనే ఒకేసారి ఇన్ని గ్రామాల్లో గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం ఇదే తొలిసారి కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

# 10.5 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ల అభివృద్ధికి కృషి


- భూపాలపల్లి బస్టాండ్ సెంటర్ రూపు రేఖలు మారుస్తా
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి నియోజకవర్గంలో 10.5 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని, భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ రూపు రేఖలు మార్చి, అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. నియోజకవర్గంలో ప్రయాణికులకు ఊరట కలిగించే విధంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక చొరవ తీసుకుని 5 బస్టాండ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. శనివారం ఆర్టీసీ ఈడీ రాజశేఖర్, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పలు బస్టాండ్ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవిష్యత్ రద్దీని దృష్టిలో ఉంచుకొని డిజైన్లు తయారు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. నియోజకవర్గంలోని రేగొండలో కొత్త బస్టాండ్ నిర్మాణం కోసం రూ.3.7 కోట్లు, చెల్పూర్ బస్టాండ్ కొత్త బస్టాండ్ నిర్మాణం కోసం రూ.5 కోట్లు, గణపురం పాత బస్టాండ్ అభివృద్ధి కోసం రూ.1 కోటి, చిట్యాల పాత బస్టాండ్ అభివృద్ధి కోసం రూ.30 లక్షలు మంజూరు చేయగా, భూపాలపల్లి బస్టాండ్ సమగ్ర అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కేవలం ప్రయాణికుల సౌకర్యాలు మాత్రమే కాదు. బస్టాండ్లలో కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించి ఆర్టీసీకి అదనపు ఆదాయం సమకూర్చాలని సూచించారు. తొందరలోనే దుకాణాలు, ఫుడ్ కోర్టులు, పార్కింగ్ తదితర సౌకర్యాలతో ఆధునిక బస్టాండ్లు రానున్నాయని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల సామాన్య ప్రజలకు మేలు జరుగుతోందని అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సేవా దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ, ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నీట్ రీ-కండక్ట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఈ నెల 21న ఆదివారం జరిగే నీట్ రీ-కండక్ట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి కంట్రోల్ రూమ్, హాళ్లు పరిశీలించారు. పరీక్ష మధ్యాహ్నం 2:00 నుండి సాయంత్రం 5:15 వరకు ఉంటుంది. ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 1:30 వరకు విద్యార్థులను అనుమతిస్తారు. బయోమెట్రిక్, సీసీటీవీ, సిగ్నల్ జామర్లు, జనరేటర్ బ్యాకప్ సిద్ధం చేశారు. ప్రతి కేంద్రం వద్ద తహసిల్దార్, ఎస్ఐ, 4 మంది పోలీస్ బందోబస్తు ఉంటుంది. మహిళా అభ్యర్థులకు మహిళా సిబ్బందితో తనిఖీలు ఉంటాయని, మెడికల్ క్యాంప్, అంబులెన్స్ అందుబాటులో ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎఏస్పీ నరేష్ కుమార్, డిఆర్ఓ వసంత కుమారి, డీఈఓ రాజేందర్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏ రమణా రావు పాల్గొన్నారు.

# బాయిల్డ్ రైస్ మిల్లింగ్ ప్రక్రియ సమన్వయంతో పూర్తి చేయాలి


- ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రైస్ మిల్లర్లు సహకరించాలి...
- మిల్లింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి..
- అదనపు కలెక్టర్ సి హెచ్ మహేందర్ జి



**ములుగు ప్రతినిధి,జూన్20(జనం సాక్షి):** బాయిల్డ్ రైస్ మిల్లింగ్ ప్రక్రియను సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి సంబంధిత అధికారులను,రైస్ మిల్లర్లను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్ మహేందర్ జి తన ఛాంబర్‌లో బాయిల్డ్ రైస్ మిల్లర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ధాన్యం సేకరణ, మిల్లింగ్ ప్రక్రియను ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మిల్లర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. మిల్లింగ్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం, మిల్లర్లు, సంబంధిత శాఖల మధ్య సమన్వయం మెరుగ్గా ఉంటే ప్రక్రియ మరింత వేగవంతంగా పూర్తవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఫైజల్ హుస్సేన్, డి యం కృష్ణ వేణి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్,రైస్ మిల్లర్లు పాల్గొన్నారు. సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సం.. పలువురి ఇళ్లు ధ్వంసం!





**మంగపేట జూన్ 20(జనంసాక్షి) :** మండలంలోని వాగొడ్డుగూడెం, కత్తిగూడెం గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వీచిన బలమైన ఈదురుగాలులు, భారీ వర్షం తీవ్ర బీభత్సాన్ని సృష్టించాయి. ఈ ప్రకృతి వైపరీత్యం వల్ల పలు కుటుంబాలు తమ ఇళ్లను కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఈ గాలి వాన బీభత్సవానికి నలుగురికి గాయాలు అయ్యాయి. వాగొడ్డుగూడెం గ్రామానికి చెందిన ఎస్కే షారుక్ ఇల్లు గాలివాన ధాటికి పూర్తిగా కూలిపోయింది. ప్రమాద సమయంలో ఇంట్లోనే ఉన్న షారుక్ తండ్రి ముస్తఫా, భార్య ఆయేషా, తమ్ముడు ఫరూక్, మామ సయ్యద్ బడాలకు స్వల్ప గాయాలయ్యాయి. ఇంట్లోని గృహోపకరణాలు, నిత్యావసర సామగ్రి పూర్తిగా ధ్వంసమయ్యాయి. కూలి పనులకు వెళ్తే గానీ పూట గడవని ఈ పేద కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని బిఆర్ఎస్ జిల్లా నాయకులు బాడిశ నాగ రమేష్ కోరారు. అదేవిధంగా కత్తిగూడెం గ్రామంలో కాయం జయసుధ, పల్లిశెట్టి రాజేష్‌లకు చెందిన ఇళ్లు గాలివాన బీభత్సానికి పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇదే గ్రామానికి చెందిన దాసరి సతీష్ ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. బాధితులందరికీ ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందించి అండగా నిలవాలని నాగ రమేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు రొడ్డ సుదర్శన్, కొమరం పుల్లారావు, పండా శ్రీను, సోయం సీతయ్య, స్థానిక నాయకులు మండల సంతోష్, మునిగేల మహేష్, నిట్టా బన్ను, బాడిశ శ్రవణ్, కొమరం శివాజీ, పాగా కేశవరావు, సుధాకర్, సానాపురి శేఖర్, వరప్రసాద్ ఉన్నారు. అలాగే గ్రామస్థులు మండల పూర్ణ, మెరుగు సీతారాములు, వేల్పుల శశి, సోషల్ మీడియా వారియర్ మునిగేల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంఘమిత్ర కళాశాలలో సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ తరగతులు పూర్తి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సంఘమిత్ర డిగ్రీ, పీజీ కళాశాలలో మహేంద్ర ప్రైడ్ నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఇంటర్వ్యూ ప్రిపరేషన్, ఇంగ్లీష్ కెరీర్ లాంగ్వేజ్, గ్రూప్ డిస్కషన్, పబ్లిక్ స్పీకింగ్, క్రిటికల్ థింకింగ్, గోల్ సెట్టింగ్ లాంటి స్కిల్స్ పై జూన్ 15 నుండి 20 వరకు మహేంద్ర ప్రైడ్ ఫ్యాకల్టీ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరిగింది. శనివారం కళాశాలలో నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హరికృష్ణ పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గోల్ ను ఎంచుకొని దాన్ని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు.

# విజయవంతంగా జాతీయ లోక్ అదాలత్



**వరంగల్ ఈస్ట్, జూన్ 20 (జనం సాక్షి) :** జాతీయ లోక్ అదాలత్ లో వరంగల్ జిల్లా వ్యాప్తంగా - 10 బెంచీలను వరంగల్ జిల్లాలో-08, నర్సంపేట- 02 బెంచీలను ఏర్పాటు జరిగింది. మొత్తం-4489 పెండింగ్ కేసులను పరిష్కరించడం జరిగింది. ఇందులో సివిల్ కేసులు-33, క్రిమినల్ కేసులు-4456 మరియు బ్యాంక్ పి.ఎల్.సి. కేసులు-34,బిఎస్ఎన్ఎల్-19, ఎలక్ట్రిసిటి పి.యల్.సి.కేసులు-65, ట్రాఫిక్ ఈ-ఛాలన్ పెట్టి కేసులు- 68,373 సైబర్ క్రైమ్-15 పరిష్కరించారు. ఈ జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా ముగించడంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ న్యాయసేవాధికార సంస్థ ద్వారా వరంగల్, హన్మకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు ఇరువురు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
21 జూన్ 2026

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

**● ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



**భూదాన్ పోచంపల్లి, జూన్ 20 (జనం సాక్షి) :** బోధిధర్మ యోగా అండ్ హెల్త్ అసోసియేషన్ అధ్యక్షులు సీత భాస్కర్ అధ్యక్షతన, అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. యోగ శిక్షకురాలు కొయ్యడ సంధ్యా కాశీనాథ్ ఆధ్వర్యంలో వివిధ యోగాసనాలను ప్రదర్శించి పాల్గొన్న వారితో యోగా చేయించారు. అనంతరం మండలంలోని వివిధ పాఠశాలల్లో ఎస్ఎస్సీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు అందజేసి శాలువాలతో సన్మానించారు. అలాగే మున్సిపల్ కౌన్సిలర్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, భారతీయ ఋషులు ప్రపంచానికి అందించిన యోగాను ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. యాంత్రీకరణ పెరగడంతో శారీరక శ్రమ తగ్గిపోతున్న నేపథ్యంలో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని అధిగమించేందుకు ప్రతిరోజూ కనీసం 15 నుంచి 20 నిమిషాల పాటు యోగా, వాకింగ్ చేయడం అవసరమని పేర్కొన్నారు. యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. యోగాను ప్రజల్లో విస్తృతంగా ప్రాచుర్యంలోకి తీసుకురావడంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బోధిధర్మ యోగా అండ్ హెల్త్ అసోసియేషన్ సేవలను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, ఎంపీడీవో విజయ, ఎస్సై భాస్కర్ రెడ్డి, నాయకులు భారత లవ కుమార్, ఉప్పునూతల వెంకటేష్, పాక మల్లేష్ యాదవ్, వివిధ గ్రామాల సర్పంచ్ లు పక్కీరు లతా నర్సిరెడ్డి, సిలువేరు లక్ష్మయ్య, కాసుల అంజయ్య గౌడ్, ఆర్ల వెంకటేష్, యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతల రామకృష్ణ, ఉపాధ్యక్షులు కొయ్యడ లింగస్వామి, కడవేరు చంద్రశేఖర్, కోశాధికారి కొండమడుగు మల్లేష్, సహాయ కార్యదర్శులు దోర్నాల బాలరత్నం, రణం రాజశేఖర్, యోగ ఆర్గనైజర్ బావండ్ల రాజు, కార్యవర్గ సభ్యులు దోర్నాల బాలరాజు, వీడెం విష్ణు, కటిక ఐలయ్య, సీత జగదీష్, వ్యవస్థాపక సభ్యులు కేమ విష్ణుమూర్తి, చింతకింది కిరణ్, సిలువేరు బాల నరసింహ, సభ్యులు వీడేం రామనాథం, ఈపూరి ముత్యాలు, సంఘం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పైలాన్ ప్రాజెక్ట్ పనులను పరిశీలన చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**కనగల్లు, జూన్ 20 (జనం సాక్షి) :** హ్యామ్ ప్రాజెక్టు ద్వారా మంజూరైన 14వేల 500 కోట్ల రూపాయల నిధులతో రాష్ట్రంలో నిర్మించే నాలుగు లైన్ల మెరుగైన రహదారుల నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా త్వరలో శంకుస్థాపన చేయనున్న పైలాన్ ప్రాజెక్టు పనులను శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో అధికారులతో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పరిశీలన చేశారు. పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని కురంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు పథకం కింద నిర్మించిన ఇల్లును మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్థానిక సర్పంచ్ ఓర్స్ పెంటయ్యతో కలిసి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి పూరి గుడిసెలేని గ్రామంగా ఉంచుతామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బి చంద్రశేఖర్, ఎస్పి శరత్చంద్ర పవర్, ఆర్ అండ్ బి ఎస్ సి శ్రీధర్ రెడ్డి, డి ఈ గణేష్, ఆర్డీవో వై అశోక్ రెడ్డి, ఇరిగేషన్ సి ఈ శ్రీనివాస రెడ్డి, మార్కెట్ చైర్మన్ జూకుర్ రమేష్, తహసిల్దార్ పద్మ, ఎంపీడీవో వేద రక్షిత, ఎస్సై రాజీవ్ రెడ్డి, ఎక్స్ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ఎక్స్ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, ఆర్టిఏ జిల్లా సభ్యులు కే రాజిరెడ్డి, స్థానిక సర్పంచ్ నర్సింగ్ మురళీధర్ గౌడ్ తదితరులున్నారు.

## డిజిటల్ లిటరసీ, ఏఐ నైపుణ్యంతో ఉజ్వల భవిష్యత్

**● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**కోదాడ, జూన్ 20 (జనం సాక్షి) :** డిజిటల్ లిటరసీ, ఏఐ కోర్సు శిక్షణ నైపుణ్యంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శనివారం కోదాడ పట్టణంలో ఈఎంసీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు 9,10 వ తరగతి తరగతి విద్యార్థుల కోసం ఈనెల 15 నుండి 20వ తేదీ వరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక డిజిటల్ లిటరసీ, ఏఐ కోర్సు శిక్షణ ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏఐ కోర్సు సిలబస్ పుస్తకాలతో కంప్యూటర్ ఆపరేటింగ్, చాట్ జిపిటి, ఏఐ స్కిల్స్ అప్లికేషన్, డిజైన్ థింకింగ్, మేకింగ్ ఆఫ్ కోడింగ్, పెయింటింగ్, విషయాలను విద్యార్థులు నేర్చుకోవడం వలన సబ్జెక్టు విషయాలకు అన్వయించుకుని, సాఫ్ట్వేర్ రంగంలో ఉజ్వల భవిష్యత్తును సాధించవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డిఓ సూర్యనారాయణ, తాసిల్దార్ సంతోష్ కిరణ్ , ఎం ఈ ఓ సలీం షరీఫ్,పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు డి. మార్కండేయ, డిజిటల్ లిటరసీ, ఏఐ శిక్షణ మాస్టర్స్ ధీరజ్, రవితేజ, నాని, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇన్సూరెన్స్‌ను పెంచి హెల్త్ కార్డులు ఇవ్వాలి

**● ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు)**



**ముషీరాబాద్, జూన్ 20 (జనం సాక్షి) :** న్యాయవాదులందరికీ ఇన్సూరెన్స్ మొత్తాన్ని పెంచి, హెల్త్ కార్డులు ఇవ్వాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) డిమాండ్ చేసింది. ఈ మేరకు హైదరాబాద్, ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద శనివారం ఐలు రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలు రాష్ట్ర అధ్యక్షుడు, గౌరవ అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి కే. పార్థసారథిలు మాట్లాడుతూ.. బార్ కౌన్సిల్ లో నమోదై ఉన్న న్యాయవాదులందరికీ ప్రస్తుతమున్న రెండు లక్షల ఇన్సూరెన్స్ కవరేజ్ ను 10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. వైద్య భీమ పరిధి పెంపుతో పాటుగా కుటుంబ సభ్యుల పేర్లను కూడా చేర్చాలన్నారు. అదేవిధంగా ప్రసూతితో సహా అన్ని రకాల అనారోగ్యాలను వైద్య బీమా పరిధిలోకి తీసుకురావాలన్నారు. జిల్లా, పట్టణాల్లో న్యాయస్థానం ఉన్న చోటనే ఆసుపత్రులను ఎం ప్యానల్ చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ ట్రస్టుకు అదనంగా 500 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ మెంబర్ మందాడపు శ్రీనివాసరావు, సిహెచ్ శైలజ, సుజాత, రఘునాథ్, మహేష్ కుమార్ గౌడ్, ఆల్ ఇండియా లాయర్ యూనియన్ కోశాధికారి ఈ వేణుగోపాల్. న్యాయవాదు అమీర్, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజ మార్గం



**తుంగతుర్తి, జూన్ 20 (జనం సాక్షి) :** రాజీ మార్గమే రాజ మార్గమని, ఒక కేసులో రాజీ పడటం వల్ల ఇరువర్గాలు ఆ కేసులో గెలిచినట్లే అని తుంగతుర్తి ఇంచార్జ్ జూనియర్ సివిల్ జడ్జి మంచాల మమత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో పాల్గొని మాట్లాడారు. పెండింగ్ కేసులు, ట్రాఫిక్ చలానాలు, చిన్న చిన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సమస్యలు పరిష్కరించుకొని స్నేహంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞాన సుందర్, జనరల్ సెక్రెటరీ టి వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రెటరీ మల్లెపాక రవికుమార్, కోశాధికారి బి సతీష్, గేమ్ సెక్రెటరీ బి ప్రతాప్, కార్యవర్గ సభ్యులు వేణు రాజ్, ఓర్సు రాజు, న్యాయవాదులు తాళ్ల పెల్లి సత్యనారాయణ, సీఐలు, న్యాయవాదులు సిబ్బంది పాల్గొన్నారు.

## అధికార యంత్రాంగంతో ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం



**దేవరకొండ, జూన్ 20 (జనం సాక్షి) :** దేవరకొండ మండలంలోని సభావట్ తండా మరియు ధర్మతండా గ్రామాల్లో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అధికార యంత్రాంగంతో కలిసి శనివారం మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్యుత్, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను ప్రజల నుంచి తెలుసుకుని సంబంధిత అధికారులతో అక్కడికక్కడే సమీక్ష నిర్వహించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన "మంచినీటి బోరును ఎమ్మెల్యే ప్రారంభించారు." గ్రామ ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇదే గ్రామపంచాయతీ ధర్మ తండాలో ఎల్ఈడి లైట్లు ప్రారంభి, అధికారులు ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని చెట్లను నాటారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, మండల పార్టీ నాయకులు, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రగతి సింగిడి



**మిర్యాలగూడ, జూన్ 20 (జనంసాక్షి) :** గ్రామాల సమగ్రఅభివృద్ధి,సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రగతి సింగిడి–జనంతో మాట పల్లెబాట కార్యక్రమం రూపొందిచ్చినట్లు ఎమ్మెలే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ప్రగతి సింగిడి జనంతో మాట.. పల్లె బాటలో భాగంగా శుక్రవారం రాత్రి అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యం గ్రామంలో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రజలతో సమావేశమై గ్రామంలో ఉన్న సమస్యలను, గ్రామ ప్రజల అవసరాలు, అభివృద్ధి అంశాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ గ్రామంలోనే పల్లె నిద్ర చేశారు. ఉదయం గ్రామంలో వివిధ శాఖ అధికారులతో కలిసి వీదుల్లో తిరుగుతూ గ్రామ ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకొని తక్షణమే వాటిని పరిష్కరించేందుకు అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో లో నిర్మాణం పూర్తయిన16 ఇందిరమ్మ ఇండ్లను గృహ యాజమానులతో కలిసి ప్రారంభించి గృహప్రవేశాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం లోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చెయ్యాలనే లక్ష్యం తో ప్రజల వద్దకే పాలనను తీసుకు వచ్చి ప్రజాసమస్యలు పరిష్కరించడమే మా లక్ష్యం అని, గ్రామాల్లో ప్రతి పేదవాడు ఆత్మ గౌరవం తో తలెత్తు కునేలా ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి తీరుతామ్మన్నారు. గ్రామాలను పూరి గుడిసె లేని గ్రామాలుగా తీర్చి దిద్దడమే సంకల్పం గా పనిచేస్తామన్నారు . ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్,సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామప్రజలు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల పక్షాన నిరంతర పోరాటమే ధ్యేయం

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 20 (జనం సాక్షి) :** రైతుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 17వ లోక్‌సభలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా రైతుల సమస్యలను పార్లమెంట్ వేదికగా ఎన్నోసార్లు ప్రస్తావించి, వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేశానని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రైతాంగాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపేలా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశామని ఆయన గుర్తు చేశారు. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులు, విస్తృత స్థాయిలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా వ్యవసాయాన్ని లాభసాటి రంగంగా మార్చిన ఘనత నాటి కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలియజేశారు. కేంద్రం నిర్దేశించిన కోటాకు పరిమితం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలని కోరారు. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అవసరమైతే రైతు సంఘాలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ మరో ఉద్యమానికి సిద్ధంగా ఉంటుందని, రైతు సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, అన్నదాతకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేసారు.

# కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేసే వరకు విశ్రమించొద్దు

**● ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి**

**సూర్యాపేట, జూన్ 20 (జనంసాక్షి) :** తెలంగాణలో మళ్లీ కేసీఆర్‌ను సీఎం చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు విశ్రమించవద్దని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సదాశివరెడ్డి ఫంక్షన్ హాలులో సమగ్ర ఓటర్ సవరణ, పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన అవగాహన సదస్సులో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియ చాలా ముఖ్యమైందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. క్యాబినెట్ మీటింగ్ పెట్టి మరీ వడ్లు కొనమని చెప్పిన ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీదని అన్నారు. సూర్యాపేటకు కాంగ్రెస్ నాయకులు మూసి మురికి నీరు అందించారని, మిషన్ భగీరథ పథకంతో తాము స్వచ్ఛమైన నీళు అందించామని గుర్తు చేశారు. రైతును రాజును చేసింది మాజీ సీఎం కేసీఆర్ అని అన్నారు. చినుకు పడగానే నాగలి భుజాన వేసుకొని ధీమాగా వ్యవసాయం చేసేలా కేసీఆర్ చేశారని కొనియాడారు. ఆనాడు వడ్లు కొనమని కేంద్రం చెప్తే ఢిల్లీకి పోయి ధర్నా చేసిన నాయకుడు కేసీఆర్ అని, కేంద్రం కొనకపోతే తామే ధాన్యం మొత్తాన్ని కొన్నామని తెలిపారు. సన్నాలకు బోనస్ అని చెప్పి మోసం చేశారని, కేంద్రాన్ని సాకుగా చూపి ఇక్కడ ధాన్యం కొనమని చెబుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో అలజడులు మొదలయ్యాయని ఆరోపించారు. యూరియా ఇవ్వలేని ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. మోసపోయామని రాష్ట్రంలో ప్రతి ఒక్క వర్గం బాధపడుతుందని, అందరినీ ఏమార్చి మోసం చేసి మాయ చేశారని విమర్శించారు. ఆనాడు కడుపు కట్టుకొని అభివృద్ధి చేసి చూపామని, పారదర్శకంగా పాలన చేశామని అన్నారు. పాలన అంటే ఇలా ఉండాలని చేసి కేసీఆర్ శభాష్ అనిపించుకున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులు పెంచామని తెలిపారు. నేటి ప్రభుత్వంలో దోచుకొని దాచుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు, నాయకులు ఒంటెద్దు నరసింహారెడ్డి, రామచంద్రనాయక్, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, గోపగాని వెంకటనారాయణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా..

**● మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



**కనగల్లు, జూన్ 20 (జనం సాక్షి) :** గ్రామాలలోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ సమగ్ర అభివృద్ధి దేయంగా పనిచేస్తానని రాష్ట్ర రోడ్లు భవనములు, సినిమాటోగ్రఫీల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ ప్రజలను ఉద్దేశించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి బొడ్రాయి పటిష్టంగా ఉంటే నే ప్రజలు ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని గుర్తు చేశారు. గ్రామ దేవతలు గ్రామానికి రక్షణగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఆపదలు రాకుండా ఎల్లవేళలా కాపాడతాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు నాకు ఓటు వేసి ఆశీర్వదిస్తే నా బాధ్యతగా గ్రామానికి 20 లక్షల సిసి రోడ్లు, రామచంద్రపురం నుండి కొప్పోలుకువెళ్లే రోడ్డు మార్గమధ్యంలో కోటి రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం, రామచంద్రాపురం నుండి కొయ్య గూరోని బావి వరకు బిటి రోడ్డు నిర్మాణం, కురంపల్లి నుండి రామచంద్రాపురం వరకు రెండు వరుసల బీటీ రోడ్డు నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలను మంజూరి ఇచ్చినట్లు ప్రజలకు తెలిపారు. అలాగే రామచంద్రాపురం, లింగాలగూడెం, పాపట్ల బావి గ్రామాలకు కలిపి ప్రత్యేక సబ్ స్టేషన్ ఏర్పాటుచేసి ఈ గ్రామాలలో 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగేలా చూస్తానని వీటికి త్వరలో పనులను కూడా ప్రారంభ మించనున్నట్లు మంత్రి తెలిపారు. బొడ్రాయికి తన వంతు సహాయంగా 1 లక్ష 50 వేల రూపాయలను ఇచ్చినట్లు , గ్రామంలో రామాలయ నిర్మాణానికి సహకరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో మనోవేదన చెంది తొందరపాటు ఆత్మహత్య నిర్ణయాలు తీసుకోవద్దని ధైర్యంతో ముందుకు సాగాలని పేద ప్రజలకు ఏ ఆపద కష్టాలు వచ్చినా నాయకుల ద్వారా తన దృష్టికి తెస్తే వాటిని పరిష్కరిస్తానని భరోసనిచ్చారు. మంత్రి గ్రామానికి చేరుకోగానే డ పు చప్పులతో ర్యాలీగా మంత్రిని బొడ్రాయి వద్దకు తోడుకొని వెళ్లారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అందుగుల సువర్ణ వెంకటేశం, డిఆర్డిఓ ఎర్రబెల్లి శేఖర్ రెడ్డి ఆర్డిఓ వై అశోక్ రెడ్డి, తహసిల్దార్ పద్మ, ఎంపీడీవో వేద రక్షిత, ఎం ఆర్ ఐ సునీత, ఆర్టిఏ జిల్లా సభ్యుడు కే రాజిరెడ్డి, కు రంపల్లి , బోయినపల్లి, ధర్వేశిపురం, అమ్మ గూడెం సర్పంచులు ఓర్సు పెంటయ్య, వంపు నాగమణి జానయ్య, రాయల శేఖర్, కొండా రవళి అంజయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ఎక్స్ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, ప్రభుత్వా న్యాయవాది నాంపల్లి నరసింహ, సిఐ రాము, ఎస్సై రాజీవ్ రెడ్డి మాజీ సర్పంచ్ మెరుగు శివయ్య, పరసనబోయిన రాజీవ్, బల్గూరి పద్మ బల్గూరి శేఖర్, నాంపల్లి భాగ్య, అందుగుల బిక్షపతి, ఆయత రాజు జానీ, వివిధ శాఖల అధికారులు ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో కంట్రోల్ రూమ్ సేవలు

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 20 (జనం సాక్షి) :** జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కలెక్టరేట్ లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి సి. హెచ్. రాంమూర్తి శనివారం తెలిపారు. జిల్లా కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో నిరంతరాయంగా పని చేస్తుందని అన్నారు. భారీ వర్షాలు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు, తదితర అత్యవసర పరిస్థితుల సమాచారాన్ని ప్రజలు వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1077 లేదా మొబైల్ నంబర్ 9063211298 కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని తెలిపారు. అలాగే వ్యవసాయానికి సంబంధించి జిల్లాలో నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలు, ఇతరాలపై కూడా ప్రజలు కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ప్రతి కాల్, ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత శాఖలకు వెంటనే సమాచారం అందజేసి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయాల్లో కంట్రోల్ రూమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సి. హెచ్. రాంమూర్తి కోరారు.






# లాభాలకు 'ఐటీ' బ్రేక్

**ఎఫ్ఐఐ కొనుగోళ్లు.. రూ.4859.07 కోట్లు**


**డీఐఐ విక్రయాలు.. రూ.1159.64 కోట్లు**



**న్యూఢిల్లీ:** ఐటీ షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురుకావడంతో దేశీ య సూచీలు నష్టాలతో ముగిశాయి. బహుళజాతి ఐటీ సంస్థ యాక్సెంచర్, భవిష్యత్తు ఆదాయ అంచనాల్లో కోత విధించడం ఇందుకు కారణమైంది. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం ఖరారుకు సంబంధించిన చర్చలు వాయిదా పడటం వల్లా మదుపర్ల సెంటిమెంటు దెబ్బతింది. ఫలితంగా అయిదు రోజుల వరుస లాభాలకు అడ్డుకట్ట పడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 7 పైసలు పెరిగి 94.33 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.66% పెరిగి 80.38 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్ మినహా మిగతావి నష్టాల్లో ముగియగా.. ఐరోపా మార్కెట్లు మిశ్రమ ధోరణిలో ఆరంభమయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.7000 కోట్లు తగ్గి రూ.477.53 లక్షల కోట్ల (5.05 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. ఆద్యంతం నష్టాల్లోనే: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 76,852.86 పాయింట్ల వద్ద నష్టాల్లో (క్రితం ముగింపు 77,409.98) ఆరంభమైంది. అదే ఒరవడి కొనసాగిస్తూ ఒక దశలో 76,469.72 పాయింట్లకు దిగివచ్చింది. చివరకు 607.08 పాయింట్ల నష్టంతో 76,802.90 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 154.90 పాయింట్లు కోల్పోయి 24,013.10 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,047.20 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని; 23,901.90 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని ఈ సూచీ నమోదు చేసింది. సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 12 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్ ఎక్కువగా నష్టపోగా.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.32%, మహీంద్రా అండ్ మహీంద్రా 2.11%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.39%, హిందుస్థాన్ యునిలీవర్ 1.02%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.01% తగ్గాయి. ఎటర్నల్ 2.21%, భారతీ ఎయిర్‌టెల్ 1.8%, పవర్‌గ్రిడ్ 1.32%, ఎన్‌టీపీసీ 1.04%, టైటన్ 0.84%, ఐటీసీ 0.79%, ట్రెంట్ 0.77% పెరిగాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో ఐటీ, చమురు- గ్యాస్, ఇంధనం, స్థిరాస్తి, పీఎస్‌యూ బ్యాంక్ డీలాపడగా.. టెలికాం, విద్యుత్, ఇండస్ట్రియల్స్, ఆరోగ్యో సంరక్షణ, యుటిలిటీస్ రాణించాయి. పూర్తి సంవత్సరానికి ఆదాయ అంచనాలను యాక్సెంచర్ తగ్గించడంతో, దేశీయంగా ఐటీ కంపెనీల షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ఇన్ఫోసిస్ 6.69%, ఎల్‌టీఎం 4.12%, టీసీఎస్ 3.53%, హెచ్‌సీఎల్ 2.74%, టెక్ మహీంద్రా 2.47%, విప్రో 1.2% నష్టపోయాయి. ఈ సంస్థలన్నీ కలిసి రూ.77,597.46 కోట్ల మార్కెట్ విలువను కోల్పోయాయి. ఏజీఎం నేపథ్యంలో, ఈ వారంలో 6% పెరిగిన రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరుకు శుక్రవారం లాభాల స్వీకరణ ఎదురైంది. బీఎస్ఈలో ఈనెల 11న షేరు ధర రూ.1253. ఇది 52 వారాల కనిష్ఠస్థాయి కాగా, గురువారం రూ.1328 వద్ద ముగిసింది. శుక్రవారం ఈ షేరు 1.39% తగ్గి రూ.1,309.35 వద్ద ముగిసింది.

**5 కంపెనీల ఐపీఓలకు సెబీ ఆమోదం**

ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్, ఏజీఎస్ హెల్త్, పీజీపీ గ్లాస్, శ్రేణి షేర్స్, ఎస్ఆర్ఐటీ ఇండియా ఐపీఓ దరఖాస్తులకు సెబీ ఆమోదం లభించింది. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపేణా జరగనుంది. 20.37 కోట్ల వరకు షేర్లను ప్రస్తుత ప్రమోటర్లయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అముంది హోల్డింగ్ విక్రయించనున్నాయి. ఏజీఎస్ హెల్త్, పీజీపీ గ్లాస్ ఐపీఓ ముసాయిదా పత్రాలను సెబీకి రహస్య పద్ధతిలో సమర్పించాయి. శ్రేణి షేర్స్ ఇష్యూలో 60 లక్షల వరకు తాజా షేర్లను, ఓఎఫ్ఎస్ ద్వారా 82 లక్షల షేర్లను విక్రయిస్తారు. ఎస్ఆర్ఐటీ ఇండియా ఐపీఓ పూర్తిగా తాజా షేర్ల రూపేణా ఉండనుంది. 1.68 కోట్ల తాజా షేర్లను జారీ చేయనున్నారు.



## ఇన్‌స్టా పోస్టులో ఇకపై మల్టీపుల్ క్యాప్షన్స్

ఇన్‌స్టాగ్రామ్ ఎప్పటికప్పుడు కొత్త అప్‌డేట్‌లను ప్రవేశపెడుతోంది. యూజర్లు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న మరో సరికొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. ఇంతకుముందు ఇన్‌స్టాలోని ఒక పోస్టులో ఎన్ని ఫొటోలు, వీడియోలు ఉన్నా వాటికి ఒకే క్యాప్షన్ మాత్రమే పెట్టుకోవచ్చు. దీంతో పోస్టులోని ప్రతి స్లైడ్‌ని వివరించలేకపోతున్నామని యూజర్లకు నిరాశ ఎదురయ్యేది. దీనికి చెక్ పెట్టేందుకే ఇన్‌స్టా మల్టీపుల్ క్యాప్షన్ ఫీచర్‌ను తీసుకొచ్చింది. దీంతో పోస్టులోని ప్రతి స్లైడ్‌కి నచ్చిన క్యాప్షన్ జోడించొచ్చు. యూజర్లు పోస్టును పక్కకు స్వైప్ చేస్తున్నప్పుడు స్లైడ్‌కి తగ్గట్టుగా క్యాప్షన్ చూపిస్తుంది. ప్రొడక్ట్ ప్రమోషన్స్, ఫుడ్ రివ్యూవర్లు, ట్రావెల్ వ్లాగర్స్‌కు ఈ ఫీచర్ గేమ్ ఛేంజర్‌గా మారనుంది. తాము చెప్పాలనుకున్న విషయాన్ని క్యాప్షన్లతో మరింత సులువుగా క్రియేటర్లు వివరించొచ్చు. ఈ ఫీచర్‌ను భారత్‌లో రోల్‌అవుట్ చేసినట్లు కంపెనీ అధిపతి ఆడమ్ మోస్సేరి ఓ పోస్టులో పేర్కొన్నారు. ఇది దశల వారీగా యూజర్లందరికీ అందుబాటులోకి రానుంది.

## ఇన్‌యాక్టివ్ వాలెట్‌లకే ఫోన్‌పే 'ఛార్జీలు'..

**న్యూఢిల్లీ:** వాలెట్ ఇన్‌యాక్టివ్ ఛార్జీలపై యూజర్ల నుంచి ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఫోన్‌పే స్పందించింది. ప్రీపెయిడ్ వాలెట్‌లకే ఈ ఛార్జీలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. లింకు అయిన బ్యాంక్ ఖాతా, యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ప్రభావం చూపబోదని స్పష్టం చేసింది. రెగ్యులర్ లావాదేవీలు కొనసాగించొచ్చని సూచించింది. 'ఏడాది పాటు ఎలాంటి డిజిటల్ చెల్లింపులు చేయని ఫోన్‌పే వాలెట్‌లపై మాత్రమే ఛార్జీలు వసూలు చేస్తా'మని యూజర్లకు ఫోన్‌పే సందేశాలు పంపిస్తోంది. వీటిని ఇన్‌యాక్టివ్ వాలెట్‌గా పరిగణించి నిర్వహణ ఛార్జీల పేరిట 3 నెలలకు రూ.100 చొప్పున వసూలు చేస్తామని అందులో పేర్కొంది. అయితే, వాలెట్‌లో సరిపడనంత బ్యాలెన్స్ లేకుంటే ఛార్జీలను బ్యాంకు ఖాతా నుంచి వసూలు చేస్తుందా? యూపీఐ లావాదేవీల్లో కట్ చేస్తుందా? అని యూజర్ల నుంచి ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలోనే ఫోన్‌పే స్పందించింది. యూజర్లందరికీ ఇన్‌యాక్టివ్ అలర్ట్‌లు వస్తున్నా.. కేవలం ప్రీపెయిడ్ వాలెట్‌లకే ఇది వర్తిస్తుందని పేర్కొంది. బ్యాంకు ఖాతా, యూపీఐ లావాదేవీలు, క్యాష్‌బ్యాక్ రివార్డులపై ఎలాంటి ప్రభావం చూపబోదని పేర్కొంది. వాలెట్‌లో సరిపడనంత బ్యాలెన్స్ లేకపోయిన నెగటీవ్ ఛార్జీలు ఉండబోవని స్పష్టం చేసింది. వాలెట్ యాక్టివ్ చేయడానికి కేవైసీని పూర్తిగా అప్‌డేట్ చేయాల్సిన అవసరం లేదని.. ఓటీపీ వెరిఫికేషన్, వాలెట్ ట్రాన్సాక్షన్ చేస్తే సరిపోతుందని పేర్కొంది. ఇన్‌యాక్టివ్ ఛార్జీలను వాలెట్ కార్యకలాపాలకు వినియోగిస్తామని ఫోన్‌పే వెల్లడించింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,45,800 (22 క్యారెట్లు) | ₹ 1,59,060 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,95,000

## ఎక్స్ఛేంజీల ద్వారా మళ్లీ షేర్ల బైబ్యాక్ ఆగస్టు 1 నుంచి

**సెబీ బోర్డు ఆమోదం**

ముంబయి: మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ బోర్డు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా ఓపెన్ మార్కెట్ బైబ్యాక్ పద్ధతిని గతంలో నిలిపి వేయగా, అందులో కొన్ని మార్పులతో ఆగస్టు 1 నుంచి పునరుద్ధరించనున్నట్లు సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. దీంతో పాటు మ్యూచువల్ ఫండ్‌లకు ఇంట్రాడే బారోయింగ్ (రుణాలు) నిబంధనలను సడలించడం, ఇన్వెస్టర్ మరణిస్తే, సెక్యూరిటీల బదిలీ ప్రక్రియను సరళీకరించడం వంటి కీలక నిర్ణయాలను బోర్డు ఆమోదించింది. గతంలో షేర్లబైబ్యాక్‌కు 6 నెలల సమయం ఉండేది. ఇకపై ఆఫర్ ప్రారంభమైన రోజు నుంచి 66 పనిదినాల్లోపే పూర్తి చేయాలి. బైబ్యాక్ కాలపరమితిలోని మొదటి సగభాగంలోనే, కేటాయించిన నిధుల్లో కనీసం 40 శాతాన్ని కంపెనీ తప్పనిసరిగా వాడాలి. గతంలో కంపెనీలపై పడే పన్ను భారాన్ని ఇకపై వాటాదార్లపైకి (మూలధన లాభాల రూపంలో) మార్చారు. దీని వల్ల ఓపెన్ మార్కెట్‌లో షేర్లు అమ్మినా లేదా బైబ్యాక్‌లో టెండర్ చేసినా పన్ను ఒకేలా ఉంటుంది. ఈ సమాచారాన్ని ఇమెయిల్/ఎస్ఎంఎస్ ద్వారా కూడా మదుపర్లకు తెలియజేయాలి. మార్కెట్ ఔట్‌ఫ్లో, రావాల్సిన నిధుల మధ్య ఉండే సమయ వ్యత్యాసాన్ని అధిగమించడానికి మ్యూచువల్ ఫండ్స్ ఇంట్రాడే బారోయింగ్ లైన్‌లు వాడుకోవడానికి సెబీ అనుమతించింది. కేవలం రిడెంప్షన్ పేఔట్‌ల కోసమే కాకుండా, అసెస్ క్లాస్‌ల మధ్య పే-ఇన్/పే-ఔట్ సెటిల్‌మెంట్ టైమింగ్స్, ఫారెక్స్ సెటిల్‌మెంట్లు, డెరివేటివ్స్ పొజిషన్ల మార్క్ టూ మార్కెట్ (ఎంటీఎం) మార్జిన్ చెల్లింపుల కోసం కూడా ఫండ్ హౌస్‌లు ఇంట్రాడే రుణాలు తీసుకోవచ్చు. ఏఐఎఫ్‌లు వేంగా నిధుల సమీకరణ చేపట్టడానికి గరుడ విధానాన్ని సెబీ ప్రవేశపెట్టింది. వారసులకు ఖాతా బదిలీ ప్రక్రియ సులభతరం ఇన్వెస్టర్లు మరణిస్తే, వారి ఖాతా ల్లోని సెక్యూరిటీలను నామినీలు, చట్టబద్ధమైన వారసులకు బదిలీ చేసే ప్రక్రియను సెబీ సులభతరం చేసింది. చిన్న మొత్తాల క్లెయిమ్‌లను వేగంగా సెటిల్ చేయడం కోసం క్యూటీపీ విభాగాన్ని సెబీ ప్రవేశపెట్టింది. రూ.10000 లోపు భౌతిక సెక్యూరిటీల క్లెయిమ్‌లకు; రూ.30,000 లోపు ఉన్న డీమ్యాట్ సెక్యూరిటీల క్లెయిమ్‌లకు ఈ విధానం అందుబాటులో ఉంటుంది. తక్కువ డాక్యుమెంట్‌లతో సులభంగా షేర్లను బదిలీ చేసుకునే పరిమితులను సెబీ సవరించింది. ఒక నమోదిత కంపెనీకి గతంలో రూ.5 లక్షలుగా ఉన్న పరిమితిని రూ.10 లక్షలకు పెంచారు. ఒక బెనిఫిషియల్ ఓనర్ ఖాతాకు గతంలో ఉన్న రూ.15 లక్షల పరిమితిని రూ.30 లక్షలు చేశారు. వారసులకు ఇబ్బం దులను తగ్గించడానికి, బదిలీ సమయంలో మళ్లీ పాన్‌కార్డ్ ఇవ్వాలనే నిబంధనను తొలగించారు. కోర్టు నుంచి విల్ ప్రొబేట్ పొందాలనే నిబంధననూ సెబీ మినహాయించింది. విడివిడిగా అఫిడవిట్‌లు, ఎన్‌ఓసీలు ఇచ్చే పద్ధతికి స్వస్తి పలికి, రెండూ కలిపి ఒకే అఫిడవిట్ కమ్ ఎన్‌ఓసీ సమర్పించడానికి అనుమతి ఇచ్చారు. ఒరిజినల్ లేదా అటెస్టెడ్ కాపీలతో పాటు, క్యూఆర్ కోడ్ ఉన్న మరణ ధ్రువీకరణ పత్రాల కాపీలను కూడా డిజిటల్ వెరిఫికేషన్ కోసం అంగీకరిస్తారు. విదేశాల్లో జారీ చేసిన మరణ ధ్రువీ కరణ పత్రాల కోసం, భారతీయ బ్యాంకుల విదేశీ శాఖలు లేదా వాటితో అనుబంధం ఉన్న అంతర్జాతీయ బ్యాంకుల ద్వారా సులభంగా వెరిఫికేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించారు.

# సాటిలేని జియో!

- రూ.37,700 కోట్ల సమీకరణకు సన్నద్ధం
- కొత్త ఇంధన రంగంలో 2 లక్షల ఉద్యోగాలు
- ఫుడ్ పార్క్‌లపై రూ.30,000 కోట్ల పెట్టుబడి
- శాటిలైట్ ఇంటర్నెట్ సేవల వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయం
- రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ




**న్యూఢిల్లీ:** రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) తదుపరి వృద్ధికి ఏఐ (కృత్రిమమేధ), శాటిలైట్ ఇంటర్నెట్, స్వచ్ఛ ఇంధనం, రిటెయిల్ వ్యాపారాలను ఆలంబనగా చేసుకుంటామని సంస్థ సీఎండీ ముకేశ్ అంబానీ ప్రకటించారు. సంస్థ డిజిటల్ విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ ద్వారా దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆర్ఐఎల్ 49వ ఏజీఎంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. దేశ ఇంజినీరింగ్ నిపుణులు భారత్‌కు ప్రత్యేకమైన ఏఐ (కృత్రిమ మేధ)ని నిర్మించాలని ముకేశ్ అంబానీ సూచించారు. 'ఎక్కడో నిర్మించిన ఏఐకి వినియోగదారుగా భారత్ ఉండకూడదు. ఏఐలో అంతర్జాతీయ దిగ్గజంగా భారత్ ఎదగాలి' అని అన్నారు. గతేడాది ప్రారంభించిన రిలయన్స్ ఇంటెలిజెన్స్.. లాభదాయక ఏఐ మౌలికవసతులు, ప్లాట్‌ఫాం, సర్వీసెస్‌లను వినియోగదార్లు, కంపెనీలు, ప్రభుత్వాలకు భారీ స్థాయిలో అందించే లక్ష్యంతో ఉందని వివరించారు. అందుకే గూగుల్, మెటా, ఎన్‌విడియాలతో భాగస్వామ్యాలు కుదుర్చుకున్నామని తెలిపారు. 'ప్రతి ఒక్కరికీ, ప్రతి చోటా బ్రాడ్‌బ్యాండ్ అందిస్తామని పదేళ్ల కిందట ఇచ్చిన హామీని జియో నెరవేర్చింది. ఇపుడు ప్రతి ఒక్కరికీ, ప్రతిచోటా ఏఐ అందిస్తామని రిలయన్స్ ఇంటెలిజెన్స్ వాగ్దానం చేస్తోంద'న్నారు. ప్రపంచం అందిపుచ్చుకునే వినూత్నతను మన యువ ఇంజినీర్లు వాళ్లు సృష్టించేందుకు సహకరిస్తామని చెప్పారు. 'ప్రతి భారతీయ భాషలో శక్తిమంత, విశ్వసనీయ, అందుబాటు ధరలో లభించే ఏఐ నిర్మించాలి. రైతులు, విద్యార్థులు, డాక్టర్లు, పచారీ కొట్టు యజమానులు, కార్మికులు, కుటుంబాలకు ఏఐ సాధికారతనివ్వాలి. మన సవాళ్లకు పరిష్కారం మనమే కనుగొనాల'ని పేర్కొన్నారు.

**సొంత శాటిలైట్ వ్యవస్థ ఏర్పాటు చేస్తాం: ఆకాశ్ అంబానీ**

ఐపీఓకు వస్తున్న జియో, దేశీయ కమ్యూనికేషన్స్ శాటిలైట్లను ఏర్పాటు చేస్తుందని జియో ప్లాట్‌ఫామ్స్ ఎండీ ఆకాశ్ అంబానీ తెలిపారు. శాట్‌కామ్ సేవలు అందించడానికి జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్‌కు లైసెన్సు ఉందన్నారు. 'మారుమూల ప్రాంతాల్లో డేటా సేవలు అందించేందుకు దేశీయ లో ఎర్త్ ఆర్బిట్ (ఎల్ఈఓ) శాటిలైట్ సమూహాన్ని అభివృద్ధి చేయాలని జియో భావిస్తోంది. దీర్ఘకాల సార్వభౌమ సామర్థ్యాన్ని సొంతంగా నిర్మించుకుంటాం. ఆలోగా శాటిలైట్ సామర్థ్యాన్ని లీజుకు తీసుకునేందుకు అంతర్జాతీయ భాగస్వామితో జట్టుకడతాం' అని ఆకాశ్ వివరించారు. మనదేశంలోనే సొంతంగా గ్రౌండ్ స్టేషన్ ఏర్పాటు చేయాలనీ జియో భావిస్తోందన్నారు. తదుపరి అతిపెద్ద డిజిటల్ అడుగుకు పునాదిగా 'జియోట్రూ5జీ'ని మారుస్తామనీ ఆయన తెలిపారు. 1650 ఉపగ్రహాలను ప్రయోగించడానికి ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ అథరైజేషన్ సెంటర్(ఇన్-స్పేస్)కు ప్రణాళికలను ఈ కంపెనీ అందజేసినట్లు సమాచారం. ప్రస్తుతం శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ విభాగంలో విదేశీ కంపెనీలైన స్టార్‌లింక్, యూటెల్‌శాట్ ఆధిపత్యం వహిస్తున్న సంగతి విదితమే. జియోహాట్‌స్టార్ 100 కోట్ల డౌన్‌లోడ్‌లు: 'ఆర్ఐఎల్ మీడియా-వినోద వ్యాపారం 2025-26లో రూ.34,917 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. దేశంలోనే అతిపెద్ద డిజిటల్ ప్లాట్‌ఫాంగా జియోహాట్‌స్టార్ నిలిచింది. 100 కోట్ల డౌన్‌లోడ్‌లను అధిగమించిన తొలి భారతీయ పెయిడ్ ఓటీటీ సేవగా నిలిచింద'ని ఆకాశ్ తెలిపారు. నెలవారీగా 45.1 కోట్ల సగటు వినియోగదార్లు ఈ ఓటీటీ ప్లాట్‌ఫారానికున్నారని వివరించారు.

**ఆకాశ్ నోట.. ధురంధర్ మాట:** జియో స్టూడియోస్ నిర్మించిన ధురంధర్ ఫ్రాంఛైజీ ప్రపంచవ్యాప్త బాక్సాఫీజ్ వసూళ్లలో రూ.3,000 కోట్లను అధిగమించిందని ఆకాశ్ అంబానీ పేర్కొన్నారు. టీవీ ద్వారా నెలవారీగా 25 కోట్ల మందికి, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో 45 కోట్ల మందికి నెట్‌వర్క్18 చేరువయిందన్నారు.

**ఫుడ్ పార్క్‌లపై రూ.30,000 కోట్ల పెట్టుబడి:ఈశా అంబానీ**

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎఫ్ఎంసీజీ విభాగం రిలయన్స్ కన్జ్యూమర్ ప్రోడక్ట్స్(ఆర్‌సీపీఎల్) నాలుగేళ్లలో రూ.లక్ష కోట్ల ఆదాయాన్ని అందుకోగలదని రిలయన్స్ రిటెయిల్ డైరెక్టర్ ఈశా అంబానీ తెలిపారు. భారత చరిత్రలోనే ఆర్‌సీపీఎల్ వేగవంత ఎఫ్ఎంసీజీ ప్లాట్‌ఫాంగా నిలిచింద'ని ఆర్ఐఎల్ ఏజీఎమ్‌లో ఈశా తెలిపారు. ఏటా రెండింతల వృద్ధి సాధిస్తూ, స్థూల ఆదాయం రూ.22,000 కోట్లకు చేరిందని వివరించారు. ఇప్పటికే ఆర్‌సీపీఎల్ రూ.10,000 కోట్ల పెట్టుబడులు పెట్టిందని, వచ్చే మూడేళ్లలో ఆసియాలోనే అతిపెద్ద ఏఐ ఆధారిత, రోబోలతో నడిచే సమీకృత ఫుడ్ పార్క్‌లను ఏర్పాటు చేయడం కోసం అదనంగా రూ.30,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని ఈశా తెలిపారు.

**స్వచ్ఛ ఇంధన వ్యాపారంలో 2 లక్షల ఉద్యోగాలు**

**- అనంత్ అంబానీ**

అంతర్జాతీయ స్వచ్ఛ ఇంధన పరివర్తనలో భారత ఆధిపత్యం పెరుగుతోందని రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) అనంత్ అంబానీ పేర్కొన్నారు. కంపెనీ కొత్తగా ఏర్పాటు చేస్తున్న హరిత ఇంధన వ్యాపారాలు 2 లక్షలకు పైగా ఉద్యోగాలను అందజేస్తాయని కంపెనీ ఏజీఎమ్‌లో వివరించారు. పశ్చిమాసియా చమురుపై ఇప్పటివరకు ప్రపంచం ఆధారపడింది. ఇపుడు భారత గడ్డపై కొత్త ఇంధన వ్యవస్థను నిర్మించబోతున్నట్లు అనంత్ ప్రకటించారు. '2026-27 నుంచి కొత్త ఇంధన వ్యాపారాలు రిలయన్స్‌కు అర్థవంత వాటా అందించనున్నాయి. సోలార్ మాడ్యూళ్ల వాణిజ్య ఆదాయాలు, బ్యాటరీ ఫ్యాక్టరీ మొదలవుతాయి. శాంసంగ్ సీ అండ్ టీ ఒప్పందం అమలవుతుంద'ని స్పష్టం చేశారు. అనంత్ ప్రకారం కచ్ రెన్యూవబుల్ ఎనర్జీ హబ్: ఏటా 4000 కోట్ల యూనిట్ల హరిత విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. భారత వార్షిక విద్యుత్ అవసరాల్లో 3 శాతాన్ని తీరుస్తుంది. రోజువారీ లక్ష్యం: రోజుకు 150 మెగావాట్‌అవర్ బ్యాటరీ కంటెయినర్లు, 55 మెగావాట్ల సోలార్ మాడ్యూళ్ల ఇన్‌స్టలేషన్‌ను లక్ష్యంగా పెట్టుకుంది. భారీ స్థాయి బీఈఎస్ఎస్: బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్) ముందస్తు కమిషనింగ్‌లోకి అడుగుపెట్టింది. 40 గిగావాట్‌అవర్ తయారీ సామర్థ్యంతో ప్రారంభించి, 100 గిగావాట్‌అవర్‌కు విస్తరిస్తుంది. సివిల్ నిర్మాణాలు పూర్తవ్వగా, సామగ్రి ఇన్‌స్టలేషన్ పనులు జరుగుతున్నాయి.

**జియో విలువ రూ.12.8 లక్షల కోట్లు**

దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూకు జియో రంగం సిద్ధం చేసింది. ఇప్పటిదాకా హ్యుందాయ్ మోటార్ ఇండియా రూ.27,870 కోట్లతో అతిపెద్ద ఐపీఓగా ఉండగా, ఎన్ఎస్ఈ దాదాపు రూ.30,000 కోట్ల(3.3 బి. డాలర్ల)తో ఐపీఓకు వస్తోంది. వీటిని మించి జియో 4 బిలియన్ డాలర్లు (రూ.37,700 కోట్లు) సమీకరించనుంది. ఇందుకు కంపెనీ విలువను 137 బి. డాలర్లు (రూ.12.8 లక్షల కోట్లు)గా లెక్కించారు. సెబీ వద్ద కంపెనీ దాఖలు చేసిన ముసాయిదా పత్రాల (డీఆర్‌హెచ్‌పీ) ప్రకారం.. రూ.10 ముఖ విలువ కలిగిన 27 కోట్ల కొత్త షేర్లను జియో జారీ చేయనుంది. ఇది పోస్ట్-ఇష్యూ ఈక్విటీ క్యాపిటల్‌లో 2.9 శాతానికి సమానం. పరిమాణం, సామర్థ్యం, విలువ పరంగా అంతర్జాతీయ సాంకేతిక కంపెనీలను భారత్ నిర్మించగలదని ఈ ఇష్యూతో ప్రపంచానికి నిరూపితమవుతుందని ఆర్ఐఎల్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. ఇష్యూ ధరను బుక్ బిల్డింగ్ ప్రక్రియ ద్వారా నిర్ణయిస్తాయి. ఐపీఓ ప్రక్రియను తన పిల్లలైన ఆకాశ్, ఈశా, అనంత్ అంబానీ చూసుకుంటారని ముకేశ్ అన్నారు. 2025-26లో జియో ప్లాట్‌ఫామ్స్ రూ.1.47 లక్షల కోట్ల ఆదాయాన్ని రూ.30,000 కోట్ల నికర లాభాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే.

**వారసత్వ ప్రణాళిక పూర్తికావచ్చింది**

రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో రోజువారీ బాధ్యతలను, తన వారసులకు అందించే ప్రక్రియ దాదాపుగా పూర్తికావచ్చిందని ముకేశ్ అంబానీ (69) తెలిపారు. గ్రూప్‌లోని ప్రధాన వ్యాపార విభాగాలకు తన సంతానమైన ఆకాశ్, ఇషా, అనంత్ నేతృత్వం వహిస్తున్నారని గుర్తు చేశారు.

## దేశ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓ..

### పునర్వినియోగంతోనే మౌలిక ప్రాజెక్టుల

# ఖర్చు తగ్గుతుంది

## అమ్మాన్ ఇండియా ఎండీ ధీరజ్ పాండా



హైదరాబాద్: మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ముడి సరకుల వ్యయం భారీగా పెరుగుతున్న నేపథ్యంలో, పర్యావరణహిత, పునర్వినియోగ విధానాలపై దృష్టి సారించాలని అమ్మాన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ధీరజ్ పాండా అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. రాబోయే దశాబ్దంలో భారతీయ రోడ్ల నిర్మాణంలో ప్రధాన సమస్య.. సహజ వనరులను కాపాడటమేనని పేర్కొన్నారు. వాడిన తారును తిరిగి వినియోగించే అత్యాధునిక సాంకేతికత ద్వారా రోడ్లను పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో తమ సంస్థకు చెందిన 300లకు పైగా అస్ఫాల్ట్ ప్లాంట్లు ఉన్నాయని తెలిపారు. ఇందులో 25 ప్లాంట్లకు రీసైక్లింగ్ విధానాన్ని విజయవంతంగా అమలు చేసినట్లు తెలిపారు. రవాణా మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెడుతున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో, అమ్మాన్ ఇండియాకు బలమైన ఉనికి ఉందన్నారు. గుజరాత్‌లో 37 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్లాంటు నెలకు 1500-1600 టన్నుల స్టీల్‌ను ఫ్యాబ్రికేట్ చేయగల సామర్థ్యంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఎగుమతుల్లో స్వల్ప మందగమనం ఉందని, సంస్థ మొత్తం ఆదాయంలో ఎగుమతుల వాటా 25 శాతమని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 15-17% వృద్ధిని లక్ష్యంగా చేసుకున్నట్లు వివరించారు.

## మూసీ పునరుద్ధరణకు భాజపా వ్యతిరేకం కాదు

హైదరాబాద్(జనంసాక్షి):
మూసీ పునరుద్ధరణకు భాజపా వ్యతిరేకం కాదని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. బాధితులకు న్యాయం చేశాక, ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణశాఖ అనుమతి ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రము ఖ పారిశ్రామికవేత్త ఫణికుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సింగరేణి స్కామ్ బయటపడుతుందనే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. వర్గపోరు కారణంగానే ప్రాంతీయ పార్టీలు చీలిపోతున్నాయని వ్యాఖ్యానించారు. "రాష్ట్రవ్యాప్తంగా కొన్ని స్కూళ్లలోనే పుస్తకాలు, యూనిఫాంలు ఇచ్చారు. కనీస మౌలిక సదుపాయాలు లేని బడులు లెక్కలేనన్ని ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల దుస్థితి ఎలా ఉందో రేవంత్‌రెడ్డి చూడాలి. ప్రైవేటు పాఠశాలలు ఎందుకు పెరుగుతున్నాయి? కేంద్రీయ విద్యాలయాలకు ఉన్న ఆదరణ ప్రభుత్వ బడులకు ఎందుకు లేదు? బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి. ఉస్మానియా వర్సిటీకి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామన్నారు. కానీ.. వర్సిటీల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. టీచర్లు, ప్రొఫెసర్లు హక్కుల గురించి మాట్లాడితే సస్పెండ్ చేస్తున్నారు" అని ఆరోపించారు.

## పీఎం కిసాన్ నిధులు విడుదల

చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరింది. కేంద్రప్రభుత్వం 2019లో పీఎం-కిసాన్ పథకాన్ని ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్ధిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్ధిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇ-కేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. కాబట్టి అదే పోర్టల్‌లో ఇ-కేవైసీ ఆప్షన్ ఎంచుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.



# శరీరం-మనస్సు ఏకత్వం యోగా

- ఆరోగ్య సంరక్షణలో యోగా కీలకం
- ఉద్యోగుల ఆరోగ్యం కోసం యోగాభ్యాసం
- ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా సింగరేణి కార్యక్రమం
- ఒత్తిడి నివారణకు యోగా అవసరం




**రామగుండం, జూన్ 20 (జనంసాక్షి):** శరీరాన్ని, మనస్సును ఏకం చేసేదే యోగా అని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల ఆధ్వర్యంలో జీఎం కార్యాలయంలో యోగాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం జీఎం కార్యాలయంలోని వివిధ విభాగాధిపతులు, అధికారులు, ఉద్యోగులతో యోగా శిక్షకుడు బొంకూరి మోహన్ యోగాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎంలు మాట్లాడుతూ యోగా అనేది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా, ఒత్తిడిని నివారిస్తుందని అన్నారు. ప్రపంచ మానవాళి ఆరోగ్యం కోసం భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృషితో ఐక్యరాజ్య సమితిలో ఆమోదింపబడి 21 జూన్ రోజు ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం యోగా దినోత్సవం జరుపుకుంటున్నారన్నారు. ప్రపంచ దేశాలు యోగా విశిష్టతను గురించి అవగాహన కల్పిస్తూ, యోగాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఉద్యోగులందరూ యోగా చేస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు సంతోష్, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షులు కోల శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ ఎ.ఉదయ భాస్కర్, ఎస్వోటుజీఎం బండి సత్యనారాయణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, వివిధ విభాగాధిపతులు, అధికారులు, ఉద్యోగులు, పొరుగు సేవల సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యం కాదు.. హిట్లర్ రాజ్యం

- రైతుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు
- సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఫైర్




**ఆర్మూర్,జూన్ 20 (జనంసాక్షి):** తెలంగాణ రైతుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి హిట్లర్‌గా వ్యవహరిస్తున్నారని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి విమర్శించారు. ఆర్మూర్ పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో శనివారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాహుల్ గాంధీ జన్మదిన వేడుకగా,రాష్ట్రానికి ముఖ్యమంత్రి హోదాలో ఉండి రైతుల వరి ధాన్యం కొనుగోలు చేయమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వమే రైతుల నుండి వరి ధాన్యం కొనుగోలు కొనుగోలు చేయడం కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.వరి ధాన్యం,మొక్కజొన్న, జొన్నలు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయని యెడల మంత్రులు, ఎమ్మెల్యేలు,కాంగ్రెస్ నాయకుల ఇండ్ల ముందు కుమ్మరిస్తామని హెచ్చరించారు. ఎకరానికి రెండు యూరియా బస్తాలు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం కొత్త సర్క్యులర్ తీసుకువచ్చిందని, వాటిని కూడా విడతల వారీగా ఇస్తామని చెప్పడం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు.రైతుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేసేందుకు సంసిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పి ఛైర్మన్ దాదన్నగారి విఠల్ రావు,పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్,మాజీ జడ్పిటిసి సంతోష్,పట్టణ కౌన్సిలర్లు,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే వారి అనుచరుడి కబ్జాల పర్వం..**

ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తన సొంత గ్రామంలో నిర్మితమవుతున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు చేరువలో పది ఎకరాల అసైన్మెంట్ ల్యాండ్ ను కబ్జా చేసినట్లు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆరోపించారు.ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు కస్తూరిబా పాఠశాల ఆవరణలో ఉన్న క్రీడా స్థలం సుమారు ఎకరం పైగా కబ్జా చేసినట్లు పేర్కొన్నారు.దేశం,ధర్మం కోసం అంటూ అంటూ మాట్లాడే ఎమ్మెల్యే వారి ప్రధాన అనుచరుడు రూ.20 కోట్ల స్థలం కబ్జా చేసి కస్తూరిబా పాఠశాలకే నోటీసులు పంపించారని చెప్పారు.ఈ విషయమై అసెంబ్లీలో మాట్లాడేలా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో విన్నవిస్తానని చెప్పారు.తమ బిఆర్ఎస్ కౌన్సిలర్లను వారి వారి వార్డులలోని అభివృద్ధి పనులలో భాగస్వామ్యం చేయకుండా అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహం చేస్తే రెండువేల మందితో మున్సిపాలిటీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

# ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాల్లో 7 మంది అరెస్ట్

- నకిలీ బ్యాంకు ఖాతాలు తెరిచి మనీలాండరింగ్
- సైబర్ క్రైమ్ పోలీసుల చాకచక్యం.. ప్రజలు, బ్యాంకులకు హెచ్చరికలు



**శేరిలింగంపల్లి, జూన్ 20 (జనంసాక్షి):** ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాలకు సంబంధించి సైబర్ క్రైమ్‌కు పాల్పడుతున్న ఏడుగురు నిందితులను సైబర్ క్రైమ్ పోలీస్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సైబర్ క్రైమ్ డీసీపీ శనివారం ప్రత్యేక మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. సైబర్ క్రైమ్ విభాగానికి సంబంధించి 1053/2026 నంబర్‌తో నమోదైన ఆన్‌లైన్ ట్రేడింగ్ కేసులో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కేసును చేదించడంతోపాటు ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకోవడం జరిగింది. సైబర్ మోసాల ద్వారా వచ్చిన అక్రమ నగదును తరలించేందుకు ఉపయోగించే మ్యూల్ బ్యాంకు ఖాతాలను తెరవడం, నిర్వహించడం మరియు వాటిని నిందితులకు అందించడంలో పాల్పడిన ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు.

అరెస్టు అయిన వారిలో ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం పెందుర్తి ప్రాంతానికి చెందిన రాపర్తి గౌతమ్ (28), ఇదే ప్రాంతానికి చెందిన సేనాపతి పెంటయ్య (56), ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన బోడాల సాయికుమార్ (28), ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లాకు చెందిన మురపాకల కుమార్ (30), అనకాపల్లి జిల్లాకు చెందిన విజ్జిపు సత్యనారాయణమూర్తి (44), విశాఖపట్నం గాజువాక డిపో ప్రాంతానికి చెందిన మంత్రి సాయికుమార్ (24), శేరిలింగంపల్లి రాయదుర్గం ప్రాంతానికి చెందిన ఓట్ల సత్యనారాయణ (27) ఉన్నారు. సైబర్ పోలీస్ అధికారులు నిర్వహించిన దర్యాప్తులో అరెస్టు అయిన నిందితులంతా బ్యాంకు ఖాతాలు ఏర్పాటు చేయడం, ఖాతాదారులను సమకూర్చడం, మోసపూరిత నగదును సేకరించడం, నగదును రవాణా చేయడం వంటి వ్యవస్థీకృత సైబర్ నేరాలకు పాల్పడుతూ ముఠాగా ఏర్పడి మనీలాండరింగ్ కార్యకలాపాలను సులభతరం చేశారని అధికారులు అభివర్ణించారు. సైబర్ క్రైమ్ డీసీపీ టి. సాయికుమార్ ప్రజలకు పలు సూచనలు చేశారు. డబ్బు కోసం తమ బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డులు, సిమ్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలు లేదా కెవైసి పత్రాలను ఇతరులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదన్నారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్ తదితర సంస్థల పేరుతో వచ్చే అనుమానాస్పద డెలివరీ లేదా ఆర్డర్ లింకులను క్లిక్ చేయకూడదని, అధికారిక యాప్‌లు లేదా వెబ్‌సైట్ల ద్వారా మాత్రమే వాటిని ధృవీకరించుకోవాలని సూచించారు. ధృవీకరించండి. ఒటీపీలు, సీవీవీ నంబర్లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌లు, యూపీఐ పిన్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులకు చెప్పకూడదని కోరారు. సెబీలో నమోదైన బ్రోకర్లు మరియు ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారానే పెట్టుబడులు పెట్టాలని, అధిక లాభాలు వస్తాయని చెప్పే అనధికారిక యాప్‌లు, వెబ్‌సైట్లు, సోషల్ మీడియా గ్రూపులను నమ్మవద్దన్నారు. ఇతరుల కోసం బ్యాంకు ఖాతాలు తెరవడం లేదా తమ ఖాతాలను ఉపయోగించుకునేందుకు అనుమతించడం చట్టపరమైన చర్యలకు దారితీస్తుందని, సైబర్ మోసాలపై ఫిర్యాదు చేయడానికి వెంటనే 1930కు కాల్ చేయాలని లేదా ఒుఒు.ఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.అఅలో ఫిర్యాదు నమోదు చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు.

బ్యాంకు అధికారులకు పలు హెచ్చరికలు జారీ చేస్తూ మ్యూల్ ఖాతాలను తెరవడంలో మోసగాళ్లతో కుమ్మక్కైన లేదా నిర్లక్ష్యంగా వ్యవహరించిన బ్యాంకు సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. ఖాతాల ప్రారంభంలో కెవైసి నిబంధనలను ఖచ్చితంగా పాటించి, ఖాతాదారుల వివరాలను పూర్తిగా ధృవీకరించాలని, అనుమానాస్పద లావాదేవీలను నిరంతరం పర్యవేక్షించి, అవసరమైన సందర్భాల్లో సస్పీషస్ ట్రాన్సాక్షన్ రిపోర్టులను సమర్పించాలని, అసాధారణ లావాదేవీలు నిర్వహిస్తున్న ఖాతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు.

# నిజాలు రాస్తే 'నకిలీ జర్నలిస్టుల' ముద్ర వేస్తారా?

- పాత్రికేయులపై సోషల్ మీడియా దుష్ప్రచారం ఆందోళనకరం
- అసత్య ప్రచారకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- డీఎస్పీకి జర్నలిస్టు సంఘాల వినతి




**నల్లగొండ, జూన్ 20 (జనం సాక్షి):** ప్రజా సమస్యలు, అవినీతి, అక్రమాలపై నిర్భయంగా వార్తలు రాస్తున్న అసలు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను వెలుగులోకి తీసుకువస్తున్న విలేకరులను కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా నకిలీ జర్నలిస్టులుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల విశ్వసనీయతను దెబ్బతీసేలా సామాజిక మాధ్యమాల్లో అసత్య సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

**మీడియా స్వేచ్ఛకు విఘాతం**

జనంసాక్షి దినపత్రిక నల్లగొండ బ్యూరో ప్రతినిధి ఓడపల్లి మధుపై కూడా కొందరు నిరాధార ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం నిర్వహిస్తున్నారని సంఘాల నాయకులు తెలిపారు. ఇటువంటి చర్యలు పాత్రికేయుల మనోధైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా మీడియా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తాయని అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని ఎంతటి వారైనా ఉపేక్షించబోమని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని, వార్తా కథనాల వల్ల అసౌకర్యానికి గురయ్యే కొందరు వ్యక్తులు వ్యక్తిత్వ హననానికి దిగడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారం చేస్తున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరారు. జర్నలిస్టుల భద్రత, మీడియా స్వేచ్ఛ పరిరక్షణకు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శివరాం రెడ్డి హామీ ఇచ్చినట్లు సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివరాం రెడ్డి, వన్‌టౌన్ సీఐ ఎమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్టులు గుండగోని జయశంకర్, గాదె రమేష్, మల్లికార్జున్ యాదవ్, యాదగిరి, సలీం, అల్లి మల్లికార్జున్, దండంపల్లి రవి, వెంకట మధు, కుషాల్, శంకర్, హరి, సుధాకర్, ఎండి కలీమ్ ఖాన్, నవీన్, సైదులు, శివ, సూర్య, సాగర్ తదితరులు హాజరయ్యారు.

# కోట్లు కొల్లగొడుతున్న మోసగాళ్లు

## మాయమాటలతో ముసుగేసి.. ముల్లెమూటలెత్తేస్తున్న చిట్టీ వ్యాపారులు



- అనుమతులు లేకుండా విచ్చలవిడిగా బ్రాంచీలు
- పల్లెప్రజల బతుకులు నాశనం
- ప్రభుత్వం చూస్తూ చూడనట్టు

**కోహిర్, జూన్ 20 (జనంసాక్షి):**

*రోజు కూలినాలి చేసి వచ్చిన డబ్బుల్లో భవిష్యత్తు కోసం రూపాయి రూపాయి పోగుచేసుకుని కూడబెట్టుకున్న సామాన్య ప్రజల డబ్బులపై రాబందుల కన్ను పడటంతో వాటిని కాజేసేందుకు మాయమాటలతో వర్జి చెప్పి అమాయకుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు చిట్టీ వ్యాపారులు.*

రోజురోజుకు కొత్త కొత్త ఎత్తుగడలతో తన సన్నిహితుల ద్వారా అమాయకులను లోబడుచుకుని బురిడికొట్టించి కోట్లల్లో ఎగనమం బెట్టి ముల్లెమూటలు ఎత్తేస్తున్న వైనం టీవీలు, పత్రికల్లో రోజూ వింటూనే ఉన్నాం. దేశంలో కొందరు కేటుగాళ్లు అమాయక ప్రజలను మోసం చేస్తూ అలవోకగా డబ్బులు సంపాదించే మార్గాన్ని ఎంచుకుని బురిడి కొట్టించడానికి రాటుదేలుతున్నారు. ఈ వ్యాపారంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుండటంతో ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే గల్లి గల్లిలో విస్తరాకుల్లా బ్రాంచీలు పుట్టుకొస్తున్నాయి.

కేటుగాళ్లతో పాటు రికొన్ని మోసపూరిత సంస్థలు అమాయకులను టార్గెట్ చేస్తూ కోట్లాది రూపాయలు కొల్లగొడుతూ పబ్బం గడుపుతున్నారు. ఇంకొందరు మోసగాళ్లు కొత్త కొత్త స్కీముల పేరుతో ఫోన్ల ద్వారా మెసేజ్‌లు పంపించి అవి గొనుండి ఇవి నొక్కండంటూ హైటెక్ మోసాలతో ఆన్‌లైన్ మోసాలు చేస్తూ ప్రజలను నిలువునా దోపిడీకి పాల్పడుతున్నారు. ఇటువంటి మోసగాళ్లను పసిగట్టలేని పేద, మధ్యతరగతి ప్రజలు వారి మాయమాటలకు, ప్రలోభాలకు లొంగి బతుకులు నాశనం చేసుకుంటున్నారు.

పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడుతుందనే అతి రోజు కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టుకున్న అమాయక ప్రజల వద్దకు ఘరానా మోసగాళ్లు వంతగడ్డల వాటివారు చెప్పే తీయటి మాయమాటలను నమ్మించి డబ్బులను ఊడాయిస్తున్న వైనం రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

పెద్ద పెద్ద చిట్టీ వ్యాపారుల భాగోతం దేశంలో కుదుపు కుడిపేసిన విషయం తెలిసిందే. అగ్రిగోల్డ్, సహారా, శారదా చిట్‌ఫండ్ కంపెనీలు వందలమంది ఖాతాదారులను మోసగించిన విషయం విధితమే. ఈ వ్యాపారుల మోసాలకు కొన్ని కుటుంబాలు బలైన సంగతి తెలిసిందే. అదేవిధంగా కోహిర్ మండల కేంద్రంలో పల్లెలో కూడా ఇటువంటి మోసగాళ్ల బెడద ఎక్కువగానే ఉంది. జహీరాబాద్ నియోజకవర్గంలో అసెంబ్లీ సెగ్మెంట్‌లలో అనుమతులు లేకుండానే పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన చిట్టీల వ్యాపారంతో పాటు ఆన్‌లైన్ వ్యాపారం అంటూ విచ్చలవిడిగా మండల కేంద్రంలో జోరుగా కొనసాగుతుంది. వీటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే మార్కెట్లో వివిధ బ్రాంచీల పేరుతో వాడవాడలో విస్తరాకుల విస్తరింపు చేసి ప్రజలను మోసం చేస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు.

పైసా పైసా కూడబెట్టిన డబ్బులతో బురిడీ కొట్టించి వ్యాపారులు ఊడాయించడంతో బాధితులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి వారిలో నెలకొంది. ఇలా ప్రతి ఏడాది వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కేటుగాళ్లు మాయలో ప్రజలు మోసపోతూనే ఉన్నారు. మోసం చేస్తున్న సంస్థలు, వ్యక్తుల నుంచి డబ్బులు నాపన్ ఇప్పించాలంటూ లేదా అరెస్టులు చేయాలంటూ పోలీసుల వద్ద లబో దిబోమంటూ విన్నవించినా లాభం లేకుండా పోతుందని బాధితులను పట్టించుకునే వారే కరవయ్యారనే వార్తలు వినిపిస్తున్నాయి.

ఇప్పటికైనా అధికారులు వీరి ఆగడాలను ఆటకట్టించరపోతే చిట్టీల వ్యాపారులు ఇంకా చెలరేగిపోతారని అధికారికంగా నిర్వహిస్తున్న చిట్టీల వ్యాపారులపై చర్యలు చేపట్టాలని ప్రజలు వాపోతున్నారు.

## ఎన్‌ఎండీసీ ఉచిత వైద్య శిబిరాలతో

# గిరిజనులకు ఆరోగ్య భరోసా

- పది గ్రామ పంచాయతీల్లో ఆరోగ్య పరీక్షలు, మందుల పంపిణీ
- వందలాది మందికి ఉచిత వైద్యం.. మారుమూల గ్రామాలకు చేరువైన ఆరోగ్య సేవలు




**హైదరాబాద్, జూన్ 20 (జనం సాక్షి);** దేశంలోని ప్రముఖ మైనింగ్ సంస్థ ఎన్‌ఎండీసీ (ఎన్‌ఎండీసీ) తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కార్యక్రమాల ద్వారా గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత ఆరోగ్య సేవలను అందిస్తోంది. కమ్యూనిటీ హెల్త్ అవేర్‌నెస్ అండ్ హెల్త్‌కేర్ యాక్సెస్ కార్యక్రమం కింద దంతేవాడ ప్రాంతంలోని పది గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన వైద్య శిబిరాలు వందలాది మంది గ్రామస్థులకు ఉపయోగపడ్డాయి.

మే 19 నుంచి భాన్సీ, బడే బచేలి, ధుర్లి, పధాపూర్, నేర్లి, దుగేలి, గంజేనార్, మసేనార్, మోల్సనార్, కమలూర్ గ్రామ పంచాయతీల్లో శిబిరాలు నిర్వహించారు. లబ్ధిదారుల్లో అత్యధికులు గిరిజన వర్గాలకు చెందినవారే. జూన్ 19న కమలూర్‌లో నిర్వహించిన శిబిరంలో 96 మంది ఉచిత వైద్య సేవలు పొందారు. ఈ శిబిరాల్లో నిపుణులైన వైద్యులు సాధారణ ఆరోగ్య పరీక్షలు, బీపీ, రక్తంలో చక్కెర పరీక్షలు నిర్వహించడంతో పాటు ఆరోగ్య సలహాలు అందిస్తున్నారు. అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేస్తూ, మెరుగైన చికిత్స కోసం సమీప ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. మారుమూల గ్రామాలకు ఆరోగ్య సేవలను చేరవేయడంలో ఎన్‌ఎండీసీ కీలక పాత్ర పోషిస్తోందని గ్రామస్థులు ప్రశంసించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సదుపాయాల బలోపేతానికి జగదల్‌పూర్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వహణకు కూడా ఎన్‌ఎండీసీ ఆర్థిక సహాయం అందించడం విశేషం. ఎన్‌ఎండీసీ ప్రతి గ్రామానికి ఉచిత ఆరోగ్య సంరక్షణను అందిస్తోంది, వందలాది మంది గ్రామస్థులు ఉచిత చికిత్స పొందుతున్నారు. సమల్వార్, భాన్సీ, బడే బచేలి, ధుర్లి, పధాపూర్ మరియు నేర్లితో సహా 10 గ్రామ పంచాయతీలలో నిర్వహించిన వైద్య శిబిరాలు గిరిజన వర్గాలకు ప్రయోజనం చేకూర్చాయి.

# రాంరెడ్డిపల్లిలో భూమి బాట వివాదం

- కర్రలతో పరస్పర దాడులు.. ఇరువర్గాలపై కేసులు నమోదు
- ముగ్గురికి తీవ్ర గాయాలు.. పోలీసుల అప్రమత్తం



**మర్రిగూడ, జూన్ 20 (జనంసాక్షి):** మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామంలో వ్యవసాయ భూమికి వెళ్లే బాట విషయంలో రెండు కుటుంబాల మధ్య నెలకొన్న వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మాటామాటా పెరగడంతో ఇరువర్గాలు కర్రలు, దుడ్డుకర్రలతో పరస్పరం దాడి చేసుకోవడంతో పలువురు గాయపడిన ఘటన గ్రామంలో కలకలం రేపింది.

మర్రిగూడ ఎస్ఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం రాంరెడ్డి గ్రామానికి చెందిన బేత సోంబాబు కుటుంబ సభ్యులు, అలాగే బేత ధనలక్ష్మి కుటుంబ సభ్యుల మధ్య వ్యవసాయ భూమికి వెళ్లే దారి విషయంలో గత కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం ఇరువర్గాల మధ్య మరోసారి వాగ్వాదం చోటుచేసుకోగా, అది క్రమంగా ఘర్షణకు దారితీసినట్లు సమాచారం. ఘర్షణ సమయంలో ఇరువర్గాలు కర్రలు, దుడ్డుకర్రలతో పరస్పరం దాడి చేసుకున్నట్లు తెలిసింది. ఈ దాడుల్లో ఇరువర్గాలకు చెందిన పలువురికి తల, చేతులు, శరీరంపై గాయాలు కాగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. గాయపడిన వారిలో కొందరికి వైద్యులు కుట్లు వేసి చికిత్స అందించినట్లు తెలిసింది. చికిత్స అనంతరం బాధితులు పోలీసులను ఆశ్రయించి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. ఫిర్యాదుల మేరకు పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నామని, దర్యాప్తు అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా, గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. భూవివాదాలు, కుటుంబ తగాదాలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని మర్రిగూడ ఎస్ఐ రాంబాబు ప్రజలకు సూచించారు.

*పెద్దపల్లి : విద్య ప్రమాణాల పెంపులో పెద్దపల్లి జిల్లా అగ్రగామిగా నిలిచినందుకుగాను శుక్రవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గవర్నర్, ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు శాలువాతో సత్కరించారు.*

# ప్రభుత్వ ధాన్యం మళ్లింపు- లక్షల రూపాయల దుర్వినియోగం

## బ్యాంకు పాస్ బుక్కులు, నగదు స్వాధీనం

- ఆరుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ మహేష్ బి,గీతే



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూన్ 20 (జనం సాక్షి);** నకిలీ ట్రక్ చిట్టీలు సృష్టించి ప్రభుత్వ ధాన్యాన్ని మళ్లించి 91 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులదుర్వినియోగం జరిగినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బిగితే తెలిపారు.శనివారం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు.జిల్లాలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నకిలీ ట్రక్ చిట్లు సృష్టించి, సుమారు 91 లక్షల ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన కేసులో ఆరుగురు నిందితులను సిరిసిల్ల టౌన్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...సిరిసిల్ల పట్టణ పరిధిలోని పెద్దూర్ అపరెల్ పార్క్ గోదాంలో మేనేజర్‌గా పనిచేస్తున్న కరీంనగర్ కి చెందిన ఉత్కం విజయ్ (ఏ1), అతనితో పనిచేస్తున్న వేములవాడ రూరల్ అచ్చనపల్లి గ్రామానికి చెందిన వాసాల గణేష్ (ఏ5) కలిసి ఐకేపీ కేంద్రాల నుంచి ధాన్యం వచ్చినట్లు నకిలీ ట్రక్ షీట్లు తయారు చేశారని పేర్కొన్నారు.ఈ మోసంలో భాగంగా రుద్రంగి ఐకేపీ కేంద్రం ఇన్‌చార్జ్ గద్దం స్వామి (ఏ3) రెండు లారీలకు నకిలీ ట్రక్ చీటీలు జారీ చేయగా,వాటిని ఉత్కం విజయ్ సివిల్ సప్లై వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన అనంతరం నిధులను నిందితులు పంచుకున్నారని తెలిపారు.అదేవిధంగా, డీఎంఓ కార్యాలయంలో మండల స్థాయి కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న కమ్మరి రాజశేఖర్ (ఏ2), బద్దెనపల్లి పీఏసీఎస్ కేంద్రం ఇన్‌చార్జ్ గాజుల నవీన్ (ఏ6)తో కలిసి ఒక లారీ ధాన్యానికి నకిలీ ట్రక్ చీటీ రూపొందించి ఉత్కం విజయ్‌కు అందించారు. అతను దానిని సివిల్ సప్లై వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయగా,రాజశేఖర్ ఆమోదం తెలిపాడు.విడుదలైన నిధులను ముగ్గురు పంచుకున్నారని,ఇంకా వివిధ ఐకేపీ కేంద్రాల నుంచి అపారెల్ పార్క్ గోదాంకు వచ్చిన 10 లారీల ధాన్యాన్ని గోదాంలో దించకుండా, ఆన్‌లైన్‌లో మాత్రం దించినట్లు నమోదు చేశారు.అనంతరం ఆ ధాన్యాన్ని వేములవాడకు చెందిన చెపూరి మధుకర్ (ఏ4)కు అప్పగించగా, అతను సిద్దిపేటకు చెందిన కమిషన్ ఏజెంట్ చిటుకుల శ్రీకాంత్ (ఏ7) ద్వారా వివిధ రైస్ మిల్లులకు విక్రయించి వచ్చిన మొత్తాన్ని పరస్పరం పంచుకున్నారు. ఈ మోసాలను గుర్తించిన జిల్లా సివిల్ సప్లై మేనేజర్ ఎస్. నరసింహ సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయగా కేసు నమోదు చేసి డిఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి,దర్యాప్తు చేపట్టగా దర్యాప్తులో భాగంగా సుమారు రూ.91 లక్షల ప్రభుత్వ నిధులను అక్రమంగా మళ్లించినట్లు విచారణలో తేలిందన్నారు.నిందుతులైన నిందితులు ఏ1 ఉత్కం విజయ్, ఏ2 కమ్మరి రాజశేఖర్, ఏ4 చెపూరి మధుకర్, ఏ5 వాసాల గణేష్, ఏ6 గాజుల నవీన్‌లను శనివారం అరెస్ట్ చేసి నిందితుల వద్ద నుంచి మొబైల్ ఫోన్లు, సంబంధిత పత్రాలు,రూ.14,16,800 నగదు స్వాధీనం చేసుకోగా, రూ.46,21,358 మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేసి రిమాండ్ కి తరలించడం జరిగిందని వివరించారు.ఉత్కం విజయ్ వద్ద నుంచి రూ.2,85,400 నగదు స్వాధీనం, ఖాతాలోని రూ.37,65,358 ఫ్రీజ్. 2.వాసాల గణేష్ వద్ద నుంచి రూ.9,81,400 నగదు స్వాధీనం, అతని ఖాతాలో రూ.4,68,555 , అతని భార్య వాసాల సునీత ఖాతాలో రూ.8,67,711 ఫ్రీజ్. కమ్మరి రాజశేఖర్ వద్ద నుంచి రూ.1,50,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ప్రభుత్వ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నకిలీ పత్రాలు సృష్టించి, ధాన్యాన్ని అక్రమంగా విక్రయిస్తూ ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన ఈ కేసులో మరింత దర్యాప్తు కొనసాగుతోందని ఎస్పీ పేర్కొన్నారు.

# మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిద్దాం

- డ్రగ్స్ రహిత కరీంనగర్ లక్ష్యంగా సమష్టి కృషి
- యువతను మత్తు బారిన పడకుండా కాపాడాలి
- నషా ముక్త్ భారత్ అభియాన్‌కు విస్తృత అవగాహన
- జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



**కరీంనగర్ బ్యూరో, జూన్ 20 (జనంసాక్షి):** మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నార్కోటిక్ కోఆర్డినేషన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణ సమాజంలోని ప్రతి ఒక్కరి సమిష్టి బాధ్యత అని పేర్కొన్నారు. యువతను మత్తు బారిన పడకుండా కాపాడేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. డ్రగ్స్ రహిత జిల్లాగా కరీంనగర్‌ను తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కల్పించడం ద్వారా యువతను సరైన మార్గంలో నడిపించవచ్చని పేర్కొన్నారు. అమె, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు.
పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ఈ నెల 26న నిర్వహించే అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యాసంస్థల్లో విద్యార్థులకు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలకు, గ్రామ సభల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నామని, అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (డీసీపీఓ) పర్వీన్ మాట్లాడుతూ "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. అనంతరం "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు షర్మిల, జల కుమారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, నార్కోటిక్స్ ఇన్‌స్పెక్టర్ రఫిక్ ఖాన్, పోలీస్, ఎక్సైజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ ఆర్టీసీ రీజియన్ పనితీరుపై సమీక్ష

**డిపో మేనేజర్లకు దిశానిర్దేశం చేసిన రీజనల్ మేనేజర్ బి. రాజు**



**కరీంనగర్ టౌన్, జూన్ 20 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కరీంనగర్ రీజియన్ పరిధిలోని డిపోల పనితీరు, ఆర్థిక పరిస్థితి, ప్రయాణికుల సేవల మెరుగుదలపై రీజనల్ మేనేజర్ బి. రాజు శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బస్ స్టేషన్, కరీంనగర్ ఆవరణలోని సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో రీజియన్ పరిధిలోని అన్ని డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.సమావేశంలో మే నెలాఖరు వరకు ఆపరేషన్స్, మెకానికల్ విభాగాల పనితీరు, డిపోల ఆర్థిక స్థితిగతులు, బస్ ఆన్ కాంట్రాక్ట్ సేవలు, యాత్రాదాన్ కార్యక్రమాలకు ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఆదాయ వనరులను పెంపొందించేందుకు అవసరమైన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు.వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని బస్సులకు అవసరమైన మరమ్మతులు, సాంకేతిక తనిఖీలు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే కిలోమీటరుకు లభించే ఇంధన సామర్థ్యాన్ని పెంచేందుకు అనుసరించాల్సిన విధానాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలపై ప్రత్యేకంగా చర్చించారు.
అంతకుముందు ఇటీవల పదోన్నతులపై గోదావరిఖని, జగిత్యాల, మెట్పల్లి డిపోలకు డిపో మేనేజర్లుగా నియమితులైన శ్రీమతి సి. హెచ్. కవిత, శ్రీ ఎన్. రమేశ్, శ్రీ డి.హరిలను రీజనల్ మేనేజర్ బి. రాజు శాలువాలతో సత్కరించి అభినందించారు. కొత్త బాధ్యతల్లో సమర్థవంతంగా పనిచేసి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్లు ఎస్. భూపతిరెడ్డి, పి.మల్లేశం, డిపో మేనేజర్లు ఎన్.వెంకన్న (హుస్నాబాద్), వి. రవీంద్రనాథ్ (హుజురాబాద్), ఐ. విజయమాధురి (కరీం నగర్-1), వి. శ్రవణ్ కుమార్ (మంథని), ఎన్. మనోహర్ (కోరుట్ల), ఎ. ప్రకాశరావు (సిరిసిల్ల), బి. శ్రీనివాస్ (వేములవాడ), అకౌంట్స్ ఆఫీసర్ పి. రవికుమార్, పర్సనల్ ఆఫీసర్ ఎం. సంపత్ కుమార్, కరీంనగర్-2 డిపో ట్రాఫిక్ సూపర్వైజర్ పి. విజయలక్ష్మి, రీజనల్ మేనేజర్ కార్యాలయ సూపర్వైజర్లు ఎం. స్రవంతి, ఆర్. జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు. ప్రయాణి కుల భద్రత, సేవల నాణ్యత, ఆదాయ వృద్ధి లక్ష్యంగా ప్రతి డిపో సమన్వయంతో పనిచేయాలని రీజనల్ మేనేజర్ బి. రాజు సమావేశంలో సూచించారు.

# రైతు పండించిన ప్రతి గింజను కొనాలి

- కేంద్ర, రాష్ట్ర విధానాలు రైతులను నష్టపరుస్తున్నాయి
- కొనుగోలు కేంద్రాల తగ్గింపుపై బీఆర్ఎస్ ఆగ్రహం
- రైతు భరోసా, భీమా పథకాలు అమలు చేయాలి
- రైతులను దళారుల చేతుల్లోకి నెట్టొద్దు

**గంగాధర మండలం, జూన్ 20 (జనంసాక్షి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, రాష్ట్రంలోని అన్నదాతల పరిస్థితి ఆగమాగం అయిందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శనివారం మధురానగర్ ఎక్స్ రోడ్డు చౌరస్తాలో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు వ్యతిరేక విధానాలపై నిరసనలు చేపడుతున్నామని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని అన్ని పంటలకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఇటీవల కేంద్రం కేటాయించిన కోటా మేరకే పంటలను కొనుగోలు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేసిందన్నారు. ఎన్నికలకు ముందు చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు మాట మార్చడం రైతులను మోసం చేయడమేనని అన్నారు.
కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ రైతులను దిక్కులేనివారిగా మార్చాయని విమర్శించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను మోసం చేసే ప్రభుత్వాలను ప్రజలు క్షమించరని అన్నారు. రైతులు పండించే ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని, ఎన్నికల హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మెచినేని నవీన్ రావు, నాయకులు సాగి మహిపాల్ రావు, రామిడి సురేందర్, వేముల దామోదర్, ఎండి నజీర్ హుస్సేన్, కంకణాల విజేందర్ రెడ్డి, జోగు సాగర్, బొల్లాడి శ్రీనివాస్ రెడ్డి, శ్రీమల్ల మేఘరాజ్, వడ్లూరి అదిమల్లు, మామిడి అఖిల్, దోమకొండ మల్లన్న, దూలం శంకర్ గౌడ్, గడ్డం స్వామి, నియోజకవర్గంలోని ఆరు మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రూ.67 లక్షల సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు ప్రారంభం

- కరీంనగర్ అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక ప్రాధాన్యం
- అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.840 కోట్లు మంజూరు
- స్మార్ట్ సిటీ తర్వాత మరో భారీ బహుమతి.. డీపీఆర్ రెండు నెలల్లో సిద్ధం

**కరీంనగర్ బ్యూరో, జూన్ 20 (జనంసాక్షి):** కరీంనగర్ నగరపాలక సంస్థ 50వ డివిజన్‌లో రూ.67 లక్షల వ్యయంతో పూర్తిచేసిన నూతన సీసీ డ్రైన్, సీసీ రోడ్డును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ నగర సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కరీంనగర్ నగరానికి రూ.840 కోట్ల అభివృద్ధి ప్రతిపాదనలు ఆమోదం పొందినట్లు వెల్లడించారు. గతంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ద్వారా దాదాపు రూ.1000 కోట్ల విలువైన అభివృద్ధి పనులు నగరంలో చేపట్టినప్పటికీ, మరోసారి భారీ స్థాయిలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ లభించడం కరీంనగర్ నగరానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిందన్నారు. ఈ నిధులతో నగర మౌలిక వసతుల అభివృద్ధి మరింత వేగవంతం కానుందని పేర్కొన్నారు. రూ.840 కోట్ల అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌కు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను రాబోయే రెండు నెలల్లో సిద్ధం చేసి, అభివృద్ధి పనుల అమలుకు అవసరమైన ప్రతిపాదనలను శరవేగంగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కరీంనగర్ నగర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, భారీ స్థాయిలో నిధులు సమకూరుస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కి నగర ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్లు ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## సుడా నిధులు 20 లక్షలతో యుజిడి పనులకు శంకుస్థాపన

**పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ అర్బన్, జూన్ 20 (జనంసాక్షి) :** 53వ డివిజన్ శర్మనగర్ లో సుడా నిధులు 20 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్‌లు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కలిసికట్టుగా ముందుకు సాగుతామని అంతర్గత రోడ్లు డ్రైనేజీలకు నిధులు వెచ్చించి ఎక్కడికక్కడ పనులను వేగవంతం చేయడం జరుగుతుం దని అన్నారు.ఈ కార్యక్రమంలో డిఈ రాజేంద్ర ప్రసాద్, కార్పొరేటర్ కొంపెల్లి శ్వేతా రమణ, మహమ్మద్ మేరాజ్, సమియోద్దీన్, హరికృష్ణ, అబ్దుల్ వసీం, అనిల్, రాము, శ్రీనివాస్, కలీమ్ ముల్కల కవిత, అస్థాపురం తిరుమల, జ్యోతిరెడ్డి, కీర్తి కుమార్, బషీర్, ఇమ్రాన్, వర్క్ ఇన్స్పెక్టర్ అజ్మల్ తదితరులు పాల్గొన్నారు.

## ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి ప్రతినిధి :** అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 40వ ఒలింపిక్ డే రన్‌ను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జెండా ఊపి ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభించారు. జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల, కామారెడ్డి వద్ద ప్రారంభమైన రన్ కాకతీయ నగర్‌లోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల వరకు కొనసాగింది. ఈ రన్‌లో విద్యార్థులు, క్రీడాకారులు, యువత, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల దోపిడీపై ఉక్కుపాదం

**పుస్తకాలు, యూనిఫాం పేరుతో తల్లిదండ్రుల జేబులు ఖాళీ**

- విద్యాహక్కు చట్టం ఉల్లంఘనలు
- బీసీ అజాదీ ఫెడరేషన్ తీవ్ర ఆరోపణలు
- అక్రమ వసూళ్లపై విచారణ, చర్యలు తీసుకోవాలి



**హుజూరాబాద్, జూన్ 20 (జనంసాక్షి):** హుజూరాబాద్ పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలు విద్యా సంస్థలుగా కాకుండా వ్యాపార సంస్థలుగా మారి తల్లిదండ్రులపై అనవసర ఆర్థిక భారం మోపుతున్నాయని బీసీ ఆజాదీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పంజాల రేవంత్ అన్నారు. విద్యను హక్కుగా అందించాల్సిన పాఠశాలలు విద్యార్థులు మరియు తల్లిదండ్రుల బలహీనతలను ఆసరాగా చేసుకుని అధిక లాభాల కోసం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, షూస్, బెల్టులు, టైలు మరియు ఇతర విద్యా సామగ్రిని పాఠశాలల ద్వారానే కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. కొన్ని పాఠశాలలు మార్కెట్‌లో రూ.2,000 నుండి రూ.3,000 వరకు లభించే వస్తువులను రూ.5,000 నుండి రూ.10,000 వరకు విక్రయిస్తూ తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్నాయని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇప్పటికే పెరిగిన విద్యా ఫీజులు, రవాణా ఛార్జీలు, హాస్టల్ ఖర్చులు, ఇతర జీవన వ్యయాలతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రైవేట్ పాఠశాలల ఈ విధానాలు వారిని మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయని అన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు మౌనంగా భరిస్తున్న పరిస్థితిని కొందరు యాజమాన్యాలు దుర్వినియోగం చేస్తున్నాయని విమర్శించారు.
విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం పాఠశాలలు పుస్తకాలు, యూనిఫారాలు విక్రయించడం లేదా నిర్దిష్ట దుకాణాల నుండి కొనుగోలు చేయాలని బలవంతం చేయడం సరికాదని గుర్తు చేశారు. అయినప్పటికీ అనేక పాఠశాలలు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తూ తమకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కొంతమంది తల్లిదండ్రులు బయట కొనుగోలు చేసిన యూనిఫారాలు లేదా పుస్తకాలను అంగీకరించకపోవడం కూడా జరుగుతోందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఈ వ్యవహారాలపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించాలని, మండలాల్లో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫారాలు విక్రయిస్తున్న యాజమాన్యాలపై జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే గుర్తింపు రద్దు చేసే వరకు చర్యలు తీసుకోవాలని కోరారు.
ఈ అంశంపై హుజూరాబాద్ మండల విద్యాధికారి విడాపు శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సమస్యను సీరియస్‌గా తీసుకుని తనిఖీలు నిర్వహించాలని కోరడం జరిగింది. విద్య అనేది వ్యాపారం కాదని, సమాజ నిర్మాణానికి పునాది అని పేర్కొన్న పంజాల రేవంత్, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటూ లాభాపేక్షతో వ్యవహరించే సంస్థలను ప్రభుత్వం ఉపేక్షించకూడదన్నారు. తల్లిదండ్రుల హక్కులను పరిరక్షించడం, విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడం, విద్యను అందరికీ అందుబాటులో ఉంచడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. అక్రమ వసూళ్లు, బలవంతపు కొనుగోళ్లు, విద్యాశాఖ నిబంధనల ఉల్లంఘనలపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ ఆజాదీ ఫెడరేషన్ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి, రఘువర్ధన్, శ్రీకృష్ణ, రమేష్, అక్షయ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోంది
- చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి
- రైతు భరోసా, భీమా పథకాలు సక్రమంగా అమలు చేయాలి
- రైతు వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోవాలి

**పెద్దపల్లి, జూన్ 20 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల అనుసరిస్తున్న తీరు అత్యంత దారుణమని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు భిన్నంగా వ్యవహరిస్తూ అన్నదాతలను నిలువునా మోసం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు దాసరి ఉష తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం జిల్లా కేంద్రంలోని వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దాసరి ఉష మాట్లాడుతూ రాష్ట్రంలోని వ్యవసాయ పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను తప్పుబట్టారు. ఎన్నికలకు ముందు చివరి గింజ వరకు కొంటామని, అన్ని పంటలకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు అధికారంలోకి వచ్చాక మాట మార్చిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఎంత పంటను కొంటుందో, అంతే కొంటామని చెప్పడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ఆమె విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, ఇప్పుడు కేవలం కొన్ని రకాల పంటలకు మాత్రమే పరిమితం కావడం రైతులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు యూరియా బస్తాల కోసం రైతులు చెప్పులు పెట్టి క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి నెలకొందని, తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత పంజాబ్‌ను మించే స్థాయిలో వరిని పండించిన మన రైతన్నలు, ఇప్పుడు మళ్లీ సమైక్య పాలననాటి ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆమె గుర్తు చేశారు. ఆనాడు అన్ని పంటలకు బోనస్ అని చెప్పి, ఇప్పుడు నిబంధనల పేరుతో రైతులను మోసం చేయడం ఏంటని ఆమె ప్రశ్నించారు.
రాష్ట్రంలో వ్యవసాయ విస్తీర్ణం పెరిగినప్పటికీ, దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రైతుల పొట్ట కొట్టేలా రాజకీయాలు చేయడం మానుకోవాలని, రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, చిన్నకల్వల మాజీ ఎంపీటీసీ సంపత్, ఓదెల మండల నాయకులు బీరం రవి, రాంపల్లి వార్డ్ సభ్యులు శ్రవణ్, నర్సయ్య, కనగర్తి గ్రామ వైస్ ప్రెసిడెంట్ సదయ్య, నాయకులు దోది అశోక్, మల్లేష్, మహేందర్, అబ్దుల్ మాలిక్, అవినాష్, అంజయ్య, వంశీ, శ్రీను, హరికృష్ణ, సింగసాని అనిల్, సంతోష్, చందు, సాయి చరణ్, పుల్లూరి అవినాష్, రైతు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలు పోయినా సరే భూములు ఇవ్వం



**ముత్తారం జూన్ 20 (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ధర్యాపూర్ గ్రామంలో ప్రజా ప్రయోజనాల అవసరాల కోసం గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలోని భూసేకరణ సర్వేను శనివారం అడ్డుకున్నరూ.బలవంతంగా అభివృద్ధి పేరుతో రైతులు పంటలు పండే భూములను సేకరించడం అన్యాయమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.తమ భూములలో ఎలాంటి అనుమతులు లేకుండా పోలీసు బలగాలతో సర్వే చేయడానికి వచ్చిన అధికారులను,విత్తనాలు వేసే సమయంలో భూములు సర్వే చేయెద్దని రైతులు మందు డబ్బాలతో అడ్డగించారు.గ్రామ శివారులో ప్రజా అవసరాల కోసం భూ సేకరణలో భాగంగా భూ సర్వే చేయడానికి వచ్చిన రెవిన్యూ అధికారులను ఎక్కడైతే పనులు ప్రారంభమవుతాయో అక్కడి నుండి భూసేకరణ జరిగితే బాగుంటుందని విత్తనాలు వేసే సమయంలో ఇలా భూసేకరణ సర్వే చేయడం ఏంటని అధికారులను గ్రామస్తులు నిలదీశారు. ప్రాణాలనేనా పోగొట్టుకోడనికైనా సిద్ధంగా ఉన్నామని తమ భూములు ఇవ్వమని గ్రామస్తులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రైతులు గాధం శ్రీనివాస్ మందల కిషన్ రెడ్డి, కందునూరి రాజేశం, జంగ స్వామి, తిత్తుల శ్రీనివాస్, తిరుపతి, రాపెల్లి సంతోష్, తునుకూల రాజయ్య, రాపెల్లి నరేష్, సంద రవి, గనావేన ఓదెలు, శ్రీను తోపాటు తదితరులు పాల్గొన్నారు,

# రైతు పండించిన ప్రతి గింజను కొనాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసింది
- హామీలు ఇచ్చి ఇప్పుడు రైతులను దళారుల చేతుల్లోకి నెట్టేస్తోంది
- కొనుగోలు కేంద్రాల తగ్గింపుతో రైతుల్లో భయాందోళనలు
- కేసీఆర్ హయాంలో రైతుకు భరోసా.. ఇప్పుడు రైతు రాజ్యం అంటూ రోడ్డున పడేస్తున్న కాంగ్రెస్
- రైతు ప్రయోజనాలపై కుట్రలు ఆపాలి : కోరుకంటి చందర్



**గోదావరిఖని, జూన్ 20 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నయవంచనకు గురి చేస్తోందని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆ మాటలను నిలబెట్టుకోవడంలో విఫలమైందని విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, ప్రతి ఎకరానికి సాగునీరు అందించడం, రైతు బంధు, రైతు బీమా, రైతు వేదికలు వంటి పథకాల ద్వారా రైతులకు భరోసా కల్పించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 70 లక్షల మంది రైతులకు కేసీఆర్ ప్రభుత్వం అండగా నిలిచిందని గుర్తు చేశారు.
ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల విషయంలో చేసిన ప్రకటనలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను తగ్గించడం వల్ల రైతులు దళారులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించని సమయంలో ప్రభుత్వం రైతులకు అండగా నిలవాల్సిందిపోయి చేతులెత్తేయడం బాధాకరమని అన్నారు. వ్యవసాయ రంగంలో ఎరువుల కొరత, విద్యుత్ సమస్యలు, పంటల కొనుగోళ్లలో జాప్యం వంటి అంశాలపై రైతులు ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించి రైతుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలైన రైతు భరోసా, రైతు సంక్షేమ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని కోరుకంటి చందర్ స్పష్టం చేశారు.
ఈ విలేఖరుల సమావేశంలో టీఆర్ఎస్ నాయకులు మూల విజయరెడ్డి, నడిపల్లి మురళీధర్ రావు, కార్పొరేటర్లు సమ్మయ్య యాదవ్, తోకల రమేష్, మాజీ కార్పొరేటర్ బొడ్డు రవీందర్, నీరటి శ్రీనివాస్, బొడ్డుపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ధర్మ కృష్ణ, నారాయణదాసు మారుతి, మెతుకు దేవరాజు, రాంజీ, రవి శంకర్, పాలడుగు కనకరాజు, తక్కల్లపల్లి సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# పట్టణాభివృద్ధే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పన

**పనులను పరిశీలించిన చైర్మన్ పుల్కం రాజు, కమిషనర్ లోకేష్**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 20 (జనంసాక్షి) :** వేములవాడ పట్టణాభివృద్ధే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పన చేస్తూ జరుగుతున్న పనులను శనివారం చైర్మన్ పుల్కం రాజు, కమిషనర్ లోకేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ వేములవాడ పట్టణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగానే రహదారుల ఆధునీకరణ, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తున్నమన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ,కృషితో రెండు బైపాస్ రోడ్డులలో చేపడుతున్న సెంటర్ లైటింగ్ ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు.బైపాస్ రోడ్ల పొడవునా జరుగుతున్న విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వైరింగ్ పనులను పరిశీలించామన్నారు. పనుల నాణ్యత,ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను అక్కడ ఉన్న ఇంజనీరింగ్ అధికారులు,కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నమన్నారు.రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎక్కడా నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకుండా, అత్యాధునిక సాంకేతికతతో,నిర్ణీత గడువులోగా పనులన్నీ ముగించి త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. బైపాస్ రోడ్డులో సెంటర్ లైటింగ్ అందుబాటులోకి వస్తే చీకటి కారణంగా జరిగే రహదారి ప్రమాదాలు పూర్తిగా తగ్గుముఖం పడతాయన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
21 జూన్ 2026

# ప్రభుత్వం పంటలు కొనకపోతే నాయకుల కాలర్ పట్టుకొని నిలదీయాలి

- రైతు పాండురంగ్ కుటుంబాన్ని పరామర్శించిన కేటిఆర్
- రెండేళ్లలో మళ్లీ కల్వకుంట్ల కేసీఆర్ వస్తారు
- బాధిత కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందజేత



**సిరికొండ, జూన్ 20 (జనంసాక్షి) :** ప్రభుత్వం పంటలు కొనకపోతే నాయకుల కాలర్ పట్టుకుని నిలదీయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సిరికొండ మండలంలోని పొన్న గ్రామానికి చెందిన రైతు పాండురంగ్ ఇటీవల ఆత్మహత్య చేసున్న విషయం తెలుసుకొని శనివారం కేటీఆర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంతకు ముందు పాండురంగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారిని పరామర్శించి పాండురంగ్ కుటుంబ సభ్యులకు తనకు తోచినంత రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం వీడియో సమవేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులెవరూ ఆత్మహత్యలు చేసుకొని తమ కుటుంబాలను అనాథలను చేయవద్దని, ధైర్యంగా పోరాడాలని కేటీఆర్ రాష్ట్ర రైతులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం పంటలు కొనకపోతే నాయకుల కాళ్లు పట్టుకోవద్దని, వారి కాలర్ పట్టుకొని నిలదీయాలని, రోడ్డెక్కకుండా కాంగ్రెస్ నాయకుల ఇళ్ల ముందు కూర్చొని తమ హక్కుల కోసం ప్రశ్నించాలని సూచించారు. రైతులకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రెండేళ్లలో మళ్లీ కేసీఆర్ వస్తారని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రిలు, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ భూక్య జాన్సన్ నాయక్, వివిధ మండల కన్వీనర్ లు, మాజీ తాజ సర్పంచ్ లు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలి

- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



**హైదరాబాద్, జూన్ 20 (జనంసాక్షి) :** యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, శరీరం-మనసు-ఆత్మల సమన్వయానికి దోహదపడే సమగ్ర జీవన విధానమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 24 గంటల కౌంట్‌డౌన్ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, మానసిక ఒత్తిళ్లు, వేగవంతమైన జీవనశైలితో కూడిన ప్రస్తుత కాలంలో యోగా ప్రతి ఒక్కరికీ అంతర్గత ప్రశాంతత, క్రమశిక్షణ, సానుకూల శక్తిని అందిస్తుందని పేర్కొన్నారు. యోగా భారతీయ సనాతన జ్ఞాన సంపదకు ప్రతీకగా నిలిచి, నేడు ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య చైతన్యానికి మార్గదర్శకంగా మారిందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషించారని గవర్నర్ కొనియాడారు. 2014లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 177 దేశాల మద్దతుతో జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించడం భారతదేశానికి గర్వకారణమని చెప్పారు. భారతీయుల ప్రాచీన వారసత్వమైన యోగా నేడు ప్రపంచానికి ఆరోగ్యం, మానసిక సమతుల్యత సందేశాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. యోగాను కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలోని ప్రతి పౌరుడు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన, సమృద్ధి చెందిన, ఆత్మనిర్భర్ భారత నిర్మాణం సాధ్యమవుతుందని గవర్నర్ అన్నారు. "యోగతో ఆరోగ్యం, యోగతో సమతుల్యత, యోగతో ఆత్మబలం" అనే సందేశాన్ని ప్రజలు ఆచరణలో పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్, విజయేంద్ర ప్రసాద్, ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రాకేష్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, సినీ నటి పాయల్ రాధాకృష్ణ, సినీ హీరో నవీన్ పొలిశెట్టి, నటి డింపుల్ పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, యోగ గురువులు, యోగ సాధకులు ప్రజా ప్రతినిధులు ,యువతీ యువకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి హాస్టల్ విద్యా వికాసానికి కేంద్రంగా మారాలి




- జూలై 14-24 మధ్య హెచ్ఎండిప గ్రౌండ్స్ లో కుల వృత్తుల ప్రదర్శన, మట్టి కుండల స్టాల్స్
- త్వరలో సిద్దిపేటలో బీసీ స్టడీ సర్కిల్ భవనం ప్రారంభం
- బీసీ సంక్షేమ శాఖ పనితీరుపై సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రతి హాస్టల్ విద్యా వికాసానికి కేంద్రంగా మారాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని జిల్లా బీసీ అభివృద్ధి అధికారులు, సహాయ బీసీ అభివృద్ధి అధికారులు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్లు, శాఖాధికారులతో ప్రజా భవన్‌లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల విద్యా, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాల ద్వారా బీసీ యువతను సాధికారత కలిగిన వర్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు 96.05 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని మంత్రి తెలిపారు. రాష్ట్ర సగటు ఉత్తీర్ణత శాతం 95.15 కంటే ఇది అధికమని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరైన 4,941 మంది విద్యార్థుల్లో 4,746 మంది ఉత్తీర్ణులయ్యారని, రాష్ట్రవ్యాప్తంగా 285 హాస్టళ్లు 100 శాతం ఫలితాలు సాధించాయని వెల్లడించారు. 641 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో బీసీ హాస్టళ్లలో 51.63 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, హనుమకొండ జిల్లాలు మెరుగైన ఫలితాలు సాధించాయని తెలిపారు. రెండో సంవత్సరం పరీక్షల్లో 71.85 శాతం ఉత్తీర్ణత నమోదైందని, హనుమకొండ, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు జిల్లాలు ఉత్తమ ఫలితాలు సాధించాయని వెల్లడించారు. తక్కువ ఫలితాలు సాధించిన జిల్లా అధికారులను మందలించారు. ఈ సంవత్సరం మంచి మార్కులు సాధించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు కోసం ప్రత్యేక శిక్షణ, మెంటరింగ్, మోడల్ పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అదనపు విద్యా సహాయం అవసరమైన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు యూనిఫాం క్లాత్, నోట్‌బుక్స్, బెడ్‌షీట్లు, ట్రంక్ బాక్స్, స్కూల్ బ్యాగ్, ట్రాక్‌సూట్, షూస్, సాక్స్, బ్లాంకెట్లు, స్టేషనరీ సామగ్రి తదితర అవసరమైన వస్తువులతో కూడిన సమగ్ర వెల్కమ్ కిట్ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

# ప్రియుడి మోజులో రెండేళ్ల కొడుకు హత్య

- ఫిట్స్‌తో చనిపోయాడని భర్తను నమ్మించిన భార్య
- అనుమానంతో పోలీసులకు ఫిర్యాదుతో బయటపడ్డ బండారం



**సిద్దిపేట, జూన్20 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లాలో దారుణం జరిగింది. ప్రియుడితో ఏకాంతంగా గడిపేందుకు అడ్డొస్తున్నాడని రెండేళ్ల కొడుకునే ఓ కన్నతల్లి హత్యచేసింది. ఫిట్స్ వచ్చి చనిపోయాడని అందర్నీ నమ్మించింది. కానీ తండ్రికి అనుమానం రావడంతో 20 రోజుల తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన స్వామి క్యాబ్ డ్రైవర్. భార్య జ్యోతి, రెండేళ్ల కుమారుడు హరికృష్ణతో కలిసి కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో జ్యోతి నవీన్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుంది. భర్త లేని సమయంలో ప్రియుడిని ఇంటికి పిలుచుకునేది. ఇలా వాళ్లిద్దరూ ఏకాంతంగా ఉన్న సమయంలో బాబు తరచూ ఏడుస్తుండటంతో నవీన్ చిరాకు పడ్డాడు. ఈ క్రమంలోనే నీ కొడుకు నాకు నచ్చలేదు.. వాడిని చంపేద్దామని జ్యోతితో చెప్పాడు. అందుకు జ్యోతి కూడా ఓకే చెప్పింది. దీంతో ఇద్దరూ కలిసి ఏడుస్తున్న బాబును.. క్రూరంగా నేలకేసి కొట్టి చంపారు. బాబు చనిపోయిన తర్వాత నాటకమాడిన జ్యోతి.. భర్త స్వామి ఇంటికి రాగానే అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి బాబు చనిపోయాడని ఏడ్చింది. భార్య మాటలు నమ్మిన స్వామి.. నిజమేనని భావించి.. అదే రోజు రాత్రి మృతదేహాన్ని స్వగ్రామమైన తీగుల్ తీసుకెళ్లి ఖననం చేశాడు. కానీ కొద్దిరోజుల తర్వాత భార్య ప్రవర్తనలో తేడా రావడంతో స్వామికి అనుమానం మొదలైంది. పైగా ఇంట్లో రక్తపు మరకలు కనబడటంతో అది కాస్త బలపడింది. దీంతో తన కొడుకు మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారించగా.. జ్యోతి నేరం అంగీకరించింది. ఈ ఘటనలో జ్యోతిని పోలీసులు అరెస్టు చేయగా.. నవీన్ పరారీలో ఉన్నాడు.

# బాల్య వివాహాలు లేని తెలంగాణ కోసం కృషి

- బాలలహక్కుల పరిరక్షణ కమిటీ కృషి చేయాలి
- సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క సూచన




**హైదరాబాద్, జూన్20 (జనంసాక్షి) :** తెలంగాణను బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని మంత్రి సీతక్క సూచించారు. అలాగే పిల్లల రక్షణ చర్యలను మరింత బలోపేతం చేయడం, పిల్లలపై జరుగుతున్న దుర్వినియోగం మరియు పోక్సో కేసులను తగ్గించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య మరియు సక్షమ్ అంగన్‌వాడీ కార్యక్రమాలపై రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గౌరవ అధ్యక్షురాలు సీతా దయాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా మరియు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలు, పిల్లల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి మంత్రి వివరించారు. బాల్య వివాహాలు ఇంకా కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్నందున వాటిని నివారించాలన్నారు. శాఖలోని ప్రతి అధికారి మరియు సిబ్బంది వాటి నివారణకు కృషి చేసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్ సమావేశంలో పాల్గొని, మహిళలు, పి ల్లల సంక్షే మానికి సంబం ధించిన విధానా లను సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారులు తమ అత్యుత్తమ సామర్థ్యంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకురాలు ఎన్. మోతి జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారులు , జిల్లా బాలల పరిరక్షణ అధికారులు, అలాగే తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గౌరవ సభ్యులు మర్రిపల్లి చందన, బండి అపర్ణ, కంచర్ల వందన గౌడ్, ప్రేమలత అగర్వాల్, గోగుల సరిత బుర్కా వచన్ కుమార్ పాల్గొన్నారు.

### వీబీజీ రామ్‌జీ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

**కేంద్రానికి మంత్రి సీతక్క నిరసన లేఖ**

వీబీజీ రామ్‌జీ చట్టం గ్రామీణ పేదల ఉపాధి హక్కును బలహీనపరుస్తోందని, ఈ చట్టాన్ని ఉపసంహరించుకుని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)ను యథాతథంగా కొనసాగించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి సీతక్క మూడు వేర్వేరు లేఖలు రాసి తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలు, సూచనలను తెలియజేశారు. వీబీజీ రామ్‌జీ చట్టం అమలుకు సంబంధించి కేంద్రం రూపొందించిన నిబంధనల్లో అనేక అంశాలు పేదలు, దళితులు, ఆదివాసీ గిరిజనులు, భూమిలేని గ్రామీణ కుటుంబాల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ముఖ్యంగా నిధుల కేటాయింపును రాష్ట్ర స్థాయిలో నిర్ణయించడం వల్ల గ్రామ పంచాయతీ స్థాయిలో ఉన్న వాస్తవ ఉపాధి అవసరాలు విస్మరణకు గురవుతున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, ములుగు, నాగర్‌కర్నూల్ వంటి వెనుకబడిన జిల్లాల్లో అధిక ఉపాధి అవసరాలు ఉన్నప్పటికీ రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా పరిగణించడం వల్ల ఆ ప్రాంతాలకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

# విద్యుత్ కేంద్ర విభాగాల ప్రైవేటీకరణ టెండర్‌కు నిరసన

- రెండో రోజు నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల ఆందోళన




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** విద్యుత్ కేంద్రంలోని బొగ్గు నిర్వహణ విభాగం, బూడిద నిర్వహణ విభాగాల ప్రైవేటీకరణ టెండర్‌ను వ్యతిరేకిస్తూ రెండవ రోజు ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. రూ.255 కోట్ల వ్యయంతో మూడు ఏళ్లపాటు ప్రైవేట్ సంస్థలకు అప్పగించే టెండర్‌ను ఉపసంహరించుకోవాలని ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. భోజన విరామ సమయంలో ఆందోళన చేశారు. ప్రైవేటీకరణ వల్ల సంస్థ ప్రయోజనాలు దెబ్బతింటాయని, ఉద్యోగ భద్రతకు ముప్పు వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థలోని ఇతర విభాగాల ప్రైవేటీకరణకు దారితీస్తుందని ఆందోళన చెందారు. రెండు విభాగాలను ప్రభుత్వ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఆధ్వర్యంలోనే కొనసాగించాలని కోరారు. ఈ నిరసనలో సంఘ నాయకులు, ఇంజనీర్లు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిట్టీల వ్యాపారం చేస్తున్న టీచర్ సస్పెన్షన్

**హన్మకొండ, జూన్20 (జనంసాక్షి) :** చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్న గవర్నమెంట్ టీచర్‌పై వేటుపడింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి జడ్పీ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కలువల ఎల్లయ్యను సస్పెండ్ చేశారు. ఈ మేరకు డీఈవో గిరిరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ, మోసాలకు పాల్పడుతున్నాడని ఇటీవల కలువల ఎల్లయ్యపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఆరోపణలపై విచారణ కోసం కలెక్టర్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ జరిపిన ప్రాథమిక విచారణలో నేరం రుజువు కావడంతో డీఈవో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

# నిరంజన్ కుటుంబానికి బండ్ల గణేశ్ అండ

- 5లక్షల సాయంగా చెక్కు అందజేత

**హన్మకొండ, జూన్20 (జనంసాక్షి) :** ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్న హనుమకొండ బాలుడు నిరంజన్ కుటుంబానికి ప్రముఖ చిత్ర నిర్మాత బండ్ల గణెిష్ 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం ప్రకటించిన సంగతి తెలిసిందే. శనివారం హనుమకొండ, హనుమాన్ నగర్‌లోని బాలుడి ఇంటికి బండ్ల గణెిష్ వెళ్లారు. నిరంజన్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నిరంజన్ తల్లిదండ్రులు రాంగోపాల్ చారి, మానసలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పరమేశ్వర ఆర్ట్స్ ప్రొడక్షన్ తరఫున ఐదు లక్షల రూపాయల చెక్‌ను నిరంజన్ తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'పవన్ కల్యాణ్ భక్తుడిగా.. ఆయన స్ఫూర్తితో నిరంజన్‌కు ఆర్థిక సాయం చేశాను. దైవసమానులైన పవన్ కల్యాణ్ పరామర్శతో నిరంజన్ విషయం నా దృష్టికి వచ్చింది. మేమందరం ఇలా ఉన్నామంటే పవన్ కల్యాణ్ దయతోనే. నా కూతురి పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నా. ఈ రోజు వచ్చి ఆర్థిక సాయం చేయాలనుకున్నాను. నారా భువనేశ్వరి పుట్టిన రోజున ఐదు లక్షల రూపాయలు ఇవ్వడం సంతోషంగా ఉంది. నిరంజన్ బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఇప్పుడు రాజకీయాల గురించి మాట్లాడను' అని అన్నారు.

# రాధాగాయత్రిని వేధించిన చంపిన భరత్ శ్రీచరణ్

- శ్రీచరణ్ పెద్ద సైకో అన్న స్నేహితురాళ్లు
- విచారిస్తేనే నిజాలు బయటకొస్తాయని వెల్లడి

**హైదరాబాద్, జూన్20 (జనంసాక్షి) :** సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రాధాగాయత్రి తన భర్తతో కలిసి ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీకి ట్రిప్‌నకి వెళ్లి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఇప్పటికే రాధాగాయత్రి మృతిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తమ కుమార్తె మృతికి అల్లుడు శ్రీచరణ్ కారణం అంటూ ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. ఢిల్లీ వెళ్లక ముందు హైదరాబాద్‌లో ఆమె పని చేశారు. ఈనేపథ్యంలో రాధాగాయత్రి మృతిపై.. తన స్నేహితులు సంచలన విషయాలు వెల్లడించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. గతంలో ఆమెని భర్త మానసికంగా వేధింపులకు గురిచేశాడని మృతురాలి స్నేహితులు ఆరోపించారు. తనకు పదేళ్లుగా రాధాగాయత్రి తెలుసునని ఆమె స్నేహితురాలు చరిత తెలిపారు. రాధాగాయత్రి చాలా మంచి వ్యక్తి అని చెప్పారు. చదువులో ఎప్పుడూ ముందు ఉండేదని.... ఎదుటి వారికి మంచి చేయాలనే మనస్తత్వం ఉందని పేర్కొన్నారు. ఆమె లేదనే విషయాన్ని తాము జీర్ణించుకోలేకపోతున్నామని చెప్పారు. గత ఆరునెలలుగా రాధాగాయత్రి చాలా ఇబ్బందులకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. పెళ్లయ్యాక గాయత్రిని శ్రీ చరణ్ ఎప్పుడూ అనుమానిస్తూనే ఉండేవాడని చెప్పారు. తను చెప్పిన విధంగా ఉండాలని.... ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా అనుమానంతో వేధించేవాడని తెలిపారు. గాయత్రి సైకాలజీలో డిగ్రీ కూడా చదివిందని ప్రస్తావించారు. సైకలాజికల్ ఇబ్బందులతో శ్రీ చరణ్ బాధపడేవాడని ఆమె గుర్తించిందని అన్నారు. ఎన్నిసార్లు హింసించిన భర్త వేధింపులు తట్టుకునేదని.... శ్రీ చరణ్ ప్రవర్తనని మార్చాలనుకుని ప్రయత్నించేదని తెలిపారు. ఆమె చనిపోయిన సమయంలో శ్రీ చరణ్ ఏమి జరిగిందో ఇప్పటికీ ఎందుకు చెప్పట్లేదని స్నేహితురాలు చరిత ప్రశ్నించారు. శ్రీ చరణ్ సైకో ప్రవర్తనతో ఉండేవాడని..... అదే విషయం గతంలో తమతో కూడా గాయత్రి చెప్పిందని పేర్కొన్నారు. గాయత్రి మృతిపై మీడియాలో అనేక విధాలుగా ప్రచారం చేస్తున్నారని చెప్పారు. వాస్తవాలు బయటపడేవరకు అవాస్తవాలు ప్రచారం చెయ్యొద్దని కోరుకుంటున్నామని అన్నారు. ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయనే విషయం శ్రీ చరణ్ తల్లిదండ్రులకు తెలుసునని చెప్పుకొచ్చారు. గతంలో యూపీఎస్సీకి గాయత్రి ప్రిపేర్ అవుతానని అడగ్గానే ఆమె భర్త వ్యతిరేకించాడని అన్నారు. అత్తమామలు మాత్రం యూపీఎస్సీ ప్రిపరేషన్‌కి అనుమతి ఇచ్చారని తెలిపారు. పక్కా ప్రణాళికతోనే ముస్సోరికి తీసుకువెళ్లి గాయత్రిని శ్రీ చరణ్ చంపేశాడని ఆరోపించారు. శ్రీ చరణ్ అత్తమామల నుంచి గాయత్రికి ఎలాంటి వేధింపులు లేవని స్పష్టం చేశారు. శ్రీ చరణ్ వేధింపులతో మానసిక ఇబ్బందులకు గాయత్రి గురైందని చెప్పారు. గాయత్రి మృతిపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని కోరారు. శ్రీ చరణ్‌ను సమగ్రంగా విచారిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని స్నేహితురాళ్లు తెలిపారు. గాయత్రికి తెలియకుండా శ్రీ చరణ్ ఆమె బ్యాగ్‌లో జీపీఎస్ ట్రాకర్ పెట్టాడని గాయత్రి స్నేహితురాలు రుక్మిణి వెల్లడించారు. గాయత్రి ఎక్కడికి వెళ్లినా ట్రాకర్ ద్వారా కదలికలు తెలుసుకునేవాడని అన్నారు. జీపీఎస్ ట్రాకర్ గుర్తించి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి భర్తపై కేసు పెడదామని గాయత్రి అనుకున్నారని తెలిపారు. సమాజంలో తల్లిదండ్రుల పరువు పోతుందని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని అన్నారు. పెళ్లి అయ్యాక చాలా ఇబ్బందులకు గురైందని తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న సమయంలో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌కి చెప్పి ఏదో విధంగా సీసీ పుటేజ్ వీడియోస్ తీసుకునేవాడని చెప్పుకొచ్చారు. ఆ వీడియోస్ చూపించి ఆమెని ఇబ్బందులకు ఆమె భర్త గురి చేసేవాడని గాయత్రి స్నేహితురాలు రుక్మిణి పేర్కొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370